www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 26-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 180
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: నవమి మ. 12.26 తదుపరి దశమి; నక్షత్రం: పునర్వసు రా. 11.34 తదుపరి పుష్యమి; వర్జ్యం: ఉ.10.58-12.39; దుర్ముహూర్తం: ఉ.10.06-10.54, మ.2.53-3.41; అమృతఘడియలు: రా.9.02-10.43; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.04
వరంగల్
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత్‌లో ఏ ప్రాంతాన్నీ పాకిస్థాన్ అని అనొద్దు

అది ప్రాదేశిక సమగ్రతకే విరుద్ధం.. కర్ణాటక న్యాయమూర్తి వ్యాఖ్యలపై సీజేఐ ఆక్షేపణ

న్యాయమూర్తులు యథాలాపంగా చేసే వ్యాఖ్యలు వివక్షాపూరితంగా ఉండే ప్రమాదం

న్యాయనిర్ణయంలో నిష్పాక్షికత, సహేతుకత అవసరమని హితబోధ

బడిలో పిల్లల భద్రత యాజమాన్యం బాధ్యతే!

కేంద్రం మార్గదర్శకాలు పాటించాల్సిందే

రాష్ట్రాలు, యూటీలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

2



రుణమాఫీ కోసం రైతుల ఎదురుచూపులు

రూ.2 లక్షల పైన రుణం ఉన్న రైతుల్లో అయోమయం

ఏడాదిలోపు కట్టకుంటే వడ్డీ రాయితీ హుళక్కే

రెన్యువల్ చేసుకుంటే పావలా వడ్డీ, లేకపోతే అధిక వడ్డీ

రైతు వాటా, ప్రభుత్వ వాటా చెల్లింపులకు ఖరారు కాని తేదీ

రైతులు స్వచ్ఛందంగా రెన్యువల్ చేసుకుంటున్న వైనం

డబ్బులు సర్దుబాటు కాక కొందరు రైతుల ఇబ్బందులు

నిధుల వేటలో ప్రభుత్వం, రూ. 9 వేల కోట్లు అవసరం



హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండు లక్షల రూపాయలకు మించి పంట రుణాలున్న రైతులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం తన వాటా రూ2 లక్షలు ఎప్పుడు చెల్లిస్తుంది, తమ వాటా ఎప్పుడు చెల్లించాలనే విషయంలో ఒక నిర్దిష్ట తేదీ చెప్పకపోవటంతో రైతులు ఆయోమయానికి గురవుతున్నారు. ఎందుకంటే.. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో ఏడాదిలోపు చెల్లిస్తే 4 శాతం వడ్డీ రాయితీ వస్తుంది. ఒకవేళ ఆలోపు చెల్లించకపోతే ఆ రాయితీ రాకపోగా అధిక వడ్డీ కట్టాల్సి ఉంటుందని ఆందోళనకు గురవుతున్నారు. నిర్ణీత గడువులో రుణమాఫీ జరిగి, అప్పులు రెన్యువల్ అయితేనే రైతులకు చిక్కులు తొలగిపోతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం రుణమాఫీ పథకంలో భాగంగా 2023 డిసెంబరు 9 వరకు రైతులకు ఉన్న రుణాలను, వాటిపైన అయిన వడ్డీని కలిపి మాఫీ చేస్తామని ప్రకటించింది. అయితే నెలలు గడుస్తున్న కొద్దీ.. ప్రభుత్వం ఇచ్చిన మాటమేరకు రుణమాఫీ చేసినా వడ్డీ భారం మాత్రం రైతుల మీదే పడుతోంది. 7 శాతం వడ్డీలో 4 శాతం సబ్సిడీ తెచ్చుకోవాలంటే

మిగతా 12వ పేజీలో...



హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ఆడిటోరియంలో బీఎఫ్ఎస్ఐ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

రెండు నెలల్లో.. మరో 35 వేల ఉద్యోగాలు

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత

వచ్చే ఏడాది నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్‌లో ఇంటర్న్‌షిప్.. కనీస ప్రమాణాల్లేని ఇంజనీరింగ్ కాలేజీల గుర్తింపు రద్దు

ఉపాధి లేక వ్యసనాల బారిన పడుతున్న యువత.. బీఎఫ్ఎస్ఐ స్కిల్ ప్రోగ్రాం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే రెండు నెలల్లో మరో 35 వేల ఉద్యోగ నియామకాల దిశగా.. ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన వెల్లడించారు. గత పదేళ్లలో రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో రాష్ట్రంలో కొంత మంది యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలయ్యారని.. ఇటీవల పట్టుబడిన డ్రగ్ పెడ్లర్లలో ఇంజనీరింగ్ విద్యార్థులు ఉండటం ఆందోళన కలిగించిందని ఆవేదన వెలిబుచ్చారు. వ్యసనాల నుంచి యువతను బయటపడేయాలంటే ఉపాధి కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. హైదరాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడంతో పాటు నైపుణ్యాల అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. బుధవారం ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్) స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. బీఎఫ్ఎస్ఐ వెబ్‌సైట్‌ను, కోర్సులతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో గత పదేళ్లలో నిరుద్యోగం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లోనే 30 లక్షల మంది నిరుద్యోగులు తమ వివరాలను నమోదు

మిగతా 13వ పేజీలో...

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

దసరా నాటికి పథకం అమలుకు కమిటీలు

విధివిధానాలు రూపొందించండి 13

రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయండి

హౌసింగ్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్

కులగణనకు 4 రోజుల్లో

మార్గదర్శకాలు

బీసీ రిజర్వేషన్లు 42%కు పెంచుతాం

గణన తర్వాతే స్థానిక ఎన్నికలు 12

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

మూసీపై కేసులు ఎత్తేయండి

మంత్రి దామోదరకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల విజ్ఞప్తి

గాంధీభవన్‌లో 'మంత్రితో ముఖాముఖి'కి భారీ స్పందన 13

పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే హరియాణా అభివృద్ధికి బ్రేక్!



బుధవారం తన నివాసంలో చెస్ గ్రాండ్ మాస్టర్లు ప్రజ్ఞానంద, అర్జున్‌లతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

నేతల గ్రూపులతో రాష్ట్రం విధ్వంసం 2

కర్ణాటక, హిమాచల్, తెలంగాణల్లో ముఖ్యమంత్రి, మంత్రుల కుమ్ములాటలు

అస్థిరతకు, అవినీతికి కాంగ్రెస్ మారుపేరు

ఎస్సీ, ఎస్టీల హక్కులనూ దోచేసింది

కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గి.. బీజేపీ గ్రాఫ్ పెరిగింది

హరియాణా ఎన్నికల ప్రచారంలో మోదీ



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

ఐదేళ్లలో పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి

బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఎకరాకూ నీరందలేదు

పాలమూరు-రంగారెడ్డికి 27 వేల కోట్లు ఖర్చు

కాంగ్రెస్ ప్రారంభించిన పథకాల్ని పడావు పెట్టారు

కృష్ణాలో 'పాలమూరు' వాటానూ సాధించలేదు

కర్ణాటకతో కలిసి 'గట్టు' సామర్థ్యం పెంచుతాం

ప్రాజెక్టుల పరిశీలనలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : 'రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నారు. వెనుకబడిన పాలమూరు జిల్లాను వలసలు లేని, సస్యశ్యామల ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ఐదేళ్లలోనే పాలమూరు-రంగారెడ్డి సహా

మిగతా 13వ పేజీలో...

బిల్లుల కోసం అప్పులా..?

1 కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఆదాయం ఎలా?

1 నిర్వహణకు నిధులెక్కడి నుంచి వస్తాయి?

1 రుణాలు తీసుకోవాలని ఆదేశించిందెవరు?

1 తిరిగి రుణాల చెల్లింపు ఎలా చేస్తారు?

1 కాళేశ్వరం కార్పొరేషన్ అధికారులపై పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నల వర్షం

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌ను.. కేవలం రుణాలు తీసుకొని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికే ఏర్పాటు చేశారా? కార్పొరేషన్‌కు ఆస్తులున్నాయా? ఆదాయం ఏమైనా ఉందా? దీని నిర్వహణకు నిధులెక్కడివి? కాగ్ నివేదిక ఆమోదయోగ్యమైనదేనా?" అంటూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌తో ముడిపడిన అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించింది. బుధవారం కాళేశ్వరం ప్రాజెక్టులోని ఆర్థిక అంశాలపై ముగ్గురు అధికారులను కమిషన్ విచారించింది. కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ నుంచి రుణాలు తీసుకోవాలని ఆదేశించిందెవరు? అని కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (సీఏవో)గా పనిచేసిన కొమ్రరాజు వెంకట అప్పారావును

మిగతా 3వ పేజీలో...



చెన్నైలో కామ్‌దార్‌నగర్ మొదటి వీధికి

ఎస్పీ బాలు పేరు

అక్కడే నివసించిన గానగంధర్వుడు

బాలు తనయుడు చరణ్ కోరిక మేరకు

తమిళనాడు సీఎం స్టాలిన్ నిర్ణయం 10

ఏఆర్ ఫుడ్స్‌పై క్రిమినల్ కేసు

టీటీడీ ఫిర్యాదుతో తిరుపతిలో నమోదు

నేరపూరిత కుట్ర, మోసం, కల్తీ సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు 12



నర్సాపూర్‌లో వేలం పాట నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

రైస్ మిల్లర్ భూమి వేలం

1 1.31 ఎకరాలకు రూ.2.12 కోట్లు.. నర్సాపూర్‌లో ఘటన

1 సీఎంఆర్ బకాయిల నేపథ్యంలో రెవెన్యూ రికవరీ చట్టం అమలు

1 మొత్తం బకాయిలు రూ.47 కోట్లు.. గతంలోనే భవనం, స్థలం వేలం

1 ఖమ్మం, మహబూబాబాద్ మిల్లుల్లో విజిలెన్స్ అధికారుల సోదాలు

నర్సాపూర్, కొణిజర్ల, మహబూబాబాద్, సెప్టెంబరు 25: కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) బకాయిల అంశంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. మొండి బకాయిల వసూళ్లకు రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ(ఆర్ఆర్) చట్టాన్ని ఉపయోగిస్తోంది. సదరు మిల్లర్ ఆస్తులను జప్తు చేసి వేలం పాటలో విక్రయిస్తోంది. ఇందులో భాగంగా మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన శ్రీధర్ గుప్తా అనే రైస్‌మిల్లర్‌కు చెందిన 1.31 ఎకరాల భూములకు బుధవారం వేలం పాట నిర్వహించింది. వేర్వేరు వ్యక్తులు రూ.2.12 కోట్లకు ఈ భూమిని వేలంలో సొంతం చేసుకున్నారు. శ్రీధర్ గుప్తా రూ.47 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం బకాయి ఉన్నారు. ఇందుకు సంబంధించి శ్రీధర్ గుప్తాకు చెందిన ఆస్తులను అధికారులు ఫిబ్రవరిలోనే జప్తు చేశారు. అదే నెల 27న వేలం నిర్వహించారు. నర్సాపూర్‌లో సదరు

మిగతా 14వ పేజీలో...

15 వేల ఇళ్లు!

మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తూ జీవో జారీ

గ్రేటర్ పరిధిలోని మూసీ రివర్ బెడ్, బఫర్‌జోన్‌లోని బాధితులకు మాత్రమేనని స్పష్టీకరణ

పునరావాసం తర్వాతే నిర్మాణాల తొలగింపు: దానకిశోర్

సర్వేకు వచ్చిన సిబ్బందిని అడ్డుకున్న నిర్వాసితులు

అమీన్‌పూర్‌లో హైడ్రా.. గోల్డెన్ కీ అపార్ట్‌మెంట్ల పరిశీలన

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, చాదర్‌ఘాట్, రాజేంద్రనగర్, పటాన్‌చెరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న 15వేల కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ సుందరీకరణ పనుల కోసం ఆ నదీ పరీవాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న వారిని ప్రభుత్వం అక్కడి నుంచి తరలించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయిస్తూ జీవో నంబర్ 754 జారీ చేసింది. అయితే జీహెచ్ఎంసీ పరిధిలోని మూసీ రివర్ బెడ్, బఫర్‌జోన్‌లో ఇళ్లు కోల్పోయిన నిరుపేదలే ఈ ఇళ్లకు అర్హులు అని జీవోలో

మిగతా 14వ పేజీలో...

'హైడ్రా'కు 169 పోస్టుల మంజూరు

డిప్యుటేషన్‌పై భర్తీకి ప్రభుత్వం కసరత్తు 13



సచివాలయ నిర్మాణ వ్యయంపై విజిలెన్స్ విచారణ

నిర్మాణం, నాణ్యత, ఐటీ పరికరాల కొనుగోళ్లలో ఖర్చు భారీగా పెరగడంపై.. ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

రూ.617 కోట్లు అంచనా వేస్తే రూ.1,140 కోట్లకు చేరిక

ఐటీ సామగ్రికి మరో రూ.361 కోట్లు

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సచివాలయ నిర్మాణం, వ్యయం అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయానికి వెచ్చించిన నిధులు, నిర్మాణం, నాణ్యత, ఐటీ పరికరాల కొనుగోలు అంశాలను తేల్చాలని విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన ఫైలు సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దగ్గర నుంచి కదిలినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వాస్తవానికి సచివాలయ నిర్మాణానికి తొలుత రూ.617 కోట్లు ఖర్చవుతుందని అప్పటి బీఆర్ఎస్ సర్కారు అంచనా వేసింది. నిర్మాణం పూర్తయ్యేసరికి

మిగతా 14వ పేజీలో...



కంగన కారుకూతలతో

బీజేపీకి నష్టం

సిక్కులు, రైతులపై తరచూ అర్థరహిత, నిరాధార, అడ్డగోలు వ్యాఖ్యలు

ఒక పంజాబీగా తీవ్రంగా ఖండిస్తున్నా

సాగు చట్టాలను తిరిగి తేవాలనడం తప్పు

ఆమె వ్యాఖ్యలకు బీజేపీకి సంబంధం లేదు

బీజేపీ అధికార ప్రతినిధి జయవీర్ షెర్గిల్

హరియాణా ఎన్నికల వేళ.. 2

కంగన తీరుతో రాజకీయ దుమారం

జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వకపోతే రోడ్డెక్కుతాం



జమ్మూ, సెప్టెంబరు 25: అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేంద్రం జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వకపోతే పార్లమెంట్‌తో పాటు రోడ్డెక్కి ఇండియా బ్లాక్ ఆందోళన నిర్వహిస్తుందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. జమ్మూలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా నిర్వహించిన ఎన్నికల సభలో ఆయన ప్రసంగించారు. బయటివారికి ప్రయోజనం కలిగించేందుకే కేంద్రం జమ్మూకశ్మీర్ నుంచి రాష్ట్ర హోదా తొలగించిందని ఆయన ఆరోపించారు. స్థానికులతో కాకుండా బయటివారితో రాష్ట్రాన్ని పాలించాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం యోచిస్తోందని రాహుల్ ఆరోపించారు. రాష్ట్ర హోదా జమ్మూకశ్మీర్ ప్రజల హక్కు అని, భవిష్యత్తు కూడా అదేనన్నారు. రద్దు చేసిన రైతు చట్టాలను మళ్లీ వెనక్కు తీసుకురావాలంటూ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై మోదీ వివరణ ఇవ్వాలని రాహుల్ డిమాండ్ చేశారు.

ఆసియాలో మూడో అతిపెద్ద శక్తిగా భారత్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: ఆసియాలో అత్యంత ప్రభావం చూపుతూ, శక్తిమంతంగా ఎదుగుతున్న ప్రపంచ దేశాల్లో మూడో స్థానానికి ఎగబాకింది. తాజాగా విడుదలైన ఆసియా పవర్ ఇండెక్స్‌లో జపాన్‌ను వెనక్కునెట్టిన భారత్ మూడో అతిపెద్ద శక్తిగా అవతరించిందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ప్రభావం చూపే ప్రపంచ దేశాల ఆధారంగా.. లోవీ ఇనిస్టిట్యూట్ 2018లో ఆసియా పవర్ ఇండెక్స్‌ను ప్రారంభించింది. ఈ ఏడాది ఈ జాబితాలో అమెరికా, చైనా.. సూపర్ దేశాలుగా తొలి రెండు ర్యాంకుల్లో కొనసాగుతుండగా.. జపాన్, ఆస్ట్రేలియా, రష్యా వరుసగా 4, 5, 6వ స్థానాల్లో నిలిచాయి.

రూ.1.27లక్షల కోట్లకు చేరిన రక్షణ ఉత్పత్తులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: రక్షణ రంగంలో భారత్ గణనీయమైన వృద్ధి సాధిస్తోందని, 2023-24లో దేశ రక్షణ ఉత్పత్తి రికార్డు స్థాయిలో రూ.1.27 లక్షల కోట్లకు చేరుకుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ వెల్లడించారు. ప్రస్తుతం 90కిపైగా దేశాలకు భారత్ తన రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన 'మేకిన్ ఇండియా' కార్యక్రమం వల్ల ఈ పదేళ్లలో ఘనమైన వృద్ధి సాధ్యమైందని చెప్పారు. రక్షణ రంగంలో భారత్ ప్రపంచంలోనే కీలక శక్తిగా ఎదుగుతోందన్నారు. రక్షణ ఎగుమతులు తొలిసారిగా 2023-24లో రూ.21వేల కోట్లు దాటాయని వెల్లడించారు. వచ్చే ఐదేళ్లలో దీన్ని రూ.50 వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

పని ఒత్తిడితో మరో మహిళా ఉద్యోగి మృతి

లఖ్‌నవూ, సెప్టెంబరు 25: నానాటికి పెరుగుతున్న పని ఒత్తిడి మరో మహిళా ఉద్యోగిని బలితీసుకుంది. స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మహిళా ఉద్యోగి ఆఫీసులోనే కుప్పకూలి మృతిచెందింది. నగరంలోని గోమతినగర్ విభూతిఖండ్ బ్రాంచ్‌లో అడిషనల్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న సదఫ్ ఫాతిమా మంగళవారం పనిచేస్తూ ఆఫీస్‌లోనే హఠాత్తుగా కుర్చీనుంచి కిందపడిపోయింది. తోటి ఉద్యోగులు ఆమెను ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఆమె మృతిచెందినట్లు, వైద్యులు ప్రకటించారు. విధుల్లో పని ఒత్తిడి వల్లే ఆమె మరణించిందని ఆమె సహచర ఉద్యోగులు చెబుతున్నారు. గత నెల 20న ఎర్నెస్ట్ అండ్ ఎంగ్ ఉద్యోగి అన్నా సెబాస్టియన్ పని ఒత్తిడి వల్ల ఇంట్లో కుప్పకూలి మృతిచెందిన విషయం తెలిసిందే.

కలియుగం వచ్చేసినట్లే!

» వృద్ధ దంపతుల విడాకుల కేసులో అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్య

అలహాబాద్, సెప్టెంబరు 25: ఈ కేసును చూస్తే.. అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యతో ఎవరైనా ఏకీభవించాల్సి వస్తుందేమో! ఎందుకంటే ఆమె వయసు 75 ఏళ్లు. 80 ఏళ్ల భర్తతో విడాకులు, భరణం కోరుతూ ఫ్యామిలీ కోర్టుకెక్కింది. కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పునివ్వడంతో భర్త హైకోర్టును ఆశ్రయించాడు. అలీగఢ్‌కు చెందిన మునేశ్‌కుమార్ గుప్తా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిని మంగళవారం విచారించిన అలహాబాద్ హైకోర్టు, 'కలియుగం వచ్చేసినట్లే కనిపిస్తోంది' అని వ్యాఖ్యానించింది. అయితే వృద్ధ దంపతులు అవగాహనకు వచ్చేందుకు ఒక అవకాశమిస్తున్నట్లు పేర్కొంటూ కేసు విచారణను వాయిదా వేసింది.

'బద్లాపూర్ ఎన్‌కౌంటర్'పై బాంబే హైకోర్టు ప్రశ్నల వర్షం

ముంబై, సెప్టెంబరు 25: బద్లాపూర్ లైంగిక వేధింపుల కేసు నిందితుడి ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పోలీసులపై బాంబే హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. నిందితుడు అక్షయ్ శిందే చేతులు, కాళ్లపై కాల్చకుండా నేరుగా తలపై ఎందుకు కాల్చారని నిలదీసింది. నిందితుడు కాల్చిన 3 బుల్లెట్లలో రెండు బుల్లెట్లు ఎక్కడ..? అని ప్రశ్నించింది. తన కొడుకు అక్షయ్‌ది నకిలీ ఎన్‌కౌంటర్ అని.. సిట్‌తో దర్యాప్తునకు ఆదేశించాలంటూ తండ్రి హైకోర్టును ఆశ్రయించగా.. బుధవారం విచారించింది. ఈ షూట్ అవుట్‌ని ఎన్‌కౌంటర్ అనలేమని.. నిందితుడు తుపాకీ లాక్కొని దాన్ని అన్‌లాక్ చేసి కాల్పులు జరిపాడనడం నమ్మశక్యంగా లేదని ధర్మాసనం పేర్కొంది. 'నిందితుడు తుపాకీ లాక్కుంటుంటే నలుగురు అధికారులు ఒక్కడిని ఎందుకు నియంత్రించలేకపోయారు? అలాగే ఏ శిక్షణ లేకుండా తుపాకీ అన్‌లాక్ చేయడం కూడా సులువేమి కాదు' అంటూ పోలీసులను నిలదీసింది. ఈ వివరాలన్నీ తదుపరి విచారణలోపు అందజేయాలని ఆదేశించింది. కేసుకు సంబంధించిన అన్ని ఫైళ్లను సీఐడీకి అప్పగించకపోవడాన్ని ఆక్షేపించింది. తక్షణమే అన్ని వివరాలను అందజేయాలని.. లేదంటే మరిన్ని ఊహాగానాలకు తావిస్తుందని పేర్కొంది. అలాగే నిందితుడిని తరలించిన మార్గంలోని సీసీటీవీ ఫుటేజ్‌లు, పోలీసు అధికారుల కాల్ డేటా రికార్డులను భద్రపరచాలని కోర్టు ఆదేశించింది.

'బ్రెస్ట్ రీకన్‌స్ట్రక్షన్'కు సరికొత్త విధానం

ముంబై, సెప్టెంబరు 25: అత్యంత సురక్షితమైన, వేగవంతమైన, సరికొత్త 'బ్రెస్ట్ రీకన్‌స్ట్రక్షన్' విధానాన్ని.. ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ) ఆర్ అండ్ డీ విభాగం పరిశోధకులు అభివృద్ధి చేశారు. 'బ్రాక్స్‌టన్' అనే బయలాజికల్ మెష్ ద్వారా వారు ఈ చికిత్స చేశారు. సాధారణంగా రొమ్ము క్యాన్సర్ బాధితులకు.. పరిస్థితి తీవ్రతను బట్టి రొమ్ము కణజాలాన్ని పూర్తిగా లేదా కొంత భాగం మేర తొలగిస్తారు వైద్యులు. ఒక వేళ పేషెంట్ గనక రొమ్ము ఆకృతిని తిరిగి పొందాలని భావిస్తే.. వారికి 'బ్రెస్ట్ రీకన్‌స్ట్రక్షన్ సర్జరీ' చేస్తారు. అందులో భాగంగా శరీరంలోని ఇతర భాగాల నుంచి కణజాలాన్ని సేకరించి రొమ్ము భాగంలో అమరుస్తారు. ఈ చికిత్సకు 6 గంటలు పడుతుంది. తర్వాత కోలుకోవడానికి 8 వారాల సమయం పడుతుంది. అదే బ్రాక్స్‌టన్ బయలాజికల్ మెష్ ద్వారా అయితే బ్రెస్ట్ రీకన్‌స్ట్రక్షన్‌కు 2-3 గంటల సమయమే పడుతుందని.. శరీరంలోని ఇతర కణజాలం సేకరించే అవసరం ఉండదు.

కాంగ్రెస్ గెలిస్తే అభివృద్ధికి బ్రేక్!

హరియాణా ప్రజలారా జాగ్రత్త.. ఆ పార్టీని పొరపాటున కూడా అధికారంలోకి రానివ్వొద్దు

» నేతల కుమ్ములాటతో రాష్ట్రం విధ్వంసం

» కర్ణాటక, హిమాచల్, తెలంగాణల్లో ముఖ్యమంత్రి, మంత్రుల కుమ్ములాట

» అస్థిరతకు ఆ పార్టీ మారుపేరు

» హరియాణా ఎన్నికల ప్రచారంలో మోదీ



సోనిపట్, సెప్టెంబరు 25: హరియాణాలో పొరపాటున కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అంతర్గత పోరుతో రాష్ట్రం తల్లడిల్లడం ఖాయమని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. అంతేకాదు.. హరియాణాలో సుస్థిరత, అభివృద్ధి ఆగిపోతాయని తెలిపారు. కాబట్టి హరియాణా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "కాంగ్రెస్‌కు ఓటేయడమంటే.. హరియాణా అభివృద్ధి, సుస్థిరతలను విధ్వంసంలోకి నెట్టినట్లే. వారి అంతర్గత పోరు పెట్టుబడులు, ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అస్థిరతకు మారుపేరుగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు అంతర్గత కుమ్ములాటలతో రోడ్డున పడడం కాంగ్రెస్ పాలనలోనే కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు వారికి కనిపించవని దుయ్యబట్టారు. దీనికి కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారే పెద్ద ఉదాహరణ అని మోదీ పేర్కొన్నారు. "కర్ణాటకలో సీఎం, డిప్యూటీ సీఎం అంతర్గత కుమ్ములాటలతో తీరికలేకుండా ఉన్నారు. తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లలోనూ ఇదే కథ నడుస్తోంది" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి కూపంలో పూర్తిగా కూరుకుపోయిందని మోదీ నిప్పులు చెరిగారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే అక్కడి ముఖ్యమంత్రి సిద్దరామయ్య భూకుంభకోణంలో చిక్కుకున్నారని, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ చేయాల్సిందేనని కోర్టు కూడా తేల్చి చెప్పిందంటే.. కుంభకోణం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని ప్రధాని వ్యాఖ్యానించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సోనిపట్, గోహానాలలో బీజేపీ అభ్యర్థుల తరఫున నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలకు ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్ణాటకలో వెలుగు చూసిన మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) భూ కుంభకోణాన్ని మోదీ ప్రస్తావించారు. ఈ కుంభకోణంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ప్రధాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందన్నారు. "కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ముఖ్యమంత్రి భూ కుంభకోణం ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. హైకోర్టు కూడా ఆయన అప్పీల్‌ను తిప్పికొట్టింది. అంతేకాదు.. దీనిపై సరైన విచారణ జరగాల్సిన అవసరం కూడా ఉందని తేల్చి చెప్పింది. పదేళ్ల కిందట ఇక్కడ(హరియాణ) కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల భూములను గుంజుకుని దలాల్, దమాద్‌లకు పంచిపెట్టింది. కాంగ్రెస్ పాలనలో మోసం, అవినీతి చేయని సంస్థలు లేవు" అని ప్రధాని నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో అణగారిన వర్గాలను కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్ ఫలాలను అందుకునేందుకు కూడా ఎస్సీ ఎస్టీ, ఓబీసీలు కాంగ్రెస్ హయాంలో పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయిన తర్వాతే ఎస్సీ ఎస్టీ, ఓబీసీల జీవితాలకు హక్కులు లభించాయని మోదీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే దళితులు, బీసీల హక్కులను కాలరాచేందుకు ప్రయత్నిస్తుందని దుయ్యబట్టారు. "కాంగ్రెస్‌ను మించిన అవినీతి పార్టీ మరొకటి లేదు. ప్రతి అడుగులోనూ అవినీతి, బంధుప్రీతికి ఆ పార్టీ ఆలవాలం. భారత ప్రభుత్వ వ్యవస్థలో అవినీతిని పెంచి పోషించింది కూడా కాంగ్రెస్ పార్టీనే" అని వ్యాఖ్యానించారు.

మా గ్రాఫ్ పెరుగుతోంది!

హరియాణాలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతోందని ప్రధాని అన్నారు. ఇదేసమయంలో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ నానాటికీ దిగజారుతోందని చెప్పారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ప్రాధాన్యం ఏమిటో హరియాణా ప్రజలకు తెలుసునని, అందుకే ఇక్కడి వారు కేంద్రంలోను, రాష్ట్రంలోనూ ఒకే ప్రభుత్వాన్ని ఎంచుకుంటారని వ్యాఖ్యానించారు.

ఇదీ కాంగ్రెస్ లక్షణం

హరియాణాలోని రైతులకు బీజేపీతోనే మేలు జరుగుతోందని ప్రధాని మోదీ తెలిపారు. "24 పంటలకు బీజేపీ ప్రభుత్వం కనీస మద్దతు ధరలు(ఎంఎస్‌పీ) నిర్ణయించింది. కాంగ్రెస్ హయాంలో ఎంఎస్‌పీ ప్రకారం పంటలు కొనుగోలు చేసేందుకు అనహ్యించుకుంది. ఇదీ.. కాంగ్రెస్ పార్టీ లక్షణం. దీనిని రైతులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది" అని ప్రధాని అన్నారు. నిరంతరం రైతుల శ్రేయస్సును కోరుకునే పార్టీ బీజేపీనేనని తెలిపారు. హరియాణా 'పతకాల పరిశ్రమ'గా రూపాంతరం చెందిందని హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఒలింపిక్స్‌లో హరియాణా క్రీడాకారులు రాష్ట్రం గర్వపడేలా పతకాల పంట పండించారని తెలిపారు.

లోకం తీరు



జమ్మూకశ్మీర్ రెండో విడతలో 56 శాతానికి మించి పోలింగ్

జమ్మూ, సెప్టెంబరు 25: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడతలో 56.05% పోలింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పీకే పోలే తెలిపారు. అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. ఎక్కడా రీపోలింగ్ జరపాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో అత్యల్ప ఓటింగ్ నమోదైన అనేక చోట్ల ప్రజలు ఈసారి భారీ సంఖ్యలో తరలివచ్చి ఓటేశారన్నారు. మరోవైపు, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను 16మందితో కూడిన అత్యున్నత స్థాయి విదేశీ దౌత్యవేత్తల బృందం పరిశీలించింది. ఎన్నికలు అత్యంత ఆరోగ్యకరంగా, ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్నాయని విదేశీ ప్రతినిధులు ప్రశంసించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల చివరి విడతలో భాగంగా అక్టోబర్ 1న 40 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 8న ఫలితాలు వెల్లడిస్తారు.

కంగన కారుకూతలతో బీజేపీకి నష్టం

» సాగు చట్టాలను తిరిగి తేవాలనడం తప్పు

» ఆ వ్యాఖ్యలకు బీజేపీకి సంబంధం లేదు

» బీజేపీ అధికార ప్రతినిధి జయవీర్ షెర్గిల్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: మండి ఎంపీ కంగనారనౌత్ కారుకూతలతో బీజేపీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జయవీర్ షెర్గిల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె నిరాధారమైన.. అర్థంపర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "సిక్కు సామాజికవర్గం,పంజాబ్ రైతులపై ఆమె చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా తర్కవిరుద్ధం. పంజాబ్ అభివృద్ధికి ప్రధాని మోదీ చేస్తున్న కృషికి కంగన తీరు విఘాతం కలిగిస్తోంది" అని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ కంగన తీరును తీవ్రస్థాయిలో ఎండగట్టారు. సాగు చట్టాలను తిరిగి తీసుకురావాలని కంగన చెప్పడాన్ని తప్పుబట్టారు. "కంగన కారుకూతలతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదు. ఆమె వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యం" అని దుయ్యబట్టారు. సొంత పార్టీ బీజేపీ నుంచి కూడా వ్యతిరేకత వస్తుండడంతో కంగన నష్టనివారణ చర్యలను ప్రారంభించారు. "నా వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెబుతున్నాను. ఇకపై నేను పార్టీ అభిప్రాయాల మేరకు మాట్లాడతాను" అంటూ ఓ ప్రకటనను విడుదల చేశారు. బీజేపీ మరో అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా కూడా.. "కంగన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం. సాగు చట్టాలపై ఆమె మాటలు బీజేపీ విధానాన్ని ప్రతిబింబించబోవు" అని వ్యాఖ్యానించారు. కాగా, కంగన వ్యాఖ్యలపై ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే తీవ్రంగా స్పందించారు. "750 మంది రైతులు చనిపోయిన తర్వాత కూడా రైతు వ్యతిరేక బీజేపీ, మోదీ ప్రభుత్వంలో మార్పు రాలేదు" అన్నారు. హరియాణాతోపాటు.. ఇతర రాష్ట్రాల్లో త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ప్రధాని మోదీ కూడా పార్లమెంట్ సాక్షిగా రైతులను ఆందోళన జీవులు, పరాన్నజీవులు అన్న విషయాన్ని గుర్తుచేశారు. "కంగనకు ఆరెస్సెస్, బీజేపీ నేపథ్యం లేదు. కేవలం మోదీ ప్రత్యేక శ్రద్ధతో మండి నుంచి ఆమె ఎంపీగా గెలిచేందుకు సహకరించారు. అందుకే.. కంగన వ్యాఖ్యలను మోదీ స్వయంగా ఖండించాలి" అని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

హరియాణా ఎన్నికల వేళ దుమారం

పంజాబీ రైతులపై.. రైతు చట్టాలపై కంగన చేసిన వ్యాఖ్యలు హరియాణా అసెంబ్లీ ఎన్నికల వేళ తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. సాగుచట్టాలను తిరిగి తేవాలని, రైతులే ఆ డిమాండ్ చేయాలని ఆమె అనడంతో బీజేపీ ఇరకాటంలో పడిపోయింది. రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని షాహీన్‌బాగ్‌లో రోజుల తరబడి ఆందోళనలు చేపట్టిన రైతుల్లో పంజాబ్, హరియాణాకు చెందినవారే ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే.! హరియాణా ఎన్నికల ప్రచారంలో ఓ వైపు కాంగ్రెస్.. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) దూసుకుపోతుండగా.. కంగన తాజా వ్యాఖ్యలతో బీజేపీ ఆత్మరక్షణలో పడిపోయినట్లయింది.

సిద్దరామయ్యను విచారించండి!

» డిసెంబరు 24లోగా దర్యాప్తు నివేదిక ఇవ్వండి

» లోకాయుక్త పోలీసులకు కోర్టు ఆదేశం

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్దరామయ్యపై వచ్చిన మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) ఇంటి స్థలాల వివాదంపై బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల కేసుల ప్రత్యేక కోర్టు ప్రజాప్రతినిధుల కోర్టు బుధవారం విచారణ జరిపింది. సీఎంను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన మేరకు లోకాయుక్త పోలీసులు విచారణ జరపాలని, దర్యాప్తు నివేదికను డిసెంబరు 24లోగా సమర్పించాలని న్యాయాధికారి సంతోష్‌గజానన భట్ ఆదేశించారు. విచారణకు సిద్దరామయ్య సహకరించాలని ఆ ఆదేశాలలో పేర్కొన్నారు. మైసూరు లోకాయుక్త పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి, అవసరమైతే విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకోవడానికి కూడా అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఒకటి రెండు రోజుల్లో సీఎం సిద్దరామయ్యపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత విచారణ ప్రారంభమవుతుంది. కోర్టు ఉత్తర్వులు లోకాయుక్త డీజీకి చేరాల్సి ఉంది. ఆయన సూచన మేరకు లోకాయుక్త ఎస్పీ విచారణ జరపాల్సి ఉంటుంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో సిద్దరామయ్య వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. మరోవైపు జేడీఎస్ అధికార ప్రతినిధి ప్రదీప్.. లోకాయుక్త ఎస్పీ కార్యాలయానికి వెళ్లి సిద్దరామయ్యపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విచారణకు భయపడేది లేదని సిద్దరామయ్య తెలిపారు.

భారత్‌లో ఏ భాగాన్నీ పాకిస్థాన్ అనడానికి వీల్లేదు

అది ప్రాదేశిక సమగ్రతకే విరుద్ధం: సీజేఐ

» కర్ణాటక జడ్జి వ్యాఖ్యలపై తీవ్ర ఆక్షేపణ

» ఇప్పటికే జడ్జి విచారం వ్యక్తం చేయడంతో సుమోటో విచారణ మూసివేత



బెంగళూరు-ఆంధ్రజ్యోతి/న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: భారతదేశంలోని ఏ భాగాన్నీ పాకిస్థాన్ అని అనకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. అలా సంబోధించడం దేశ ప్రాదేశిక సమగ్రతకే విరుద్ధమన్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీశానంద ఓపెన్ కోర్టులో చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్స్ ఇటీవల కలకలం రేపాయి. ఒక వీడియోలో ఆయన బెంగళూరులో ముస్లిం ప్రాబల్య ప్రాంతాన్ని 'పాకిస్థాన్' అని వ్యాఖ్యానించారు. రెండో క్లిప్పింగ్‌లో.. ప్రత్యర్థి న్యాయవాదిని అడిగిన ప్రశ్నకు ఓ మహిళా లాయర్ జవాబు చెప్పినందుకు ఆమెను ఆయన మందలించారు. ఈ క్లిప్పింగులు వైరల్ కావడంతో సుప్రీంకోర్టు ఈ నెల 20న సుమోటో కేసుగా స్వీకరించింది. హైకోర్టు రిజిస్ట్రార్‌ను నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసుపై చీఫ్ జస్టిస్‌తో పాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం బుధవారం మళ్లీ విచారించింది. జస్టిస్ వి.శ్రీశానంద వ్యాఖ్యలపై సీజేఐ అభ్యంతరం తెలిపారు. తన వ్యాఖ్యలపై సదరు న్యాయమూర్తి ఇప్పటికే విచారం వ్యక్తంచేయడంతో సుమోటో విచారణను కొనసాగించరాదని ధర్మాసనం నిర్ణయించింది. అయితే సీజేఐ ఈ సందర్భంగా న్యాయమూర్తులకు కీలక సూచనలు చేశారు. 'ఎలక్ట్రానిక్ మీడియా శకంలో న్యాయమూర్తులు సంయమనం పాటించాలి. యథాలాపంగా చేసే వ్యాఖ్యలు కొంత వివక్షాపూరితంగా ఉండేందుకు అవకాశం ఉంది. ప్రత్యేకించి ఫలానా లింగం, వర్గానికి వ్యతిరేకంగా చేశారని అనుకుంటారు. అందుచేత కోర్టులు విచారణ సందర్భంగా వ్యాఖ్యలు చేయకుండా నియంత్రణ పాటించాలి. ఆ వ్యాఖ్యలను స్త్రీద్వేషంతో చేసినవి గానో, సమాజంలోని ఓ వర్గంపై పక్షపాతంతో చేసినట్లుగానో పరిగణించే అవకాశం ఉంది. పితృస్వామ్యం, మహిళలపై వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగరూకతతో ఉండాలి. న్యాయనిర్ణయ ప్రక్రియలో నిష్పక్షపాతం, సహేతుకత అవసరం. భారత రాజ్యాంగంలో పొందుపరచిన విలువలే న్యాయమూర్తులకు మార్గదర్శకం కావాలి' అని సూచించారు. ఇలాంటి వివాదాల నేపథ్యంలో కోర్టు కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారాలను నిలిపివేయాలన్న సూచనను సీజేఐ తోసిపుచ్చారు. 'సూర్యకాంతికి జవాబు మరింత వెలుగే. కోర్టుల్లో జరిగేవాటిని తొక్కిపెట్టలేం' అని స్పష్టంచేశారు. తన వ్యాఖ్యల వివాదంలో సుప్రీంకోర్టు జోక్యంతో జస్టిస్ శ్రీశానంద ఓపెన్ కోర్టులోనే విచారం వెలిబుచ్చారు. 21వ తేదీ మధ్యాహ్నం కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కాగానే తన ప్రకటన చదివి వినిపించారు. ఉద్దేశపూర్వకంగా తాను ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు.

బడిలో పిల్లల భద్రత యాజమాన్యం బాధ్యతే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: పాఠశాలలో బాలల రక్షణకు యాజమాన్యాన్ని బాధ్యురాలిని చేస్తూ కేంద్రం రూపొందించిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు (యూటీలు) అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తన ఆదేశాల అమలును పర్యవేక్షించాలని జాతీయ బాలల హక్కుల కమిషన్‌ను (ఎన్‌సీపీసీఆర్) కోరింది. నోబెల్ విజేత కైలాశ్ సత్యార్థి నేతృత్వంలోని 'బచ్‌పన్ బచావో ఆందోళన్' సంస్థ దాఖలుచేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య బెంచ్ ఈ ఆదేశాలు జారీచేసింది. బాలల రక్షణ కోసం తయారైన 2021 నాటి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఇప్పటికీ చాలా రాష్ట్రాలు, యూటీలు అమలుచేయడం లేదని కోర్టుకు పిటిషనరు తెలిపారు. పాఠశాలల్లో బాలలపై వేధింపులు, నేరాలు పెరిగిన దరిమిలా ఈ మార్గదర్శకాలను దేశవ్యాప్తంగా అమలులోకి తీసుకురావాలన్నారు. తద్వారా 6-14 ఏళ్ల లోపు బాలలకు స్వేచ్ఛాయుత విద్యను తప్పనిసరి చేసిన ఆర్టికల్ 21ఏ స్ఫూర్తిని నిలబెట్టాలన్నారు.

శ్రీలంక ప్రధానికి భారత్‌తో ప్రత్యేక అనుబంధం

» ఢిల్లీ వర్సిటీలో చదువుకున్న హరిణి అమరసూర్య



న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: శ్రీలంక నూతన ప్రధాని హరిణి అమరసూర్యకు భారత్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. ఢిల్లీ యూనివర్సిటీలో ఆమె సోషియాలజీలో బ్యాచిలర్ డిగ్రీని అభ్యసించారు. వర్సిటీ పరిధిలోని హిందూ కళాశాలలో ఆమె చదివారు. తమ పూర్వ విద్యార్థిని శ్రీలంక ప్రధానికావడం ఎంతో గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ అంజు శ్రీవాస్తవ అన్నారు. హరిణి 1991-94 వరకు సోషియాలజీ విద్యార్థినిగా ఉన్నారని చెప్పారు. తమ కాలేజీలో విద్యార్థి ప్రభుత్వం అనే సంప్రదాయం సుదీర్ఘకాలం నుంచి అమలులో ఉందని, ఏటా విద్యార్థుల్లో ఒకరిని ప్రధానిగా, మరొకరిని ప్రతిపక్షనేతగా ఎన్నుకొంటామన్నారు. అప్లైడ్‌ఆంత్రోపాలజీ అండ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో మాస్టర్స్ చేసిన హరిణి అమరసూర్య... ఎడిన్‌బర్గ్ వర్సిటీ నుంచి సోషల్ ఆంత్రోపాలజీలో డాక్టరేట్ పట్టా పొందారు.

చర్చల దిశగా ఇజ్రాయెల్-లెబనాన్

» అమెరికా ప్రతిపాదన.. నెతన్యాహు ఓకే

» లెబనాన్‌పై కొనసాగిన ఇజ్రాయెల్ దాడులు

» 51 మంది మృతి.. 223 మందికి గాయాలు



లెబనాన్ దాడితో ఇజ్రాయెల్‌లో ధ్వంసమైన ఇల్లు

టెల్ అవీవ్/బీరుట్, సెప్టెంబరు 25: ఇజ్రాయెల్-హిజ్బుల్లా మధ్య పోరు చినికిచినికి గాలివానగా మారకముందే చర్చల దిశలో ముందడుగు పడింది. ఇటీవలి ఐక్యరాజ్య సమితి(ఐరాస) సర్వసభ్య సమావేశం సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ చేసిన చర్చలతో కాల్పుల విరమణ ప్రతిపాదనకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బుధవారం పచ్చజెండా ఊపారు. అయితే ఇజ్రాయెల్-హమాస్ చర్చల్లో ఈజిప్ట్ వంటి దేశాలు మధ్యవర్తిత్వం నెరిపిన విషయం తెలిసిందే.! ఇజ్రాయెల్-హిజ్బుల్లా విషయంలోనూ లెబనాన్ ప్రత్యక్షంగా మధ్యవర్తిత్వం నెరపాలని అమెరికా, ఐరోపా దేశాలు కోరుతున్నాయి. ఈమేరకు రాయిటర్స్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ చర్చలకు సంబంధించి, ఆరు ప్రధానవర్గాలను ఉటంకించింది. "హిజ్బుల్లాతో చర్చల సందర్భంగా గాజాలోని బందీల విడుదల అంశాన్ని ఇజ్రాయెల్ లేవనెత్తే అవకాశాలున్నాయి. అదే సమయంలో గాజా, లెబనాన్‌లో ఉద్రిక్తతలను తగ్గించడానికి అమెరికా దృఢసంకల్పంతో ఉంది. షరతులు-ప్రతి షరతులులేకుండా ఈ చర్చలు సులభంగా సఫలమవ్వవని అమెరికా, ఫ్రాన్స్ భావిస్తున్నాయి. నిర్వాసితులు, శరణార్థుల కోణంలో రెండు దేశాలు ఆలోచిస్తున్నాయి"అని రాయిటర్స్ పేర్కొంది. కాగా లెబనాన్‌పై బుధవారం ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) జరిపిన దాడుల్లో 51మంది చనిపోగా 223 మంది గాయపడ్డట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది. ఇజ్రాయెల్ దాడులు మొదలైనప్పటి నుంచి 95వేల మంది నిరాశ్రయులుగా మారారని, వారంతా దక్షిణ లెబనాన్‌ను వీడి శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారని లెబనాన్ వార్తాపత్రిక అల్-అక్బర్ వెల్లడించింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా 30కిపైగా రాకెట్ దాడులు చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. డేవిడ్స్ స్లింగ్ వ్యవస్థ ద్వారా వాటిని అడ్డుకున్నట్లు పేర్కొంది. బుధవారం జరిపిన 100కు పైగా దాడుల్లో దక్షిణ లెబనాన్‌లోని రాకెట్ లాంచర్లను చాలా వరకు ధ్వంసం చేసినట్లు చెప్పింది. హిజ్బుల్లా రాకెట్ దాడిలో ఉత్తర ఇజ్రాయెల్‌లోని గ్లెలోట్ శిబిరం ధ్వంసమైనట్లు సౌదీకి చెందిన అల్-హదత్ టీవీ చానల్ ఆ దృశ్యాలను ప్రసారం చేసింది.

నన్ను చంపేందుకు ఇరాన్ కుట్ర: ట్రంప్

జార్జియా, సెప్టెంబరు25: తనను హత్య చేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఈమేరకు యూఎస్ నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం అందిందని ట్రంప్ మంగళవారం జార్జియాలో ఓ ర్యాలీలో తెలిపారు. కొన్ని నెలలుగా ఇరాన్ ప్రయత్నాలు పెరిగినట్లు అధికారులు గుర్తించారని, తనను కాపాడేందుకు, ఈ ప్రభావం ఎన్నికలపై పడకుండా అధికారులు కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం "నన్ను చంపేందుకు ఇరాన్ ఇప్పటికే చాలా ప్రయత్నాలు చేసింది. అవి ఫలించలేదు. అయినా మళ్లీ ప్రయత్నిస్తుంది" అని ట్రంప్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. తనకు సీక్రెట్ సర్వీస్ కల్పించేందుకు అధిక నిధులు కేటాయించినందుకు కాంగ్రెస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ వ్యవహారంలో రిపబ్లికన్లు, డెమోక్రాట్లు కలిసి రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఓ మాజీ అధ్యక్షుడిపై దాడి చేయడం అంటే నిందితుడు చావు కోరుకున్నట్లే అన్నారు. నవంబరులో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనుండగా, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్‌పై వరుస దాడులు జరుగుతుండడం కలకలం రేపుతోంది.

సౌదీలోకి పాక్ బిచ్చగాళ్లు!

» ఆధ్యాత్మిక యాత్రల పేరిట ప్రవేశించి యాచన

ఇస్లామాబాద్, సెప్టెంబరు 25: ఆధ్యాత్మిక యాత్రల ముసుగులో పాకిస్థాన్ నుంచి పెద్ద సంఖ్యలో బిచ్చగాళ్లు తమ దేశంలోకి చొరబడి బిచ్చమెత్తుకుంటున్నారని సౌదీ అరేబియా ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితిని నియంత్రించకుంటే పాకిస్థాన్‌కు చెందిన ఉమ్రా, హజ్ యాత్రికులపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించింది. ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ పత్రిక మంగళవారం ఈ విషయాన్ని ప్రచురించింది. ఉమ్రా వీసాలతో పాకిస్థాన్ నుంచి బిచ్చగాళ్లు సౌదీలోకి ప్రవేశించకుండా నియంత్రించాలంటూ పాకిస్థాన్ మత వ్యవహారాల మంత్రిత్వశాఖకు సౌదీ హజ్ మంత్రిత్వశాఖ హెచ్చరిక జారీ చేసినట్టు పత్రిక పేర్కొంది. ఆధ్యాత్మిక యాత్ర ముసుగులో బిచ్చగాళ్లు సౌదీలోకి ప్రవేశించకుండా నియంత్రించే మార్గాలను అన్వేషించాలని పాకిస్థాన్ ప్రభుత్వాన్ని సౌదీ హజ్ మంత్రిత్వశాఖ కోరింది. దీనిపై స్పందించిన పాకిస్థాన్.. ఉమ్రా యాత్రకు తీసుకెళ్లే ట్రావెల్ ఏజెన్సీలను నియంత్రించేందుకు 'ఉమ్రా చట్టం'ను తీసుకొచ్చింది. మరోవైపు పాకిస్థాన్ హోంమంత్రి మోసిన్ నక్వీ.. సౌదీ రాయబారి నవాఫ్ బిన్ సైద్ అహ్మద్ అల్ మల్‌కీతో సమావేశమై బిచ్చగాళ్లను సౌదీకి పంపించే మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇది పాకిస్థాన్ ప్రతిష్ఠను మసకబారుస్తోందన్న మోసిన్.. దీనికి కారణమైన మాఫియాను ఉక్కుపాదంతో అణచివేయాలని ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎఫ్ఐఏ)ని ఆదేశించారు. పాక్ నుంచి బిచ్చగాళ్లు ఆధ్యాత్మిక యాత్రల ముసుగులో పశ్చిమాసియా దేశాల్లోకి ప్రవేశిస్తున్నారని, ఉమ్రా వీసాలపై సౌదీ అరేబియాకు వచ్చేవారిలో అత్యధికులు యాచనకు పాల్పడుతున్నారని పాకిస్థాన్ ప్రవాసుల మంత్రిత్వశాఖ కార్యదర్శి జీషాన్ ఖాన్‌జాదా గతేడాదే వెల్లడించారు. పాకిస్థాన్ ప్రవాసుల తీరు, నేరాలకు పాల్పడుతుండటంపై అనేక గల్ఫ్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని ఆ శాఖ మరో కార్యదర్శి అర్షద్ మహమూద్ తెలిపారు. ఆ శాఖ వివరాల మేరకు గల్ఫ్ దేశాల్లో పట్టుబడుతున్న బిచ్చగాళ్లలో 90శాతం మంది పాకిస్థానీయులే ఉంటున్నారు.

పెళ్లి పేరుతో రేప్.. హత్య!

- ప్రేమ పేరుతో వంచించిన యువకుడు
- రెండుసార్లు అబార్షన్ చేయించిన వైనం
- నిలదీసిన యువతిపై బావతో కలిసి రేప్
- ఆపై గొంతు నులిమి హత్య..
- సహకరించిన యువకుడి తల్లి
- నల్లగొండ జిల్లాలో ఘటన.. ముగ్గురి అరెస్టు



మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 25: ప్రేమ.. పెళ్లి పేరుతో యువతిని లోబర్చుకొని, గర్భవతిని చేసి మోసగించడమే కాకుండా.. చివరికి ఆ యువతి నిండు ప్రాణాల్నే బలిగొన్నాడో దుర్మార్గుడు! పెళ్లి గురించి మాట్లాడుకుందామని ఆమెను నమ్మించి సొంత బావతో కలిసి సామూహిక అత్యాచారం చేసి చంపేశాడు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం పుట్టలగడ్డలో ఈ దారుణ ఘటన జరిగింది. డీఎస్పీ రాజశేఖర్‌రాజు వెల్లడించిన వివరాల ప్రకారం.. పుట్టలగడ్డతండాకు చెందిన రూపావత్ నాగు నాయక్(22)కు రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో చదువుతున్న రోజుల్లో అదే మండలంలోని ఓ తండాకు చెందిన యువతి (19)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. 17 ఏళ్ల వయసులో ఉన్న ఆమెను నాగు పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకున్నాడు. ఫలితంగా ఆమె గర్భం దాల్చింది. తనను పెళ్లి చేసుకోవాలని నాగును అప్పట్లోనే ఆమె నిలదీసింది. పెళ్లికి నాగు కుటుంబీకులు నిరాకరించడంతో ఆమె వాడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఏడాదిన్నర క్రితం నాగుపై పోక్సోచట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటినుంచి ఆమెతో తరచూ ఫోన్‌లో మాట్లాడిన నాగు.. మేజర్ అయ్యాక తప్పకుండా పెళ్లిచేసుకుంటానని నమ్మించాడు. దీంతో ఆమె మరోసారి అతడికి దగ్గరై మళ్లీ గర్భం దాల్చింది. రెండుసార్లూ బలవంతంగా గర్భస్రావం చేయించాడు. తర్వాత నాగుకు ఆమె ఫోన్ చేసి మళ్లీ పెళ్లి విషయం ప్రస్తావించింది. అయితే ఆమె నంబర్‌ను అతడు బ్లాక్ చేశాడు. దీంతో ఆ యువతి, తాడోపేడో తేల్చుకునేందుకు ఈ నెల 14న పుట్టలగడ్డతండాలోని ప్రియుడి ఇంటికి వెళ్లింది. తన కొడుకుపై కేసు పెట్టిందన్న కోపంతో అప్పటికే రగిలిపోతున్న నాగు తల్లి బుజ్జి, యువతిని హత్య చేసేందుకు పథకం పన్నింది. పెళ్లి విషయం మాట్లాడుకుందామని నమ్మించి తండా శివారులోని ఓ పొలం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశానికి కుమారుడు నాగుతో, అతడికి వరుసకు బావ అయిన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం కొత్త తండాకు చెందిన రమావత్ క్రాంతికుమార్‌తో కలిసి యువతిని తీసుకెళ్లింది. కొద్దిసేపటికి యువతిని నాగు, క్రాంతికుమార్ కలిసి చెట్లపొదల్లోకి ఎత్తుకెళ్లి అత్యాచారం జరిపారు. అనంతరం గొంతు నులిమి హత్య చేశారు. ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని చెట్టుకు వేలాడదీశారు. ఇదంతా పూర్తయ్యేదాకా నాగు తల్లి బుజ్జి రోడ్డుపై కాపలాగా ఉంది. యువతి కన్పించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు వాడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగు, అతడి తల్లి బుజ్జి, మరో నిందితుడు క్రాంతికుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, ఈ కేసులో ఐదుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రామగుండంలో జెన్‌కోనే ప్లాంట్ నిర్మించాలి

- నేటి నుంచి జేఏసీ నిరసన

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించడానికి వీల్లేదని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ స్పష్టం చేసింది. ఈ మేరకు సింగరేణి-జెన్‌కో భాగస్వామ్యాన్ని నిరసిస్తూ నేటి నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. బుధవారం హైదరాబాద్‌లో 1104 యూనియన్ కార్యాలయంలో జేఏసీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా... సర్కారు నిర్ణయాన్ని నిరసిస్తూ గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన వ్యక్తం చేయాలని, ఆ తర్వాత ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు విద్యుదుత్పత్తి సంస్థల్లో గేట్ మీటింగ్‌లు పెట్టాలని, అలాగే అక్టోబరు 4,5 తేదీల్లో డిస్కమ్‌ల కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసనలు వ్యక్తం చేయాలని నిర్ణయించింది. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే నిరసనను తీవ్రతరం చేయనున్నట్లు హెచ్చరించింది. పూర్తి రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన జెన్‌కోను కాపాడాలని జేఏసీ డిమాండ్ చేసింది.

తెలంగాణపై మావోయిస్టుల 'పట్టు' తప్పలేదా..!

- డీజీపీ ప్రకటన వెలువడిన 24 గంటల్లోనే ఉనికిని చాటుకున్న నక్సల్స్!!
- చర్ల మండలం పూసుగుప్పలో.. పోలీసు క్యాంపుపై కాల్పులతో హల్‌చల్
- అరగంట పాటు ఇరువైపులా కాల్పులు

హైదరాబాద్/చర్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణలో మావోయిస్టులకు చోటు లేదు. వారు ఉనికిని చాటుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నాం"- డీజీపీ జితేందర్ మంగళవారం చేసిన వ్యాఖ్యలివి..! ఆయన ఈ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే నక్సల్స్ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని ధర్మారం సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌ను, ఓ వాగును దాటుకుని.. 2 కిలోమీటర్ల దూరంలో తెలంగాణ గడ్డపై ఉన్న పూసుగుప్ప సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై కాల్పులు జరిపారు. దీంతో.. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఏజెన్సీలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సుమారు అరగంట పాటు మావోయిస్టులు-పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. చర్ల మండలం పూసుగుప్పలో సీఆర్‌పీఎఫ్-81 క్యాంపు కొనసాగుతుంది. ఇక్కడి నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని ధర్మారం సీఆర్‌పీఎఫ్ క్యాంపు మధ్య దూరం రెండు కిలోమీటర్లే..! పూసుగుప్ప క్యాంపులో 500 మంది జవాన్లు విధుల్లో ఉంటారు. మావోయిస్టులు బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఒక్కసారిగా పూసుగుప్ప క్యాంపుపై బీజీఎల్ గ్రనేడ్ లాంచర్లతో విరుచుకుపడ్డారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు కూడా ఎదురుకాల్పులకు దిగాయి. సుమారు అరగంట పాటు నక్సల్స్-పోలీసుల మధ్య కాల్పులతో ఆ ప్రాంతం హోరెత్తిపోయింది. ఈ క్యాంపుపై నక్సల్స్ దాడి చేయడం ఇదే మొదటిసారి అని భద్రాద్రి పోలీసులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి 16న ఛత్తీస్‌గఢ్‌లోని ధర్మారం బేస్‌పై మావోయిస్టులు రాకెట్ దాడులు చేసినా.. పూసుగుప్ప వైపు కన్నెత్తి చూడలేదని చెబుతున్నారు. డీజీపీ ప్రకటన వెలువడిని 24 గంటల్లోనే మావోయిస్టులు తెలంగాణలో కాల్పులు జరపడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఘటన జరిగిన వెంటనే.. మావోయిస్టులను పట్టుకునేందుకు పెద్దఎత్తున కూంబింగ్ ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

బిల్లుల కోసం అప్పులా..?

(మొదటి పేజీ తరువాయి)


(ఫైల్)

కమిషన్ ప్రశ్నించగా.. తాను విధుల్లో చేరిన సమయంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న రజత్‌కుమార్ ఆదేశాలతో కార్పొరేషన్ రుణాలు తీసుకుందని చెప్పారు. ప్రభుత్వం పూచీకత్తు ఇస్తే.. కాళేశ్వరం కార్పొరేషన్ పాలకమండలి సమావేశంలో చర్చించి, ఎండీ అనుమతితో రుణాలు తీసుకున్నామని వివరించారు. రుణాల సమీకరణలో తన పాత్రేమీ లేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో పూర్తయిన పనులను కార్పొరేషన్ ఆస్తులుగా పరిగణిస్తామని, కార్పొరేషన్‌కు స్వతహాగా ఎలాంటి ఆదాయం లేదని పేర్కొన్నారు. 2023 నుంచి రామగుండం ఫర్టిలైజర్, ఎన్‌టీపీసీ నుంచి నీటి విడుదలకు సంబంధించిన నిధులు వస్తున్నాయని తెలిపారు.

మెజర్‌మెంట్ చూశాకే బిల్లులు చెల్లిస్తారా?

బిల్లుల చెల్లింపులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఏమైనా పాటిస్తారా? మెజర్‌మెంట్‌లు చూశాకే బిల్లులు ఇస్తారా? అని కమిషన్ ఆరా తీయగా.. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బిల్లును సిద్ధం చేసి, పే అండ్ అకౌంట్స్(పీఏవో)కు పంపిస్తే.. ఆ బిల్లులను పీఏవో పరిశీలించి, ఐఎఫ్ఎంఎస్ ద్వారా కాళేశ్వరం కార్పొరేషన్‌కు పంపిస్తారని కాళేశ్వరం సీఏవో చెప్పారు. మెజర్‌మెంట్‌ను పీఏవో పరిశీలిస్తుందని, ఆ తర్వాత చెల్లింపులు జరుగుతాయని అన్నారు. కాగ్ అభ్యంతరాలపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామన్నారు. కార్పొరేషన్ నిర్వహణ ఏ విధంగా జరుగుతుంది? అని కమిషన్ ప్రశ్నించగా.. బ్యాంకులు/ఆర్థిక సంస్థల నుంచి రుణాలు మంజూరైన వెనువెంటనే కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేయకుండా ఆ నిధులను ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో బ్యాంకుల్లో జమచేస్తామని చెప్పారు. ఆ డిపాజిట్లపై వచ్చే వడ్డీతో కార్పొరేషన్ నడుస్తుందని తెలిపారు. కాంట్రాక్టర్లు సమర్పించిన ఈఎండీ/ఏఎండీ నిధులపై వచ్చే వడ్డీని కూడా నిర్వహణకు వాడుకుంటున్నామని చెప్పారు. కార్పొరేషన్‌లో కొందరు డిప్యుటేషన్‌పై, మరికొందరు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారని వివరించారు.

ఎవరినో రక్షించే ప్రయత్నం చేయొద్దు..

విచారణలో వాస్తవాలు మాత్రమే చెప్పాలని, ఎవరినో రక్షించే ప్రయత్నాలు చేయొద్దని పీసీ ఘోష్ కమిషన్.. అధికారులకు సూచించింది. 'మిమ్మల్ని మీరే రక్షించుకోవాలి' అని చెప్పింది. నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ(జనరల్) కార్యాలయంలోని చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (సీఏవో) పద్మావతిని విచారిస్తూ.. బడ్జెట్ రూపకల్పనలో మీ పాత్ర ఏంటి? అని ప్రశ్నించింది. ఇందుకు ఆమె సమాధానమిస్తూ.. ఏటా జనవరి-ఫిబ్రవరి నెలల్లో ఆర్థిక శాఖ బడ్జెట్ ప్రతిపాదనలు కోరితే, సంబంధిత చీఫ్ ఇంజనీర్ల నుంచి వివరాలు సేకరించి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకోవడానికే కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పడింద తెలిపారు. రుణాల చెల్లింపు కోసం నిధులను ఏటా బడ్జెట్‌లో కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. రుణాలకు సంబంధించిన సమావేశంలో గత ప్రభుత్వ సీఎంవో అధికారులు పాల్గొన్నారా? అని కమిషన్ ప్రశ్నించగా.. జవాబు దాటవేశారు. కాళేశ్వరం రుణాల చెల్లింపులకు బడ్జెట్‌లో ఆర్థిక శాఖ ఒక పద్దును సృష్టించి నిధులు విడుదల చేసిందని వివరించారు. ఈ ప్రాజెక్టుతో పడే ఆర్థిక భారమెంత? దీనికి మీ సమర్థన ఉందా? అన్న ప్రశ్నలకు, "నాకు తెలియదు.. ఆ నిర్ణయాలతో నాకు సంబంధం లేదు" అని పద్మావతి బదులిచ్చారు. ఆర్థిక క్రమశిక్షణ/వివేకం లేకుండా కాళేశ్వరంపై నిర్ణయం తీసుకున్నదెవరని ప్రశ్నించగా... 'ఇది చాలా విస్తారమైన అంశం.. ఆ విషయంలో నేనేమీ చెప్పలేను" అని ఆమె వ్యాఖ్యానించారు. ఇక మీ బాధ్యతలు, విధులేంటని వర్క్స్ అకౌంట్స్ డైరెక్టర్ ఫణిభూషణ్ శర్మను కమిషన్ ప్రశ్నించగా... పనులకు సంబంధించిన బిల్లులు వస్తే.. వాటిని పరిశీలించడం, చెల్లింపులకు సిఫారసు చేయడం వరకేనని ఆయన బదులిచ్చారు. కాగ్ నివేదికలో ఒకటి రెండు అంశాలే వాస్తవికంగా లేనట్లు గుర్తించానని చెప్పారు.

మాగుంట పార్వతమ్మ కన్నుమూత

- ఎంపీ, ఎమ్మెల్యేగా సేవలు.. చంద్రబాబు, వెంకయ్య సంతాపం


పార్వతమ్మ (ఫైల్)

చెన్నై, నెల్లూరు, అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ (77) బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం చెన్నైలో తుది శ్వాస విడిచారు. మాగుంట కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న పార్వతమ్మ మృతి ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. 1947 జూలై 27న నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో బెజవాడ రామిరెడ్డి, భూదేవమ్మ దంపతులకు ఆమె జన్మించారు. 1967 ఫిబ్రవరి 19న మాగుంట సుబ్బరామిరెడ్డితో వివాహం జరిగింది. ఆయన మరణానంతరం రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆమె... 1996లో ఒంగోలు ఎంపీగా, 2004లోగా కావలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2012లో ఒంగోలు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలయ్యారు. భర్త ఆశయాలకు అనుగుణంగా, రాజకీయాల పరంగా ఒంగోలు, కావలి ప్రాంతాల్లో పార్వతమ్మ తనదైన ముద్ర వేసుకున్నారు. పార్వతమ్మ భౌతికకాయాన్ని బుధవారం మధ్యాహ్నం చెన్నై నుంచి నెల్లూరుకు తీసుకొచ్చారు. పార్వతమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు విజయ్‌బాబు అనారోగ్యంతో గత ఏప్రిల్‌లో మృతి చెందడంతో మనోవేదనకు గురయ్యారు. కుమార్తె మాలినికి ప్రముఖ నిర్మాత, దివంగత విజయావాహిని నాగిరెడ్డి మనవడు శివకుమార్‌రెడ్డితో వివాహం జరిగింది.

ఏఎమ్మార్పీ మొదటి మోటార్ ట్రయల్ రన్ విజయవంతం

- 4 మోటార్ల ద్వారా 2400 క్యూసెక్కుల నీటి తరలింపు
- ఐదు నెలలుగా మోటారుకు మరమ్మతులు
- విజయవంతంగా పూర్తిచేసిన జపాన్ సాంకేతిక బృందం
- ఏకేబీఆర్ ఆయకట్టు రైతులకు తీరనున్న ఇబ్బందులు


పంప్‌హౌస్‌లో పూర్తైన మొదటి యూనిట్ మరమ్మతులు

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 25: హైదరాబాద్ ప్రజలకు తాగునీటిని, నల్లగొండ రైతులకు సాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) పుట్టంగండి పంప్‌హౌస్‌లో మొదటి యూనిట్ మోటర్ ట్రయల్ రన్ విజయవంతమైంది. దీంతో 4 మోటార్ల ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని 10కిలోమీటర్ల దూరంలో ఉన్న అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు(ఏకేబీఆర్) తరలిస్తున్నారు. ఏకేబీఆర్‌కు సమీపంలో ఉన్న కోదండపురం వాటర్‌ప్లాంట్ నుంచి హైదరాబాద్ జంట నగరాలకు, నల్లగొండ జిల్లాలోని ఉదయసముద్రానికి నీటిని విడుదల చేస్తారు. నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్ గ్రావిటీ కాల్వ ద్వారా పుట్టంగండి పంప్‌హౌస్‌కు చేరుకున్న నీటిని ఏఎమ్మార్పీలో మొత్తం నాలుగు మోటార్లతో ఎత్తిపోస్తారు. 4 మోటార్లలో ఒక మోటారు ఐదు నెలలుగా పని చేయలేదు. దీంతో ప్రభుత్వం వెంటనే మొదటి యూనిట్ మరమ్మతులు చేపట్టాలని గతంలో అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో జపాన్ నుంచి వచ్చిన సాంకేతిక సిబ్బంది మూడు నెలలుగా మరమ్మతు పనులు చేపట్టి బుధవారం మొదటి యూనిట్ మోటర్ మరమ్మతులు పూర్తిచేశారు. అనంతరం ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో నీటిని పుట్టంగండి ప్రధానకాల్వ ద్వారా ఏకేబీఆర్ రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. ఉదయ సముద్రానికి 1200 క్యూసెక్కులు, జంట నగరాలకు 525 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 45 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈఎన్‌సీ ఆదేశాలు.. ఎస్ఈ ఉత్తర్వులు

- మేడిగడ్డ నిర్మాణ సంస్థకు బ్యాంకు గ్యారంటీ తిరిగి ఇచ్చేయాలంటూ రెండుసార్లు మెమో
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి.. నిర్మాణ సంస్థకు బ్యాంకు గ్యారంటీ విడుదల నిర్ణయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) స్థాయి అధికారిది కాదని.. రామగుండం ఈఎన్‌సీ ఆదేశాల మేరకు సంబంధిత ఎస్ఈ రెండుసార్లు ఉత్తర్వులు ఇచ్చారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో వెల్లడైంది. గ్యారంటీ విడుదలకు సంబంధించి ఆర్థిక శాఖ 2020 డిసెంబరు 29న మెమో (నం.896215) జారీ చేసింది. కానీ, రామగుండం సర్కిల్-1 ఎస్ఈ అంతకన్నా ముందే.. అంటే, 2020 నవంబరు 27నే దీనిపై ఒక మెమో ఇవ్వడం గమనార్హం. కానీ, దానికి ఆధారంగా ఎటువంటి ఉత్తర్వులూ లేవన్న కారణంతో మహాదేవపూర్ ఈఈ-1 మౌనంగా ఉండిపోయారు. దీంతో ఎస్ఈ 2021 జనవరి 1న మరో మెమో జారీచేశారు. "మరొకసారి కోరుతున్నా.. నిర్మాణ ఒప్పందంలోని క్లాజ్-45 ప్రకారం బ్యాంకు గ్యారంటీని విడుదల చేసి, రిపోర్టు చేయాలి" అని ఆయన అందులో పేర్కొన్నారు. దీంతో బ్యాంకు గ్యారంటీలు విడుదలకు ఈఈ తిరుపతిరావు నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లుతో పాటు అప్పటి రామగుండం ఎస్ఈ-1లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు కూడా చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల టెండర్లు, నిర్మాణం అన్ని వ్యవహారాల్లో వీరిద్దరి పాత్ర ఉన్నట్లు ఆధారాలు ఉండగా.. ప్రభుత్వం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లును ఉద్వాసన పలికి, అప్పటి ఎస్ఈని కీలక బాధ్యతల్లో కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది.

నేడు, రేపు భారీ వర్షాలు

- పలు జిల్లాలకు యెల్లో అలెర్ట్

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా రాగల రెండు రోజుల్లో తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గురువారానికి యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతుందని వెల్లడించింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో బుధవారం రాష్ట్రంలో అత్యధికంగా 13.6 సెంటీమీటర్ల వర్షపాతం కురిసినట్లు తెలిపింది. అలాగే 15 మండలాల్లో భారీ వర్షాలు కురువగా, 172 మండలాల్లో 1.5 నుంచి 6.5 సెంటీమీటర్ల మధ్య వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. ఖమ్మం జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు భారీవర్షం కురిసింది. కూసుమంచి మండలంలో 10.3 సెం.మీ, పెనుబల్లి మండలంలో 5.6 సెం.మీ, సత్తుపల్లి మండలంలో 5.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా నడిగూడెంలో అత్యధికంగా 8.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గరిడేపల్లి మండలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అప్పిరెడ్డిగూడెం, సుభాష్‌నగర్ మధ్య రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

జంట జలాశయాల గేట్లు ఎత్తివేత

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జంట జలాశయాల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. వాటి నీటి మట్టాలు గరిష్ఠ స్థాయికి చేరడంతో వాటర్‌బోర్డు అధికారులు గేట్లు ఎత్తారు. ఉస్మాన్‌సాగర్(గండిపేట) జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 400 క్యూసెక్కుల వరద వస్తోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1,790 అడుగులు కాగా.. ప్రస్తుతం 1,790 అడుగులకు చేరింది. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 242 క్యూసెక్కుల నీటిని మూసీ నదిలోకి వదులుతున్నారు. హిమాయత్‌సాగర్‌కు 3,800 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో హిమాయత్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరడంతో వాటర్‌బోర్డు అధికారులు ఒక గేటును అడుగు మేర ఎత్తి నీటిని విడుదల చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివిధ శాఖల అధికారులకు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సూచించారు.

మెడికవర్ ఆస్పత్రి ఇప్పుడు బెంగళూరులోనూ!

- 300 పడకలతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
- ప్రారంభించిన కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్
- రాబోయే 3-4 ఏళ్లల్లో అక్కడ మరో నాలుగైదు ఆస్పత్రులు


డీకే శివకుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మెడికవర్ యాజమాన్యం

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అధునాతన సమగ్ర ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలతో మెడికవర్ యాజమాన్యం కొత్తగా మరో ఆస్పత్రిని బెంగళూరులో బుధవారం ప్రారంభించింది. రూ.120 కోట్లతో రెండున్నర లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో, 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్డియాక్ సైన్స్, ఆర్థోపెడిక్స్, న్యూరో సైన్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో సైన్స్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని వైద్యవర్గాలు తెలిపాయి. వైద్య పరీక్షలకు సంబంధించిన అత్యాధునిక ల్యాబ్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు మెడికవర్ యాజమాన్యం తెలిపింది. ఓపీ కోసం ప్రత్యేకంగా 45 రూమ్‌లను, వంద పడలకతో ఐసీయూ, ఎన్ఐసీయూ, పీఐసీయూ, కార్డియాక్ ఐసీయూ, ట్రాన్స్‌ప్లాంట్ ఐసీయూ, డే కేర్ సపోర్ట్, 24 గంటల ఎమర్జెన్సీ ట్రామాకేర్ సదుపాయం ఉన్నట్లు వెల్లడించింది. తమ కార్యకలాపాల్లో కృత్రిమ మేథ (ఏఐ) సాంకేతికతను వినియోగించనున్నట్లు పేర్కొంది. బెంగళూరు నూతనంగా ఏర్పాటైన మెడికవర్ ఆస్పత్రిని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కన్నడనాట వైద్యరంగంలో మెడికవర్ ఆస్పత్రులు రావడం గొప్ప మార్పునకు సంకేతం అని, అన్ని రాష్ట్రాల్లో కలిపి ఈ గ్రూపునకు 24 ఆస్పత్రులున్నాయన్నారు. అనంతరం మెడికవర్ గ్రూపు ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ మాట్లాడారు. తమ గ్రూపు ఆస్పత్రుల్లో 14 వేల మంది పనిజేస్తున్నారని, కొత్తగా బెంగళూరులో ఏర్పాటైన మెడికవర్‌లో మరో 1000 మంది వైద్య సిబ్బందికి ఉపాధి లభించనుందని తెలిపారు. రాబోయే మూడు నాలుగేళ్లలో బెంగళూరులో మరో4-5 నూతన ఆస్పత్రులను ఏర్పాటు చేస్తామని, ఫలితంగా దేశవ్యాప్తంగా తమ ఆస్పత్రుల్లో పడకల సంఖ్య 6 వేలకు చేరుతుందని వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పొలిటికల్ ఎన్‌కౌంటర్

మహారాష్ట్రలోని థానేజిల్లా బద్లాపూర్ స్కూల్లో ఇద్దరు పిల్లలపై లైంగిక దాడిచేసిన అక్షయ్ షిండే సోమవారం ఎదురుకాల్పుల్లో మరణించడంమీద ముంబై హైకోర్టు బుధవారం అనేక అనుమానాలు వ్యక్తంచేసింది. ఏమాత్రం నమ్మదగ్గట్టుగా లేదనీ, ఓ కట్టుకథలాగా కనిపిస్తున్నదని ఆక్షేపించింది. పాఠశాలలో చోటుచేసుకున్న అత్యాచార ఘటనకు సంబంధించి ఒక పక్క విచారణ జరుగుతూండగా, నిందితుడిమీద అతని మొదటిభార్య పెట్టిన కేసులో ప్రశ్నించడానికి పోలీసులు సిద్ధమైనారు. తలోజా జైల్లో ఉన్న అతడిని బద్లాపూర్ తీసుకుపోతుండగా, మార్గమధ్యంలో అక్షయ్ షిండే తప్పించుకొనే ప్రయత్నంలో ఒక పోలీసునుంచి తుపాకీ లాక్కొంటే మరో పోలీసు అధికారి కాల్పులు జరిపాడు, దీంతో నిందితుడు మరణించాడు. ఈ ఎన్‌కౌంటర్ మీద ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు అయినా నిజాయితీగా జరిగేట్టు చూడాలని కోర్టు వ్యాఖ్యానించింది.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పేరొందిన సంజయ్‌షిండే అనే పోలీసు అధికారి చేతిలో అక్షయ్‌షిండే అనే ఈ నిందితుడు మరణించినట్టుగా ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చేసిన ప్రకటన రాజకీయంగా కూడా అగ్గిరాజేసింది. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని విపక్షాలు వ్యాఖ్యానించినందుకు ఒక పాపిని వెనకేసుకొస్తున్న పాపం మీకు తగులుతుందని బీజేపీ నాయకులు శపిస్తున్నారు. బద్లాపూర్ ఘాతుకం మహారాష్ట్రనే కాదు, యావత్ దేశాన్ని నిర్ఘాంతపరచింది. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు భద్రతలేదని, రక్షణకరువై వారు నిస్సహాయంగా అత్యాచారాలకు గురికావాల్సి వస్తున్నదని పశ్చిమబెంగాల్ ఉదంతం గుర్తుచేసిన తరుణంలోనే, అభంశుభం తెలియని పిల్లలకు చివరకు అక్షరాలు దిద్దేచోటకూడా రక్షణలేకుండా పోయిందని బద్లాపూర్ ఘటన హెచ్చరించింది. బెంగాల్ అత్యాచార ఘటనమీద వీరోచితమైన పోరాటం సాగిస్తున్న బీజేపీని బద్లాపూర్ ఆత్మరక్షణలోకి నెట్టేసింది. వందలాదిమంది వీధుల్లోకి వచ్చి ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. రైళ్ళరాకపోకలను నిలిపివేశారు, విధ్వంసకాండకు పాల్పడ్డారు.

అరెస్టులు, సస్పెన్షన్లు, సిట్ ఏర్పాటు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారణ ఇత్యాదివి ప్రకటించి, సీనియర్ న్యాయవాది ఉజ్వల్ నికమ్‌ను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించినప్పటికీ, ఈ ఉదంతం తమకు రాజకీయంగా తీవ్ర నష్టం చేస్తుందన్న భయం పాలకులకు లేకపోలేదు.

ఈ నేపథ్యంలో నిందితుడి ఎన్‌కౌంటర్‌ను మిగతా రాజకీయపక్షాలు అనుమానించడం, ప్రశ్నించడం సహజం. కేసు దర్యాప్తు, విచారణ కొనసాగినంత కాలం, మీడియాలో ఆ వార్తలు వినబడుతున్నంత వరకూ సదరు ఘోరం ప్రజలకు గుర్తుకొస్తూనే ఉంటుంది కనుక అధికారపక్షానికి ఆ మేరకు నష్టం తప్పదు. బుధవారం నాటి వ్యాఖ్యలను బట్టి దానిని బూటకపు ఎన్‌కౌంటర్ గా న్యాయస్థానం భావిస్తున్నదని అర్థం. నిందితుడు మూడుబుల్లెట్లు పేల్చితే ఒకటి మాత్రమే పోలీసు అధికారి తొడలోకి దూసుకుపోతే, మిగతా రెండు బుల్లెట్లు ఏమైనాయని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఇందుకు ప్రతిగా సదరు ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు కాల్చిన ఒకే ఒక్క బుల్లెట్ నేరుగా నిందితుడి తలలోకి దూసుకుపోయి అతడు అక్కడికక్కడే మరణించాడు. కారులో మరో నలుగురు ఉన్నా నిందితుడు మీదకు లంఘించి నియంత్రించకపోవడం, పోలీసుల నుంచి అతడు తుపాకీ లాక్కోవడం, అతి సులువుగా సెకన్లలో లాక్ తీసి పోలీసు అధికారి దిగువభాగంలో కాల్చడం ఇత్యాది ప్రతీ దశమీదా న్యాయమూర్తి వెలిబుచ్చిన అనుమానాలు సామాన్యులకు సైతం కలిగేవే.

న్యాయస్థానం ఎంతగా హూంకరించినప్పటికీ, తమకు ఒనగూరే నష్టమేమీ లేదని, ఈ ఎన్‌కౌంటర్‌తో బద్లాపూర్ కథ సుఖాంతమైందని పాలకులు నమ్ముతున్నారు. 'బద్లా పూరా' అంటూ తుపాకీ ధరించిన ఫడ్నవీస్ కటౌట్‌లు మహారాష్ట్రలోని చాలా ప్రాంతాల్లో దర్శనమిచ్చాయి. ఛత్రపతి శివాజీ మహరాజ్ ఏలిన పవిత్రభూమిలో ఆడపిల్లమీద అఘాయిత్యాలకు పాల్పడే దుర్మార్గులకు శిక్షలు ఇలాగే ఉంటాయి అని వాటిమీద రాశారు. ఈ నకిలీ ఎన్‌కౌంటర్ కీర్తి తమ నాయకులకు దక్కాలని ఫడ్నవీస్, షిండే అభిమానులు పోటీపడుతున్నారు. తమ కుమారుడిని అన్యాయంగా చంపేశారంటూ నిందితుడి తల్లిదండ్రులు గుండెలుబాదుకుంటున్నా, హక్కుల సంఘాలు ప్రశ్నిస్తున్నా, ఈ తక్షణన్యాయానికి సామాన్యజనం తన్మయులై తమను కీర్తిస్తున్నందుకు పాలకులు సంతోషిస్తున్నారు. జమ్మూకశ్మీర్, హర్యానాతో పాటు జరగాల్సిన మహారాష్ట్ర ఎన్నికలను ఎన్నికల సంఘం ఏ కారణంతో వాయిదావేసినప్పటికీ, నవంబరులో అవి జరగవచ్చునని అంటున్న తరుణంలో ఈ నకిలీ ఎన్‌కౌంటర్ తమకు మరో నాలుగు ఓట్లు తెస్తుందని పాలకులు గట్టిగా నమ్ముతున్నారు.

నీవు నేర్పిన 'భాషయే' నీరజాక్షి!

'ముఖ్యమంత్రికి మంచి భాష నేర్పుదాం' పేరుతో సెప్టెంబర్ 24 నాడు మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు రాసిన వ్యాసం చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంది. తెలంగాణలో తిట్ల దండకాలను రచన చేసి ప్రజల్లోకి తీసుకెళ్లిన వాళ్లు కేసీఆర్ కుటుంబం. మరీ ముఖ్యంగా కేసీఆర్ కొత్త కొత్త తిట్లను తెలుగు నిఘంటువులోకి ఎక్కించారు. అదే తిట్లు ఇప్పుడు రివర్స్‌లో వాళ్ల మీద పడుతుంటే భాషా సంస్కారం గురించి హరీష్‌రావు సుద్దులు చెబుతున్నాడు.

'అరేయ్ బండి సంజయ్!' అని దుబ్బాక ఎన్నికల్లో బస్టాండ్ ముందు నిలబడి హరీష్‌రావు అరిచిన విషయం మర్చిపోయాడా. ఒక బీసీ బిడ్డను, రాష్ట్ర అధ్యక్షుడని కూడా చూడకుండా అంత పెద్ద మాట అనడం, ఇప్పుడు సరికొత్త వ్యాఖ్యానాలు చేయడం హరీష్‌రావు ద్వంద వైఖరికి నిదర్శనం.



లంగలు, లుచ్చాలు, లఫంగాలు, సిగ్గు–మానం లేనోల్లు, గూటానికి కట్టాలే, సన్నాసులు, లాగుల తొండలిడిసి కొట్టాలి, మోడీ గాడు.. ఇంకా తీవ్రమైన బూతులు కేసీఆర్ తెలంగాణ రాజకీయ క్షేత్రంలో విస్తృతంగా వాడాడు.

యద్య దాచరతి శ్రేష్ఠః అని కదా కృష్ణుడు చెప్పింది. శ్రేష్ఠుడు ఏ భాషను ప్రయోగిస్తాడో అదే భాష ఇప్పుడు అందరు రాజకీయ నాయకులు మాట్లాడుతున్నారు. మీ వరకు వచ్చేసరికి సరికొత్త వ్యాఖ్యానాలు చేస్తున్నారు. పెద్దలు జానారెడ్డి అంటూ లొంగదీసుకోవడానికి, భట్టి విక్రమార్కను పొగడడానికి మీటింగ్‌కు వచ్చిన మోత్కుపల్లి నరసింహులును తన బుట్టలో వేసుకోవడానికి కేసీఆర్ చెప్పిన హితవచనాలను కేసీఆర్ సంస్కారం అని హరీష్‌రావు కొత్తగా వ్యాఖ్యానించడం గురువింద సామెత లాగా ఉంది. అదేం ప్రతిపక్ష నాయకులను కేసీఆర్ గౌరవం ఇచ్చి మాట్లాడినట్లు కాదు. అదంతా తన వాక్చాతుర్యంతో నోరు మూయించడానికి కొందరి విషయంలో చేసిన ప్రయత్నం. ఇదేదో కేసీఆర్ గొప్పతనం అన్నట్టుగా హరీష్‌రావు ఫ్రేమ్ కడుతున్నాడు. మాటలు నేర్చి పదేళ్లు తెలంగాణ ప్రజలను వంచన చేసిన కేసీఆర్ కవులకు కళాకారులకు మధ్య అనుబంధాన్ని నిర్మించాడని హరీష్‌రావు చెబుతున్న మాటల్లో నిజం ఉందో లేదో అదే పార్టీలో ఉన్న రసమయి బాలకిషన్ పాడిన 'లింగమాని నిన్ను నమ్ముకుంటే లంగవయ్యి పోతివిర లింగో' అన్న పాటని గుర్తుతెచ్చుకుంటే మంచిది.

కరోనా సమయంలో టీవీ సీరియల్ బంద్ అయితే ప్రజలు సాయంత్రం కేసీఆర్ ప్రెస్ మీట్ వినోదం కోసం ఎదురుచూసిన మాట వాస్తవం. ఆయన బూతులు, వ్యంగ్యం, ఎత్తిపోతల తిట్లు, శాపనార్థాలు ఇవన్నీ ప్రజలకు గొప్ప ఎంటర్‌టైన్‌మెంట్‌గా మారాయి. కేసీఆర్ అంత గొప్ప తెలంగాణ సిపాయి లేడని జయశంకర్ సార్ అన్నట్టుగా హరీష్‌రావు రాశాడు. అదే జయశంకర్ సార్ బతికున్నప్పుడే కేసీఆర్ కలిగించిన దుఃఖం వర్ణనాతీతం అని ప్రతి తెలంగాణ పౌరుడికి తెలుసు.



> లంగలు, లుచ్చాలు, లఫంగాలు, సిగ్గు–మానం లేనోల్లు, గూటానికి కట్టాలే, సన్నాసులు, లాగుల తొండలిడిసి కొట్టాలి, మోడీ గాడు.. ఇంకా తీవ్రమైన బూతులు కేసీఆర్ తెలంగాణ రాజకీయ క్షేత్రంలో విస్తృతంగా వాడాడు. మీ మాటలు, తిట్లు మీ కుటుంబ ఆదాయాన్ని బాగా పెంచాయి. తిట్లు మీకు కళ. అదే మార్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులను, సినిమా వాళ్ళను ప్రత్యర్థులను లొంగదీసుకున్నారు. ఇప్పుడు అదే కల్చర్‌ను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోంది.

తెలంగాణ ఉద్యమకారులపై నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైఫిల్ చూయించాడని చెబుతున్న హరీష్‌రావు వాళ్ల పార్టీలో ఉద్యమ ద్రోహులుగా ఉండి పదవుల కొరకు చేరిన మహేందర్‌రెడ్డి, దానం నాగేందర్, కడియం శ్రీహరి వంటి గొప్ప వ్యక్తుల గురించి కూడా చెప్తే బాగుండేది.

తెలంగాణ ఉద్యమకారులను లాఠీలతో కొట్టిన, కొట్టించిన ఘనత ఉన్న నాయకులను ఆనాడు పక్కన పెట్టుకొని ఇప్పుడు నీతి శాస్త్రాలు వల్లిస్తూ హరీష్‌రావు చెబుతున్న పాటలు వింటే సుమతీ శతకకారుడు ఉరి వేసుకొని చచ్చిపోతాడు.

ఇక రేవంత్‌రెడ్డి గురించి హరీష్‌రావు చెప్పిన మాటల్లో జరుగుతున్న రాజకీయంలో ఎంత మాత్రం నిజం లేదు. 'నువ్వు కొట్టినట్టు చెయ్ – నేను ఏడ్చినట్టు చేస్తా' అన్నట్లుగా సాగుతున్న బీఆర్ఎస్ – కాంగ్రెస్ బంధం త్వరలోనే బయటపడుతుంది. అభిషేక్ మను సింఘ్వి రాజ్యసభ సభ్యత్వం నిర్ణయం కాగానే కవిత ఎందుకు బయటకు వచ్చింది? కేసీఆర్ మీద ఆరోపణలు చేస్తున్న రేవంత్‌రెడ్డి ఈ రోజు వరకు కేసీఆర్ కుటుంబంపై ఒక కేసైనా పెట్టాడా!

కాళేశ్వరం కుంభకోణం గురించి, ఫోన్ టాపింగ్ కేసు గురించి ఊదరగొట్టిన వాళ్లు కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపిస్తారా? గతంలో ఉత్తమ కుమార్‌రెడ్డి మీద పెట్టిన కేసు ఎలా నిర్వీర్యమైందో ఇప్పుడూ అంతే అవుతుంది. ఇదంతా ప్రజలను డైవర్ట్ చేయడానికి కాంగ్రెస్ బీఆర్ఎస్‌లు రెండూ కలిసి ఆడుతున్న నాటకం.

ప్రజాస్వామ్యానికి కొత్తకొత్త అర్థాలు చెప్పే మీకు భావోద్వేగాలపైన నియంత్రణ ఉండదు. మీ అవసరాలను బట్టి భావోద్వేగాలు, భాష తిట్లు, సరికొత్త పదాలు పుట్టిస్తుంటారు. చంద్రబాబు నాయుడుతో పొత్తు పెట్టుకుని రోశయ్య బడ్జెట్ గొర్రె తోకంత, అదే చంద్రబాబు నాయుడుది ఆకాశమంత అని పొగడగలరు. కరోనా సమయంలో ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసలతో ముంచెత్తగలరు. అవసరం తీరాక బండకేసి కొట్టగలరు.

హుజూర్‌నగర్, మునుగోడు ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలను పొగిడి మీ బుట్టలో వేసుకోగలరు. అవసరం తీరాక ఏరుదాటి తెప్ప తగలేస్తారు. ఏమైనా అంటే వ్యూహం అంటారు. మీ భాష కూడా అలాంటిదే. ఒకే నాలుకతో పొగడగలరు తెగడగలరు. అందరి నాలుకలకు ఎముక లేదు అంటూ ఉంటారు. మీ నాలుకలకు నరం కూడా లేదు. మీరు తలపై మోసినట్టుగా కేసీఆర్ ఈనాడు ఆధారాలు నిదర్శనాలతో సప్రమాణమైన చర్చ చేయలేదు. తనకు అడ్డొచ్చిన ప్రతి వాళ్లను విధ్వంసం చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

మీ మాటలు, తిట్లు మీ కుటుంబ ఆదాయాన్ని బాగా పెంచాయి. తిట్లు మీకు కళ. అదే మార్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులను, సినిమా వాళ్ళను ప్రత్యర్థులను లొంగదీసుకున్నారు. ఇప్పుడు అదే కల్చర్‌ను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోంది. ఇదంతా నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష.

నేటి ముఖ్యమంత్రి ఇతర ప్రతిపక్ష నేతలు, విలువలకు తిలోదకాలు ఇచ్చారని హరీష్‌రావు తెగ బాధపడిపోతున్నాడు. తెలంగాణ ఏర్పడ్డాక రాజకీయ విలువలకు తిలోదకాలు ఇచ్చి ఇతర పార్టీల నాయకులను కొనుక్కోవడం మొదలుకొని ప్రతి తప్పుడు పనికి సరికొత్త భాష్యాన్ని చెబుతూ విలువలను విధ్వంసం చేసింది కేసీఆర్. ప్రజాస్వామ్యాన్ని గౌరవించకుండా కేసీఆర్ ఓడిపోయాక కూడా ప్రజల్లోకి రాకుండా ఫామ్ హౌస్‌లో ఉంటే హరీష్‌రావు జనాలను తరలించి ఆయన దర్శనం చేయించడం, ఈ రోజు వరకు బయటకు రాకుండా కుట్రపూరిత వ్యవహారాలను హరీష్ కేటీఆర్ ద్వారా నడిపించడం ఒక అప్రజాస్వామ్య సంస్కృతికి నిదర్శనం.

ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సింది పోయి ఒక పెద్ద మనిషిగా తెలంగాణకు సలహాలు ఇస్తూ హుందాతనంగా సభకు రాకుండా ప్రతిపక్ష నేతగా ఉంటూ తనకు తానే ఒక అవతార పురుషుడిగా భావిస్తూ రాజకీయాలు చేయడం విజ్ఞత ఉన్న నాయకులు చేసే పనేనా అని హరీష్‌రావు ఆలోచించాలి. కేసీఆర్ లాంటి ఒక స్టేట్స్‌మన్ వందల సార్లు 'తల నరుక్కుంటా' అనే పదం వాడి, ఆ పదానికి విలువ లేకుండా చేశాడు.

తెలంగాణ రాష్ట్రం కొత్తగా ఏర్పాటు అయిన తర్వాత ఒక అవినీతి లేని ప్రజాస్వామ్య సామాజిక తెలంగాణ సృష్టించాల్సింది పోయి తనకు తానే ఒక నియంతలాగా మారిపోయి విధ్వంసాన్ని సృష్టించాడు. పరిపాలనంతా సోమేశ్ కుమార్ లాంటి అవినీతిపరులకు అప్పజెప్పి ప్రతిపక్ష నాయకుల ఫోన్లు టాపింగ్ చేసి భయంకరమైన కుట్రకు పాల్పడ్డాడు. తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు అని శతకకారులు చెప్పినట్టు హరీష్ చెప్పే ఈ సుద్దపూస మాటలు ప్రజలు విశ్వసిస్తారని నమ్మకం లేదు. ఇదంతా కేసీఆర్ తెలంగాణ సమాజానికి ఇచ్చిన యోగదానం.

● ఎం. రఘునందన్‌రావు
పార్లమెంటు సభ్యులు, మెదక్

శ్వాస తెగిపోయాక, ఇక ఏమి సుందరీకరణ?





■ కె. శ్రీనివాస్

సందర్భం

ఒకప్పుడేమో ప్రజలు మాకు అవి కావాలి, ఇవి కావాలి అని ప్రభుత్వాన్ని గట్టిగా అడిగేవారు, ఆలకించకపోతే ఆగ్రహించేవారు, ఆవేశపడేవారు. అయినా అడిగినవాటిని ప్రభుత్వం ఇచ్చేది కాదు. అడిగితే ఇవ్వడానికి నేనంత లోకువనా? ఉక్కుపాదంతో నొక్కిపెడతాను కానీ, ససేమిరా ఇవ్వననేది. కొంత హింస, కొన్ని బలులు జరిగాక, ఎంతో కొంత కొసరి విసిరేది.

ఇప్పుడు ప్రభుత్వాలు చాలా మారిపోయాయి. అడిగేది ఇవ్వరు సరే, కానీ, అడగకుండానే చాలా ఇస్తున్నాయి. అక్కర లేదు దొరలారా, అంటున్నా, ఫ్యూచర్ సిటీలట, ఫార్మా విలేజిలట, మహా జలాశయాలట, పన్నెండు వరసల రోడ్లట, అణుకర్మాగారాలట ఎన్నెన్నో నిర్మిస్తామంటున్నారు. అంతటి అభివృద్ధికి ఉడతాభక్తిగా జనం తమ కాలి కింది నేలనో, పంటనిచ్చే పొలాన్నో, పచ్చటిచెట్టూ పారేనీరూ ఇచ్చే ఆరోగ్యాన్నో సమర్పించుకుంటే చాలట. ఇంత అభివృద్ధి తీసుకు వస్తుంటే ఆ మాత్రం త్యాగం చేయలేరా, మహాజనులారా?

ఒకప్పుడు అడిగినవి ఇవ్వకపోవడంలో వారికేదో నష్టం ఉండి ఉండాలి. ఇప్పుడు అడగనివి ఇవ్వడంలో వారికేదో లాభం ఉండి ఉండాలి.

ఇప్పటి అయాచిత ఉపద్రవం పేరు, దామగుండం.

వాళ్లు అభివృద్ధి ఇస్తామంటారు, ప్రజలు కాదంటారు. వాళ్లది దేశభక్తియుత మనకార్యం అవుతుంది. ప్రజలది అభివృద్ధి నిరోధక దేశద్రోహం అవుతుంది.

హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో, మూసీనది ప్రవాహ ప్రాంతంలో, దామగుండం రక్షితారణ్యంలో 2900 ఎకరాలలో భారత నావికాదళం 'వెరీ లోఫ్రీక్వెన్సీ' రాడార్ కేంద్రాన్ని నిర్మిస్తోంది. ఆ భూమిలో కొన్ని లక్షల వృక్షాలున్నాయి. ఈ కేంద్రం నిర్మాణానికి బహుశా పన్నెండు లక్షల చెట్లు కొట్టేస్తారు. అందువల్ల, హైదరాబాద్ పరిసరాలలో అసలే క్షీణించి ఉన్న పచ్చదనం మరింత మాయమవుతుంది. కాలుష్యభాగ్య నగరానికి బిగించిన వెంటిలేటర్లలో ఒకటి కన్నుమూస్తుంది. ఆ కేంద్రం చుట్టూ రేపు వెలిసే కొత్త సందడి మరింత అడవికోతకు, మరింత అభివృద్ధికి దారితీసి, మూసీ గొంతు ఇంకా బిగుసుకుంటుంది. సొంత నీరు లేకుండానే సుందరీకరణ జరిగిపోతుంది.

నావికాదళానికి ఈ రాడార్ కేంద్రం అత్యవసరమైన సాంకేతిక వ్యవస్థే అయి ఉండాలి. తమకు పెద్ద నష్టం లేకపోతే, దేశరక్షణకు అవసరమైన ఒక నిర్మాణాన్ని ప్రజలు అనుమతించాలి, అనుమతిస్తారు కూడా. కానీ, నష్టాన్ని ఎవరు, ఎట్లా అంచనా వేయాలి? ఇక్కడి నష్టం చిన్నది కాదు, ఒక స్థలానికి, కాలానికి మాత్రమే పరిమితమైనది కాదు. గాలిని, నీటిని, జీవులను అందరినీ నిర్వాసితులను చేసే నష్టం. ప్రత్యామ్నాయం రక్షణశాఖకు అసాధ్యం కాదు. ఆ ప్రయత్నమే వారు చేసినట్టు లేదు.

ఇదేదో ఉన్నట్టుండి, గండిపేట గేట్లు తెరవాల్సివచ్చినంత అర్జెంటుగా ముంచుకువచ్చిన సమస్య కాదు. దీనికి నేపథ్యం పదేళ్ల పై మాటే. చుట్టుపక్కల పల్లెల్లో కొంత కలవరం, కొంత కలకలం కనిపించినా, లోకం పెద్దగా పట్టించుకోకపోవడంతో, నివురు గప్పిపోయింది. దామగుండం స్వామిగా పేరుపొందిన సత్యానందస్వామి మాత్రం రాబోయే ప్రమాదం గురించి నాటి నుంచి నేటి వరకు హెచ్చరించడం మానలేదు. స్వతంత్ర జర్నలిస్టు చందు తులసి చొరవతో, దామగుండం మళ్లీ వార్తల్లోకి వచ్చింది. వీడియో కథనంతో తెలంగాణ ఉలిక్కిపడింది. సేవ్ దామగుండం జేఏసీ తిరిగి రంగంలోకి దిగింది. మొన్న ఆదివారం దీక్షలతో పౌర సమాజం సంఘటితమైంది. ప్రతిపక్షం తానూ ఉన్నానని గుర్తు చేసింది. మోహరింపు మొదలైంది.

> పర్యావరణం గురించి, వనరుల పరిరక్షణ గురించి పట్టింపుతో ఉన్నవారిని వెక్కిరించడం కూడా నేటి నవసంపన్నుల కాలక్షేపం. దేశరక్షణతో ముడిపడిన 'అభివృద్ధి' విషయం అంటే, ఇక ఉద్యమకారుల నైతికత మీద దాడిచేయడానికి అవకాశం దొరికిందని వారికి సంబరం. అందుకే ప్రకృతికి ఇవ్వవలసిన భద్రతను ఉపసంహరించడానికి, లాభార్జనపరులకు కట్టబెట్టడానికి దేశరక్షణను ఒక సాకుగా చేసుకోవడం కూడా ప్రభుత్వాలు చేస్తున్నాయి. చూద్దాం, దామగుండం పల్లెల్లో ఈ సారి పోరు బతకమ్మ ఆడతారట, చెట్లను కావలించుకుని మరో చిప్కో ఉద్యమం చేస్తారట!

ఈ రాడార్ కేంద్రానికి కావలసిన భూమిని కొన్ని నెలల కిందట తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేవీ వారికి బదలాయించారు. అట్లాగని, ఇదంతా ఆయన ప్రభుత్వం ప్రారంభించింది కాదు. కానీ, కేంద్రంలో కాంగ్రెస్ హయాంలోనే దీనికి పునాది పడింది. భారత నావికాదళ బృందం 2007లో సర్వే చేసుకుని వెళ్లి, 2010లో ప్రతిపాదన పంపడంతో ప్రక్రియ మొదలైంది. భూమి బదలాయింపునకు కావలసిన సన్నాహకాలు, సానుకూల ప్రచారాలు, గ్రామసభల నిర్వహణ అన్నీ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయి. కోర్టులో స్టే ఉండడంతో, భూమి బదలాయింపు మాత్రం జరగలేదు. ఆ అడ్డు తొలగడంతో ఈ ఏడాది జనవరి 24 నాడు లాంఛనం పూర్తయింది. నిర్మాణ కార్యక్రమాలు ప్రస్తుతం ప్రారంభ దశలో ఉన్నాయి.

వ్యవసాయ భూములూ, ఊర్లూ ఈ ప్రాజెక్టులో నష్టపోవడం లేదు. దామగుండం అడవి మధ్యలో ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయానికి చెందిన వేల ఎకరాల భూమి, నేవీ ప్రతిపాదనలు మొదలైన కాలంలోనే, ఎట్లా అటవీ శాఖ చేతిలోకి పోయిందో ఇంద్రజాలమే? మొత్తానికి రాడార్ కేంద్రానికి అనుకూలంగా భూమి దఖలు జరిగింది. వ్యక్తిగత కమతాలేవీ ఆ భూమిలో లేవు. ఏదో ఒక ప్రాజెక్టు వస్తోందంటే, దగ్గరలోని తమ భూముల రేట్లు పెరుగుతాయని, నాలుగు ఉద్యోగాలు వస్తాయని అమాయకంగా నమ్మే జనం ఎట్లాగూ ఉంటారు. రాడార్ కేంద్రానికి మద్దతు కూడగట్టడానికి కూడా ప్రాజెక్టు తరఫున అటువంటి వాగ్దానాలు గుప్పించారు. ప్రతిపాదిత రాడార్ కేంద్రస్థలానికి చుట్టుపక్కల 20 గ్రామాల్లో నివసించే 60వేల మంది అడవిని కోల్పోతున్నందుకు, పశువులకు మేత భూములు పోతున్నందుకు బాధపడ్డారు, నిరసనలు తెలిపారు. బహుశా వ్యక్తిగత నష్టం పెద్దగా లేనందువల్ల కూడా, ఉద్యమం చురుకుగా ముందుకు సాగలేదు. పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు ఎంతగా హెచ్చరిస్తున్నా, తగినంత స్పందన లేకపోయింది.

సొంత నష్టాలను కాదు, సమాజానికి మొత్తంగా జరిగే హానిని, నేడు కలిగే కీడును మాత్రమే కాదు, రేపటి తరానికి జరిగే చేటును చూడగలిగే వివేచన లేకపోవడం ప్రమాదకరం. వరదలు వచ్చి తమ ఇళ్లు మునిగిపోయినప్పుడు, ఒకనాటి చలువ నగరం ఇప్పుడు నిత్యవేసవి పట్టణంగా మారుతున్నప్పుడు, ఆ క్షణానికి మాత్రం ఒక విసుగో శాపనార్థమో పెట్టి సంతృప్తిపడే నగరజీవి, తనకు లాభం కలిగే అవకాశం వచ్చినప్పుడు తిరిగి పదిమందికి, ప్రకృతికి హానిచేయడానికి వెనుకాడకపోవడం బాధాకరం. తమ భూములకు విలువ పెరుగుతుందని జీవో 111 రద్దు చేయడాన్ని వేడుక చేసుకునే ఆత్మాహుతి నాగరికులు మనలో ఉన్నారు. నదీగర్భంలో, తీరంలో ఆక్రమణలు తొలగించడం వల్ల ఏదో లాభం కలుగుతుందని అనుకుంటున్నవాళ్లకు, నదీమూలాన్ని ఛిద్రం చేస్తే ఏం జరుగుతుందో తెలియదా? గంగ, గోదావరి, కృష్ణ, కావేరి ఈ నదుల మూలస్థానాలు చూస్తే, వాటికి ఎంత విలువో, ఎంతటి రక్షణో? ఎందుకు మూసి, ఈసా, కాగ్నా మాత్రం ఏం పాపంచేశాయి? జరుగుతున్న అపచారాన్ని భరించలేక, ఈ నదులు భూమిలోకి ఇంకిపోతే, నాలుగోనగరంతో సహా హైదరాబాద్ మరో రామగుండమే కదా?

పర్యావరణం గురించి, వనరుల పరిరక్షణ గురించి పట్టింపుతో ఉన్నవారిని వెక్కిరించడం కూడా నేటి నవ సంపన్నుల కాలక్షేపం. దేశరక్షణతో ముడిపడిన 'అభివృద్ధి' విషయం అంటే, ఇక ఉద్యమకారుల నైతికత మీద దాడి చేయడానికి అవకాశం దొరికిందని వారికి సంబరం. అందుకే ప్రకృతికి ఇవ్వవలసిన భద్రతను ఉపసంహరించడానికి, లాభార్జనపరులకు కట్టబెట్టడానికి దేశరక్షణను ఒక సాకుగా చేసుకోవడం కూడా ప్రభుత్వాలు చేస్తున్నాయి. అన్ని సందర్భాలలోనూ ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించలేము కానీ, కీలకమయిన విషయాల్లో దేశభద్రత అంశాన్ని ముందరికాళ్లకు బంధంగా ప్రయోగించడం ఈ మధ్య తరచు చూస్తున్నాము. అటవీచట్టానికి ఈ మధ్య చేసిన కీలకమయిన సవరణల్లో, 15వేల కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుల దగ్గర భూములను స్వాధీనం చేసుకునే వెసులుబాటు ఒకటి. అవి మామూలు అడవులైనా, రక్షితారణ్యాలైనా సరే, రక్షణ అవసరాల కోసం తీసుకోవచ్చునట. ఈ మధ్య నికోబార్ ద్వీపాన్ని ఆదిమవాసుల నుంచి కబ్జాచేసే ప్రక్రియను చూశాం. బంగాళాఖాతంలో మనకూ ఒక హాంకాంగ్ కావాలట. ఆదొక అభివృద్ధి ఎర. అంతరించిపోతున్న ఆదిమవాసులకు ఒక 75 చదరపు కిలోమీటర్లు ఉదారంగా ఇస్తారట. ఇది ఒక పరిహారం. ఇదంతా ఏదో వ్యాపారం కోసమే కాదు, నికోబార్‌లో రక్షణశాఖ నౌకాస్థావరాన్ని నిర్మిస్తారట. నోరెత్తడానికి వీలు లేని బ్రహ్మాస్త్రం! మొత్తం మీద నికోబార్‌ను నాగరికం చేయడానికి సుమారు 8 లక్షల చెట్లను ప్రస్తుతానికి బలిఇస్తారట! ఇక, అబూజ్‌మడ్ అడవుల మధ్యలో లక్ష ఎకరాలకు పైచిలుకు స్థలంలో సైన్యానికి విన్యాస యుద్ధ శిక్షణ. 52 అటవీ గ్రామాలు ఖాళీ. యుద్ధటాంకులతో పోరాటానికి శిక్షణ కేంద్రం కాబట్టి, అడవిని చదును చేయకతప్పదు. ఎన్ని లక్షల చెట్లకు శిరచ్ఛేదమో తెలియదు! దీన్ని ఔననక తప్పదు, లేకపోతే, 'అర్బన్' విశేషణం ఉదారంగా లభిస్తుంది!

> అభివృద్ధి అనేది కూడా మతతత్వంలాగా తీవ్రమైపోయి, దానికి అభ్యంతరం చెప్పడమే ద్రోహమయ్యే పరిస్థితి నెలకొన్నది. దామగుండం అడవుల్లో ఓషధి వృక్షాలు అంతరిస్తాయని, వందల ఏళ్ల వయస్సున్న చెట్లు కూలిపోతాయని తెలిసినప్పుడు, లోలోపలి నుంచి ఊపిరితిత్తుల మూలుగు వినిపించాలంటే, మానవీయ పర్యావరణం స్వచ్ఛంగా ఉండాలి!

అడవులను చట్టబద్ధంగా, బాహాటంగా స్వాధీనం చేసుకుంటున్న ఈ చర్యల్లో ఒక క్రమాన్ని చూడవచ్చు. అభివృద్ధి అనేది కూడా మతతత్వంలాగా తీవ్రమైపోయి, దానికి అభ్యంతరం చెప్పడమే ద్రోహమయ్యే పరిస్థితి నెలకొన్నది. దామగుండం అడవుల్లో ఓషధి వృక్షాలు అంతరిస్తాయని, వందల ఏళ్ల వయస్సున్న చెట్లు కూలిపోతాయని తెలిసినప్పుడు, లోలోపలి నుంచి ఊపిరితిత్తుల మూలుగు వినిపించాలంటే, మానవీయ పర్యావరణం స్వచ్ఛంగా ఉండాలి!

చూద్దాం, దామగుండం పల్లెల్లో ఈ సారి పోరు బతకమ్మ ఆడతారట, చెట్లను కావలించుకుని మరో చిప్కో ఉద్యమం చేస్తారట!

సినిమా తెర వెనుక కోరలు చాచిన మగస్వామ్యం!

తెలుగు సినిమా పరిశ్రమలో పేరున్న డాన్స్ మాస్టర్ మీద అతని అసిస్టెంట్ దాఖలు చేసిన లైంగిక వేధింపులు, దాడికి సంబంధించిన ఫిర్యాదు గురించిన చర్చ రెండు రాష్ట్రాల్లో వందలాది మందిని కదిలించి అతని మద్దతుదారులుగా మార్చే ప్రయత్నం చేస్తోంది. "ఆమె ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఎందుకు ఫిర్యాదు చేసింది? ఇన్నాళ్లూ ఇష్టంతోనే అతడితో ఉంది కదా? ఆమెను ఎవరు వాడుకుంటున్నారు. అతని పట్ల అసూయతోనే ఈ ఫిర్యాదు చేయించారు," ఇటువంటి వాదనలతో నిండిపోయిన సోషల్ మీడియా ఇదే వాస్తవమన్న అభిప్రాయాన్ని కలుగచేస్తోంది. తెలుగు సినిమా పెద్దలు కూడా "నేరం రుజువయితేనే అతని మీద చర్యలు తీసుకోవాలి" అంటూ ఆయనకి పరోక్షంగా మద్దతు కూడగడుతున్నారు.

పని స్థలాల్లో స్త్రీల లైంగిక వేధింపుల గురించి తెలుగు సమాజాల్లో జరుగుతున్న చర్చ దేశంలో ఇతర చోట్ల జరుగుతున్న చర్చలకి పూర్తి వ్యతిరేకంగా ఉంది. బెంగాల్‌లో ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జరిగిన ఘటన తర్వాత ఆ రాష్ట్రంలో హింసా సంస్కృతి గురించే కాకుండా, పని స్థలాల్లో లైంగిక వేధింపులు, దాడుల్ని సమర్థించే సంస్కృతి గురించి అందరూ మాట్లాడుతున్నారు. వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఎంతోమంది వాదిస్తున్నారు. కేరళలో జస్టిస్ హేమ కమిటీ నివేదిక తర్వాత వివిధ సినీ కమిటీల బాధ్యులు లైంగిక వేధింపుల, దాడుల ఆరోపణలని ఎదుర్కొని రాజీనామా చేశారు. కొంతమందిపై కేసులు నమోదయ్యాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ చిత్ర పరిశ్రమలోని స్త్రీల పని పరిస్థితులు బాగుచెయ్యటానికి అనేక కొత్త సూచనలు చేస్తున్నారు. ప్రభుత్వం వింటోంది. విచిత్రంగా మన దగ్గర మాత్రం ఇలాంటి చర్చలు జరగటం లేదు. పరిశ్రమలో ఆడవాళ్ళ పని పరిస్థితుల గురించి అస్సలు ఎవ్వరూ మాట్లాడట్లేదు.

2018లో శ్రీరెడ్డి, ఇతర కళాకారులు తెలుగు సినీ పరిశ్రమలోని పురుషాధిపత్య సంస్కృతినీ, లైంగిక దోపిడీనీ తమ నిరసనల ద్వారా అందరి ముందుకీ తెచ్చారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో ఉన్న పరిస్థితి ప్రకారం కొత్తవాళ్ళకి పని చేసే అవకాశం రావాలన్నా, లేక అసోసియేషన్ కార్డు పొందాలన్నా కోఆర్డినేటర్లపైనా, పైనున్న మగ మాస్టార్లపైనా ఆధారపడాలి. వారికి లొంగి ఉంటేనే అసలు పని చేసే అవకాశాలు వస్తాయి. పరిశ్రమ వారి మాటే వింటుంది. అనేక 24 క్రాఫ్ట్ సంఘాల్లో ఇదే పరిస్థితి. అంటే జానీ మాస్టర్‌కు, అయన అసిస్టెంట్‌కు మధ్య సంబంధం వ్యక్తిగతం కాదు. అది ఒక ప్రొఫెషనల్ సంఘంలో అధికారంలో ఉండే వ్యక్తికీ, కిందుండే వ్యక్తికీ ఉండే సంబంధం. దాన్ని సాధారణ పరిభాషలో గురు శిష్య సంబంధం అంటారు. గురువులు శిష్యులని రక్షించాలి, భద్రత కల్పించాలి. జానీ మాస్టర్ అలా ప్రవర్తించాడా? తనకంటే 20ఏళ్ళు చిన్నదైన అమ్మాయి, అదీ మైనారిటీ తీరని వయసులో ఉన్న అమ్మాయి పట్ల అతడి ప్రవర్తన బాధ్యతాయుతమైనదేనా? గురువులు శిష్యులని కామించి నియంత్రించొచ్చా? పరిశ్రమలో నిలబడడానికి వచ్చిన కొత్త అమ్మాయికీ, ఆమెకి అవకాశాలిచ్చి, నియంత్రించేగలిగే స్థాయిలో ఉన్న వ్యక్తికీ మధ్యా ఇష్టం, అంగీకారంతో ఉండే సంబంధం వీలవుతుందా?

ఈ అధికార సంబంధాల వల్లనే ఆ అమ్మాయి ఇన్నాళ్లూ వేచి ఉండాల్సి వచ్చింది. తన 16ఏట నుంచి పడిన శ్రమ, తట్టుకున్న భౌతిక, లైంగిక హింస ఎందుకు కొరగాకుండా పోయి, మళ్ళా జీవితం మొదటికొచ్చే స్థితిలో ఆమె ఫిర్యాదు చేసింది. సినిమా పరిశ్రమలో అత్యధిక శాతం తనకి మద్దతు ఇవ్వదని, వ్యతిరేకంగా మాట్లాడతారని తెలిసి కూడా ఆమె ఇటువంటి సాహసం చేసిందంటే, ఆమె జీవితాన్ని, అవకాశాలని జానీ మాస్టర్ ఎంత తీవ్రంగా నియంత్రిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఆమెది అవకాశ వాదం కాదు, తన జీవితాన్ని నిలబెట్టుకోవటానికి చివరి ప్రయత్నం. ఆమెతో పాటు పని చేసే డాన్సర్లు, ఇతర సంఘాల్లో ఉండే అనేక మంది స్త్రీలు, ఇంకా చెప్పాలంటే పరిశ్రమలో దాదాపు అందరు స్త్రీలు కూడా ఇటువంటి పరిస్థితిలోనే ఉన్నారని మనం అనుకోవచ్చు. వాళ్ళు చెయ్యలేని ధైర్యం ఆమె చేసింది, అంతే.

ఆమె ఫిర్యాదు తర్వాత మనం మాట్లాడాల్సింది– తెలుగు సినిమా పరిశ్రమలో ఇలా మెగా మాస్టర్లు ఇంత అధికారం ఎలా చెలాయించగలుగుతున్నారు అన్న విషయం గురించి. సినిమా పరిశ్రమలో ఆడవాళ్ళ పని పరిస్థితులు, వివిధ క్రాఫ్ట్ అసోసియేషన్లలో ఉన్న గురు శిష్య సంబంధాలలో ఇరుక్కున్న స్త్రీల దోపిడీ, అసలు స్త్రీల సంఖ్య తెలుగు సినిమా పరిశ్రమలో ఇంత తక్కువగా ఉండటానికి కారణాలు, యూనియన్ల ద్వారా పనులు, అవకాశాలు, వేతనాలు లభించటం ఎంత మేరకు సరైంది, కార్డులిచ్చే అధికారం పురుషులకి మాత్రమే ఎందుకుంటోంది మొదలైన విషయాల గురించి. ఇవి పరిశ్రమకి వదిలేస్తే పరిష్కారం అయ్యే సమస్యలు కావు. 2018లో కోఆర్డినేటర్ల లైంగిక దోపిడీ, పెద్ద నిర్మాతల దగ్గర లైంగిక బానిసత్వం గురించి మాట్లాడిన స్త్రీలని పరిశ్రమ వెళ్లగొట్టింది. వాళ్ళు వొళ్ళు అమ్ముకునే వాళ్ళని, డబ్బు కోసం ఏమైనా చేస్తారని చెప్పింది. పని స్థలంలో జరిగిన చట్టం గుర్తించే వేధింపులని ఇద్దరి మధ్య జరిగిన వ్యక్తిగత విషయంగా కుదించింది.

> సినిమా పరిశ్రమలో అత్యధిక శాతం తనకి మద్దతు ఇవ్వదని, వ్యతిరేకంగా మాట్లాడతారని తెలిసి కూడా ఆమె ఇటువంటి సాహసం చేసిందంటే, ఆమె జీవితాన్ని, అవకాశాలని జానీ మాస్టర్ ఎంత తీవ్రంగా నియంత్రిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఆమెతో పాటు పని చేసే డాన్సర్లు, ఇతర సంఘాల్లో ఉండే అనేక మంది స్త్రీలు, ఇంకా చెప్పాలంటే పరిశ్రమలో దాదాపు అందరు స్త్రీలు కూడా ఇటువంటి పరిస్థితిలోనే ఉన్నారని మనం అనుకోవచ్చు.



ఇక్కడ లైంగిక అత్యాచారాల గురించి మన సమాజంలో వ్యాపించిన ఊహల గురించి మాట్లాడుకోవాలి. అమ్మాయి లైంగిక దాడిలో చనిపోతే ఆమెని తప్పకుండా బాధితురాలిగా ఒప్పుకుంటారు. ముద్దాయికి ఉరి వెయ్యాలని అందరూ కొవ్వొత్తి ర్యాలీలు తీస్తారు. అయితే ఆ బాధితురాలు పవిత్రురాలు అయ్యుండాలి. చిన్న పిల్లో, లైంగిక అనుభవం లేని యువతో అయ్యుండాలి. ఇది 50 ఏళ్ల క్రితం అత్యాచారం చుట్టూ అలుముకున్న నిశ్శబ్దంతో పోలిస్తే ముందడుగే. కానీ ఇది సరిపోదు. దోపిడీకి గురయ్యి, ఫిర్యాదు చేసి, తన జీవితం బాగుచేసుకుని, తన పని తాను చేసుకుని జీవిద్దామనుకున్న స్త్రీలని నమ్మకూడదన్న సందేశం 2018లో తెలుగు సినిమా పరిశ్రమ ఇస్తే, ఇప్పుడు సోషల్ మీడియా ఇస్తోంది. ఇది సరైందేనా?


1984లో మధుర అనే 14 ఏళ్ల సంచార జాతి అమ్మాయిపై పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు మధ్య వయస్కులయిన కానిస్టేబుళ్లు జరిపిన అత్యాచారం కేసులో వాళ్ళని విడుదల చేస్తూ సుప్రీంకోర్టు అసహ్యమైన తీర్పు ఇచ్చింది. ఆమె ఒంటిపై గాయాలు లేవు, ఆ వయసుకే బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడు కాబట్టి ఆమె పవిత్రమైన స్త్రీ కాదని వర్ణించింది. ఈ తీర్పుకి వ్యతిరేకంగా దేశంలో స్త్రీలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. బాధితురాలికి అప్పటికే ఉన్న లైంగిక సంబంధాలని పరిగణనలోకి తీసుకునే నిబంధనని చట్టం నుండి తీయించేశారు. 'కస్టోడియల్ రేప్' అనే కొత్త నిబంధనని పెట్టించారు. అధికారంలో ఉన్న ఏ మగాడైనా, ఆ బలంతో ఒక స్త్రీతో లైంగిక చర్య చేసినప్పుడు, దానికి ఆమె ఒప్పుకున్నా సరే, దాన్ని చట్టం అంగీకారంగా భావించదు. దాన్ని కేవలం అధికార దుర్వినియోగం, బలవంతం క్రిందే పరిగణిస్తుంది.

తెలుగు సినిమా పరిశ్రమలో జానీ మాస్టర్‌కి బాధితురాలితో ఉన్న సంబంధం అధికారంతో నిండిన ఒక రకమైన కస్టోడియల్ సంబంధం. మెంటర్/ మాస్టర్‌కి వారి అసిస్టెంట్లకు ఉండే అధికార సంబంధాల సొయి లేకుండా జరుగుతున్న చర్చ అంతా మనల్ని 40, 50 ఏళ్ల వెనక్కి లాగుతోంది. మొత్తం బాధితురాలి గుణాన్ని అనుమానించటం, ఇదంతా పరిశ్రమలో మామూలు అనటం జరుగుతున్న హింసని సమర్థించి బాధితుల్ని శంకించే పాత మగ దురహంకార అలవాట్లని గుర్తుకు తెస్తోంది. 2013లో వచ్చిన చట్ట మార్పులని కూడా పక్కనపెట్టి గుణాత్మకంగా మనల్ని వెనక్కి తీసుకెళ్తోంది.

ఏ రంగంలోనయినా లైంగిక వేధింపుల చట్టం అమలు చెయ్యాలి అనగానే ఇటువంటి చట్టాల వల్ల సృజనాత్మకత దెబ్బతింటుందని అనటం మామూలే. మోహన్‌లాల్ భయపడ్డట్టు ఏ రంగం కూడా ఈ చట్టం అమలు వల్ల విచ్ఛిన్నమైపోలేదు. ఇక్కడ సమస్య ఎవరిని ఫణంగా పెట్టి ఎవరి సృజనాత్మకత, స్వతంత్రం, స్వేచ్ఛని కాపాడుతున్నాం అన్నది. ప్రస్తుతం సినీ పరిశ్రమలో అందరు మగవాళ్ళకి, ఎవరి స్థాయిని బట్టి వారికి, ఆడవాళ్ళ శరీరాలపై విస్తృత విశేషాధికారాలున్నాయి. దానివల్ల స్త్రీల సృజనాత్మకత, స్వతంత్రం, స్వేచ్ఛకి చోటే లేకుండా ఉంది. జస్టిస్ హేమ కమిటీ చెప్పింది ఇదే. అన్ని పరిశ్రమల్లో అదే పరిస్థితి ఉంది.

అమ్మాయిలు అన్ని రంగాల్లో ముందుకెళ్లినప్పుడే సమానత్వం వస్తుంది అని వాళ్ళకి అన్నీ నేర్పిస్తూ, మరో పక్క, సినిమా పరిశ్రమలో లైంగిక దోపిడీకి లొంగిపోవటం తప్పదు అని వాదించటం మన సమాజపు స్కిజోఫ్రీనియాని సూచిస్తుంది. సమాజపు విలువలు, చట్టంలో వస్తున్న మార్పులతో అనుగుణంగా తెలుగు సినీ పరిశ్రమలో సంస్కరణలు రావాల్సిన సమయం వచ్చింది. దానికి జానీ మాస్టర్‌పై వచ్చిన ఫిర్యాదు మంచి అవకాశం. ప్రతి రంగంలో స్త్రీలు పని చెయ్యటానికి వీలుగా వచ్చిన మార్పులనే తెలుగు సినీ పరిశ్రమలో కూడా తేవాలని తెలంగాణ ప్రభుత్వం శ్రీరెడ్డి, ఇతరులు చేసిన నిరసనల తర్వాత 2019లో వేసిన హై లెవెల్ కమిటీ సూచించింది. ఆ నివేదికని ఇప్పటికైనా ప్రభుత్వం ఆమోదించి అమలు చెయ్యాలి.

■ ఎ. సునీత





ఢిల్లీలో ఎక్సలెన్స్ ఆఫ్ సర్టిఫికెట్‌ను స్వీకరిస్తున్న వరంగల్ బల్దియా అధికారులు

సైన్స్ సెంటర్ భూములు స్వాహా!

కబ్జాకోరల్లో 200కోట్ల విలువైన పదెకరాలు

ఆక్రమణకు గురవుతున్న హనుమకొండలోని పులిగుట్ట




- మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు కీలక నేతలు, తాజా, మాజీ కార్పొరేటర్ల హస్తం
- హంటర్‌రోడ్డులోని సర్వే నెంబరు 964, 966లో 49ఎకరాల ప్రభుత్వ భూమి
- 2015లో టైగర్స్‌హిల్స్‌పై 15ఎకరాల్లో సైన్స్ సెంటర్ ఏర్పాటు
- ఆ కేంద్రంతో పాటు పదెకరాలకుపైగా సర్కారు స్థలాల అన్యాక్రాంతం
- పక్క సర్వే నెంబరుతో అక్రమ రిజిస్ట్రేషన్లు.. దర్జాగా అక్రమ నిర్మాణాలు
- పులిగుట్ట పరిసర ప్రాంతాల భూములపై సర్వే చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..

> మహానగరంలో భూ మాయగాళ్లు చెలరేగిపోతున్నారు. వరంగల్ ట్రై సిటీస్‌లో సర్కారు జాగా ఖాళీగా కనిపిస్తే చాలు ఫెన్సింగ్ వేసి చుట్టేస్తున్నారు. పొరుగు భూముల సర్వే నెంబర్లతో రూ.కోట్ల విలువైన సర్కారు భూములకు ఎసరు పెడుతున్నారు. అక్రమ నిర్మాణాలతో పర్మినెంట్‌గా సెటిల్ అయిపోతున్నారు. కొన్నాళ్లుగా హనుమకొండ హంటర్ రోడ్డులోని పులిగుట్ట (టైగర్ హిల్స్)పై ఏర్పాటు చేసిన సైన్స్ సెంటర్‌తో పాటు సుమారు 10ఎకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, తాజా, మాజీ కార్పొరేటర్లు, అధికార పార్టీ నేతలతో పాటు చోటామోటా నేతలు గుట్టలను తవ్వేస్తూ.. ఖాళీస్థలాల్లో దర్జాగా తిష్టవేస్తున్నారు. అడుగు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైతేనే ఆగమాగమయ్యే అధికారులు పులిగుట్ట ప్రాంతంలో సుమారు రూ.200కోట్లకు పైగా విలువైన భూములు కబ్జా అవుతుంటే చోద్యం చూస్తున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉమ్మడి ఓరుగల్లు విద్యార్థులు మరింత అభ్యున్నతి సాధించాలన్న లక్ష్యంతో 2015లో హంటర్‌రోడ్డులోని పులిగుట్ట (టైగర్ హిల్స్)పై 15ఎకరాల్లో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(టీజీసీఎస్‌టీ)ని ఏర్పాటు చేశారు. నాడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న కడియం శ్రీహరి ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ రీజనల్ సైన్స్ సెంటర్‌లో 69సైన్స్ ఎగ్జిబిషన్స్‌తో పాటు ఫిజిక్స్, బయోలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఎన్విరాన్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందు కోసం గతంలోనే ప్రభుత్వం రూ.6కోట్లు వెచ్చించింది. తాజాగా మరో రూ.4కోట్లతో సైన్స్ సెంటర్ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పనులు ప్రారంభించారు. నగరం నడిబొడ్డులో ఉండ టంతో పాటు వేలాది మంది విద్యార్థులకు ఉపయోగపడే టైగర్స్‌హిల్స్ గుట్టల భూములపై కబ్జాకోరుల కన్ను పడింది. వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను కొల్లకొడుతున్నారు.



రికార్డుల్లో సర్వే నెం.964, 966లో ప్రభుత్వ భూమిగా నమోదు

రూ.200కోట్ల విలువైన భూములు స్వాహా?

వరంగల్ మహానగరం రోజురోజుకు విస్తరిస్తోంది. దీంతో భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈ నేప థ్యంలో అక్రమార్కులు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేస్తూ దర్జాగా కబ్జా చేస్తున్నారు. హనుమకొండ పట్టణంలోని హంటర్‌రోడ్డులో వన విజ్ఞాన కేంద్రం, రీజనల్ సైన్స్ సెంటర్‌తో పద్మాక్షి గుడి, సిద్ధేశ్వరస్వామి ఆలయం, జూ పార్కులు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతం కమర్షియల్‌గా అభివృద్ధి చెం దుతోంది. ఈ ఏరియాలో హనుమకొండ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 964లో 44.37 ఎకరాలు, సర్వే నెంబరు 966లో 4.03ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెండు సర్వే నెంబర్లలో మొత్తం 49ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిలో రీజనల్ సైన్స్ సెంటర్ కోసం 2015లో ప్రభుత్వం 14.20ఎకరాల భూమిని కేటాయించింది. సర్వే నెంబర్లు 964, 966లో మొత్తం 49ఎకరాల్లో సైన్స్ సెంటర్‌కు 14.20 ఎకరాల భూమిని కేటాయించగా, మిగిలిన భూమిలో 127 అక్రమ కట్టడాలు నిర్మించి నట్టు గుర్తించారు. వీటికి కార్పొరేషన్ అధికారులు ఇంటి నెంబర్లు కేటాయించటంతో పాటు ఇంటి పన్ను, నల్లాపన్నులు కూడా వసూళ్లు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అలాగే మిగిలిన భూ మికి ఎలాంటి హద్దులు లేకుండా అధికారులు వది లేశారు. ఇందులో శిల్పారామం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విలేజ్ ఏర్పాటు చేయాలని గతంలో తహసీల్దార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే అవి అమలుకు నోచుకోలేదు. కాలక్రమేణా హంటర్ రోడ్డు అభివృద్ధి చెందుతుండటంతో కబ్జారా యుళ్ల కళ్లు టైగర్ హిల్స్‌పై పడింది. గత ప్రభుత్వ హ యంలో కీలక నేతలు ఆదేశాలతోనే వారి అను చరులు హంటర్‌రోడ్డులో ఉన్న ఖాళీగా కనిపిస్తున్న గుట్టతో పాటు చెట్లను, పొదలను తన ఎక్స్‌కవేటర్ యంత్రాలతో ఓ నేత చదును చేసి దర్జాగా కబ్జా చేశారనే ప్రచారం జరుగుతోంది. పక్కనే ఇతర స ర్వే నెంబర్లలో భూములు

మిగతా 6వ పేజీలో..



సర్వే నెం.964లో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

బల్దియా సిగలో మరో మణిహారం

- నైబర్ హుడ్ పోటీలలో బల్దియాకు దక్కిన 5వస్థానం
- అధికారులను అభినందించిన మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సిగలో మరో మణిహారం చేరింది. గతంలో స్మార్ట్ సిటీ అవార్డును సొంతం చేసుకోగా, ఇప్పుడు నైబర్ హుడ్ చాలెంజ్ పోటీలలో బల్దియాకు ఎక్సలెన్స్ సర్టిఫికెట్ లభించింది. కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహ మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ) ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో స్మార్ట్‌సిటీ నగరాలకు సంబంధించిన సమా వేశం నిర్వహించారు. ఇందులో మూడేళ్లుగా నిర్వహిస్తున్న నర్చరింగ్ నైబర్ హుడ్ చాలెంజ్ (ఎన్ఎన్‌సీ) పోటీలలో దేశంలోని పది నగరాలకు గుర్తింపు లభించింది. దీనిలో గ్రేటర్ వరంగల్ టాప్-5లో నిలిచింది. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ నుంచి వరంగల్ బల్దియాకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును అందించినట్టు బల్దియా స్మార్ట్ సిటీ విభాగం ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా ఎక్సలెన్స్ సర్టిఫికెట్‌ను స్వీకరించినట్టు ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర తెలిపారు. ప్రవీణ్‌చంద్రతో పాటు ఏఈ కార్తీక్‌రెడ్డి ఉన్నారు.

కాగా, ఎన్ఎన్‌సీ పోటీలలో బెంగుళూరు, ఇండోర్, జబల్‌పూర్, కొచ్చి, నగరాలతో పాటు వరంగల్‌కు స్థానం దక్కడం సంతోషంగా ఉందని మేయర్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. అవార్డు రావడానికి కృషి చేసిన స్మార్ట్ సిటీ, ఇంజనీరింగ్ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 100 స్మార్ట్ సిటీ నగరాలను ఎంపిక చేశారన్నారు. ఫేజ్-1లో భాగంగా ఎన్ఎన్‌సీ చాలెంజ్ పేరుతో వరంగల్ నగరంలో ఎంహెచ్‌నగర్‌లో 56 గంటలలో చిట్టి పార్క్‌ను ఏర్పా టు చేసి చరిత్ర సృష్టించామన్నారు. అంతేకాకుండా క్రిష్టియన్‌కాలనీలో నైబర్ హుడ్ పార్క్, కరీమాబాద్‌లో గుండు బావి, శ్రీనగర్ కాలనీలో నెన్‌సోరి పార్కు, ఎన్‌పీ స్కూల్‌లో సైన్స్ పార్క్, అంబేద్కర్ కూడలి వద్ద బుద్ధ ప్లాజాలను నిర్దేశిత సమయంలో ఏర్పాటు చేసి డాక్యుమెంటేషన్ కమిటీకి పంపించినట్లు పేర్కొన్నారు.



పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి అర్పిస్తున్న రావు పద్మ, బీజేపీ నాయకులు

పండిట్ దీన్‌దయాళ్ జీవితం స్ఫూర్తిదాయకం

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 25: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితం స్ఫూర్తిదాయకమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. దీన్‌దయాళ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం హంటర్‌రోడ్డులోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ.. పండిట్ దీన్‌దయాళ్ నిస్వార్థ సేవాగుణం ఎంతో ఆదర్శనీయమని, దేశం, పేద ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు సేవ చేయాలన్న అంత్యోదయ భావనకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్‌రెడ్డి, పశ్చిమ నాయకులు నర్మెట్ట శ్రీనువాస్, సత్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, చల్లా జైపాల్‌రెడ్డి, సాగర్, అరణ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు బెస్ట్ సిటిజన్ సర్వీస్ అవార్డులు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: ప్రజలకు మెరుగైన సేవలు అందించిన ఆత్మకూరు, చిల్పూర్ పోలీసులు డీజీపీ జితేందర్ చేతుల మీదుగా బెస్ట్ సిటిజన్ సర్వీస్ అవార్డును అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు అందిస్తున్న సేవలతో పాటు విధి నిర్వహణలో ప్రతిభ ఆధారంగా ప్రతీ నెల రాష్ట్రంలో ఎంపికైన పోలీస్ స్టేషన్‌లకు అవార్డులు అందిస్తుంటా రు. అందులో భాగంగా బుధవారం డీజీపీ చేతుల మీదుగా ఆత్మకూరు, చిల్పూర్ సీఐలు సంతోష్, రాజేందర్‌లు అవార్డులు అందుకున్నారు. అవార్డు అందుకున్న సీఐలను సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.



అవార్డు అందుకుంటున్న ఆత్మకూరు సీఐ సంతోష్



వెహికిల్ షెడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

ప్రజలకు ఇబ్బంది కలగకుండా చెత్తను తరలించాలి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- బల్దియా షెడ్డు, చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తరలింపు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: చిన్న చిన్న వాహనాల నుంచి సేకరించిన చెత్తను భారీ వాహనాల్లో తరలించే క్రమంలో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని మునిసిపల్ వెహికిల్ షెడ్డు (వాహనాల మరమతు కేంద్రం)ను మేయర్ గుండు సుధారాణితోపాటు ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడ నిలిచిపోయిన వాహనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో సమస్య ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల న్నారు. మరమ్మతుల కోసం వచ్చిన వాహనాలను సాధ్యమైనంత త్వరగా రిపేరు చేసి విధులకు పంపించాలన్నారు. చెత్తను తరలించే క్రమంలో బాలసముద్రంలో ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతోందని ఫిర్యాదులు వచ్చాయని, అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. త్వరలో పోతననగర్‌లో ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రారంభం కానుందని, అక్కడ ప్రారంభమైతే ఇక్క డ కొంత సమస్య తగ్గుముఖం పడుతుందని అన్నారు. సకాలంలో విధులకు హాజరుకాని డ్రైవర్లు, కార్మికుల పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, డీఈ శ్రీనివాస్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

చేసింది చెప్పుకోలేకనే ఓడిపోయాం..

- పది నెలల్లో కాంగ్రెస్ చేసింది శూన్యం
- ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- పశ్చిమ నియోజకవర్గ నేతలతో సమావేశం



హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన వరంగల్ పశ్చిమ నియోజక వర్గ నేతల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

రాంనగర్, సెప్టెంబరు 25: చేసింది చెప్పుకోలేక ఓడిపోయామని, ప్రస్తుతం సంధికాలంలో ఉన్నామని, భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉద్ఘాటించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నేతల సమావేశం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ప్రజలకు చెప్పడంలో విఫలమై బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోయారన్నారు. ఈ ఓటమి మన మంచికేనన్నారు. గాడిద ఉంటేనే గుర్రం విలువ తెలుస్తుందని అన్నారు. చిట్టినాయుడు (రేవంత్‌రెడ్డి) ఉంటేనే కదా.. కేసీఆర్ విలువ తెలుస్తుందని ఎద్దేవా చేశారు.

పదిమాసాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని కేటీఆర్ అన్నారు. తంతే బూరెల బుట్టలో పడ్డ రేవంత్‌రెడ్డి.. ముఖ్యమంత్రి అయ్యాడని అన్నారు. రేవంత్‌కు కనీస పరిపాలన అనుభవం లేదన్నారు. ఇప్పటికీ ప్రతిపక్షంలో ఉన్నట్లు మాట్లాడుతున్నాడని అన్నారు. తమ్ముడికి, బావమరిదికి ముఖ్యమంత్రి వేలకోట్ల కాంట్రాక్టులు కట్టబెడుతున్నాడని ఆరోపించారు. ముఖ్యమంత్రికి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని లేదని, ఆయన దృష్టి సంపాదనపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటుంటే.. మంత్రులు ఎక్కడికక్కడ దోపిడీలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్ నగరానికి వేలకోట్ల రూపాయల నిధులు ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన నిధులతో చేపట్టిన పనులను కాంగ్రెస్ రద్దు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్‌కు బీజేపీ రక్షణ కవచంలా నిలుస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీలో పదవులు అనుభవించిన నేతలు పార్టీని వీడారని, పోయిన చెత్త పోనివ్వండని అన్నారు. మళ్లీ పార్టీని బలోపేతం చేసుకుందామని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజల పక్షాన పోరాడుదామన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని కేటీఆర్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వినయభాస్కర్‌పై కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. వినయభాస్కర్ మంచి మాస్ లీడరని, కేసీఆర్‌కు తమ్ముడిలాంటి వాడన్నారు. రానున్న రోజుల్లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. వినయభాస్కర్ ఓటమి కూడా ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. అనంతరం దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. గులాబీ కుటుం బానికి అండగా కేటీఆర్ ఉన్నాడని తెలిపారు. పార్టీ కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తూ పార్టీని బలోపే తం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నేతలు మర్రి యాదవరెడ్డి, కె.వాసుదేవరెడ్డి, జోరిక రమేశ్, పులి రజనీకాంత్, సారంగపాణి, కిరణ్ పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి

- అధికారులతో కలెక్టర్ ప్రావీణ్య

బాలసముద్రం, సెప్టెంబరు 25: హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవా నికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారు లకు సూచించారు. బుధవారం బాలసముద్రంలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రంను గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర అధి కారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కాళోజీ కళాక్షేత్రంలో నిర్మాణం పూర్తయిన వాటర్ ఫౌంటెన్, లాన్‌ఫోటో, ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియానికి సంబంధించిన ప్రొజెక్టర్ స్క్రీన్, సౌండ్‌సిస్టమ్, విద్యుద్దీపాలు, వేదిక, కళాకారుల మేకప్ రూమ్, ర్యాంప్ లైట్స్ తదితర పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆపై అధికారులకు, సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ప్రారంభోత్సవ రోజున జరిగే కార్యక్రమాలు, ఏర్పాట్లను కుడా పీవో అజిత్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్‌లను అడిగి తెలుసుకున్నారు. ప్రారంభోత్సవం రోజు ప్రారంభం నుంచి ముగింపువరకు ఎక్కడా కూడా ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో ఏర్పాట్లను చూసుకోవాలని అధికారులకు సూచించారు.



కళాక్షేత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ అశ్విని

వయోవృద్ధుల పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 25: తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007 ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసులను ఆర్డీవోలు త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవా రం అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా వయోవృద్ధుల దినోత్సవానికి సంబంధించిన వారం రోజుల కార్యక్రమాల కార్యాచరణ వివరాల గోడప్రతులను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. వారం పాటు నిర్వహించే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృ ద్ధులకు సంబంధించిన పలు కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. అనంతరం వయోవృద్ధుల హక్కులను సంరక్షిస్తామని, అందరి చేత కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, డీఈవో వాసంతి, పరకాల ఆర్డీవో నారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



రేపే బ్రహ్మాండమైన విడుదల



యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి

మరిపెడ, సెప్టెంబర్ 25 : మౌంటెనర్ యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి చేరింది. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన భూక్యా రామ్మూర్తి-జ్యోతి దంపతుల చిన్నకుమారుడైన భూక్యా యశ్వంత్ అతి చిన్న వయస్సులోనే ఆయన వయస్సుకు మించి అరచేతిలో ప్రాణాలను అడ్డుపెట్టి భయంకరమైన పర్వతాలను అధిరోహిస్తూ అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌డీసీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న భూక్యా యశ్వంత్ ఇప్పటికే సౌత్ఆఫ్రికాలోని కిలిమంజారో, యూరప్‌లోని ఎల్బ్రోస్, కోజియోసిస్, యానం, కాగ్‌చేట్, ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పర్వతాలను అధిరోహించారు. సెప్టెంబరు 4వ తేది నుంచి 18రోజుల పాటు పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడి 22వ తేదిన అరుణాచల్‌ప్రదేశ్‌లోని గోరిచెన్ అత్యంత క్లిష్టమైన పర్వాతాన్ని సైతం జయించారు. ఓ వైపు సడలిపోతున్న రాళ్ల, మరో వైపు ప్రమాదకరమైన మెరైన్‌గ్లేసియర్‌ను తట్టుకొని అవలీలగా గోరిచెన్ శిఖరానికి చేరుకొని త్రివర్ణ పతకాన్ని ఎగిరేశారు. దీంతో ఆయన ఖాతాలోకి మరో పర్వతం చేరింది. ఈ పర్వత శిఖర్నాన్ని ఎక్కెందుకు ఇది వరకు కేవలం ఆర్మీ జవాన్లకే అవకాశం ఉండేది. ప్రఖ్యాత ట్రాన్సెండ్ అడ్వెంచర్ కంపెనీ సహాయ సహకారాలు, పెద్దల దాతృత్వంతో గోరిచెన్ పర్వాతాన్ని జయించిన తొలి సివిలియన్‌గా యశ్వంత్ గుర్తింపు దేశచరిత్రలోనే గుర్తింపు పొందారు. ఈ గుర్తింపు తనకు ఎంతో సంతోషంగా ఉందని యశ్వంత్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పేర్కొన్నారు. యశ్వంత్ పర్వతరోహణపై మరిపెడ మండల ప్రజలు, భూక్యా తండా వాసులు, ఆయనకు ఆర్థికంగా, హార్థికంగా సహకరించిన దాతలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.


గోరిచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్





సైన్స్ సెంటర్ భూములు.. స్వాహా!

(5వ పేజీ తరువాయి)

కొను గోలు చేసినట్టుగా నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి, ఇతరులకు ద ర్జాగా అమ్మకాలు చేశారని సమాచారం. ఇదే అదనుగా కొందరు ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, ఉద్యోగులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. మొత్తంగా హంటర్ రోడ్డులో సుమారుగా 10ఎకరాలకు పైగా కబ్జా అయినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో గజానికి రూ.50వేల నుంచి రూ.1లక్షకు పైగా ధర పలుకుతుంది. ఈ నేపథ్యం లో పదెకరాల స్థలం కబ్జా అయితే దాని విలువ రూ.200కోట్లకు పైగానే ఉంటుందని, ఇంత జరిగినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదనేది చర్చనీయాంశంగా మారింది.

కబ్జాల వెనుక కీలక నేతలు!

సైన్స్ సెంటర్ భూముల అన్యాక్రాంతం వెనుక బడా నేతలున్నారనే చర్చ జరుగుతోంది. అడుగు జాగా కబ్జా అయితేనే అగమాగం చేసే అధికారులు వందల కోట్ల సర్కారు స్థలం కబ్జాకు గురైతే మౌనంగా ఎందుకు ఉంటున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో ఈ భూముల అన్యాక్రాంతంపై లోకాయుక్తాకు ఫిర్యాదులు వెళ్లగా.. సర్వే నిర్వహించి, అక్రమణలో ఉన్నవాటిని స్వాధీనం చేసుకుంటామని అధికారులు లోకాయుక్తాకు హామీ ఇచ్చారు. ఇది జరిగి రెండేళ్ల గడుస్తున్నా ఈ భూముల స్వాహాపై నిగ్గుతేల్చడం లేదన్న చర్చ జరుగుతోంది. ఈ కబ్జాల పర్వం వెనుక గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు వారి అనుచరులు, తాజా, మాజీ కార్పోరేట ర్ల హస్తం ఉందనే చర్చ జరుగుతోంది. ప్రస్తుత అధికార పార్టీలో ఉన్న మరో నేత కూడా కబ్జా చేసిన భూమిలోనే తిష్ట వేశారనే ప్రచారం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యేలతో పాటు కీలకమైన నేతలు, వారి అనుచరులు అక్రమార్కుల్లో ఉండటంతోనే అధికారులు భూముల సర్వేకు వెనుకాడుతున్నారని, మాజీ ఎమ్మెల్యే అనుచరుడు యంత్రాలతో గుట్టను తవ్వి పక్క సర్వే నెంబర్లతో భారీగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల క్రితం రమేష్ అనే వ్యక్తి సైన్స్ సెంటర్ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తుండగా, హనుమకొండ రెవెన్యూ అధికారులు ఆగమేఘాల మీద వెళ్లి అడ్డుకున్నారు. అదే అధికారులు గత ప్రభుత్వం హయాంలో స్వాహా చేసిన కబ్జాకోరులపై ఎందుకు దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ చొరవ తీసుకుని సర్వే నెంబరు 964, 966లో ఉన్న 49ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు వెంటనే టైగర్ హిల్స్(పులి గుట్ట)లో భూ సర్వే నిర్వహించాలని, కోట్లాది రుపాయల విలువ చేసే ప్రభుత్వ భూములకు కబ్జాకోరుల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.









వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహకు వినతి పత్రం అందిస్తున్న వైద్యులు

పల్లె దవాఖాన వైద్యుల వేతనాలు పెంచాలి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: పల్లె దవాఖాన వైద్యుల వేతనాలు పెంచాలని పెంచాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను పల్లె దవాఖాన వైద్యులు కోరారు. ఈ మేరకు మంత్రిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతీ గ్రామంలో జ్వర సర్వే నిర్వహిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నామని, అవసరమైన వారికి మందులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా డాక్టర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ రవికుమార్, సెక్రటరీ డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ వీరేంద్రనాథ్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ దశరథ్, డాక్టర్ సురేశ్, డాక్టర్ విజయ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఐపై సీపీకి ఫిర్యాదు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: వరంగల్ డివిజన్ పరిధిలోని ఒక స్టేషన్ సీఐపై సీపీ అంబర్ కిషోర్ ఝాకు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇటీవల అధికార పార్టీకి చెందిన ఒక డివిజన్ నేతను స్టేషన్‌కు పిలిపించి అక్రమ కేసు నమోదు చేసిన సీఐ.. తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. డివిజన్‌కు చెందిన ఇద్దరు నేతలకు, అదే డివి జ న్‌కు చెందిన మరోనేతకు మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో ఇద్ద రు నేతలు నియోజకవర్గంలో హవా కొనసాగిస్తున్న ఒక వ్యక్తితో సీఐకి ఫోన్‌చేయించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో సీఐ డివిజన్ నేతను స్టేషన్‌కు పిలిచి కేసుపె ట్టడంతో పాటు చేయిచేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై మనస్థాపానికి గురైన డివిజన్ నేత.. బుధవారం సీపీని కలిసి సీఐపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై సీపీ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. మొత్తంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు నేతల మెప్పు కోసం ప్రయత్నిస్తూ వివాదాల్లో

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ పరిధిలో చేపట్టిన అబివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు జరుగుతాయని, లేదంటే బిల్లులు నిలిపివేస్తామని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కాంట్రాక్టర్లను హెచ్చరించారు. గ్రేటర్ వరంగల్ 28వ డివిజన్ హంటర్‌రోడ్డు ప్రాంతంలో 100ఫీట్ల రోడ్డు వద్ద నిర్మించిన సీసీరోడ్డులో పాటు సాయినగర్ ప్రాంతంలో నిర్మించిన డ్రైనేజీని కమిషనర్‌తో పాటు అధికారులు బుధవారం పరిశీలించారు. కొలతలు వేసి పరిశీలించి అక్కడి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈలు రాజ్‌కుమార్, రంగారావు, కృష్ణమూర్తి, ఏఈలు సతీష్, హరికుమార్, ముజామిల్ పాల్గొన్నారు.



కాంతులీనుతున్న.. కళా సౌధం..

ప్రారంభానికి సిద్ధమవుతున్న కాళోజీ కళాక్షేత్రం

ఉమ్మడి జిల్లా సాంస్కృతిక కళావైభవాన్ని చాటిచెప్పేలా.. హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి మైదానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం ప్రారంభానికి సిద్ధమవుతోంది. 2014లో నాటి సీఎం కేసీఆర్ జైపూర్‌లో రాజమహల్ తరహాలోని ఈ రాజసౌధానికి శంకుస్థాపన చేయగా.. రూ.85కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. వచ్చేనెలలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉండబోతోందని అధికారులు ఇప్పటికే తెలిపారు. ఈ నేపథ్యంలో కాళోజీ కళాక్షేత్రాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించడంతో కళాక్షేత్ర భవనం ధగధగమెరిసిపోతోంది. ఇక బుధవారం ఈ కళాక్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాకడే పరిశీలించారు. మిగిలిన పనుల వివరాలను నిర్వహణ సంస్థ ప్రతినిధులను ద్వారా తెలుసుకున్న వారు త్వరితగతిన పూర్తిచేయాలని , ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

- బాలసముద్రం(హనుమకొండ)

మార్కెట్లో తడిచిన మొక్కజొన్నలు

● ఓపెన్ యార్డులో నీటిలో కొట్టుకుపోయిన ఆరబెట్టిన మక్కలు

● వెయ్యి బస్తాలకుపైగా సరుకు ఆగం ● టార్పాలిన్లు ఇవ్వడంలేదని రైతుల ఆరోపణ



కేసముద్రం మార్కెట్ యార్డులో తడిచిన మొక్కజొన్నలను దగ్గరకు చేరుస్తున్న రైతులు



తడిచిన మొక్కజొన్నలను తీస్తున్న రైతు భూక్య రాంజీ

కేసముద్రం, సెప్టెంబర్ 25 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో బుధ వారం ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్న మొక్కజొన్నలు తడిచిపోయాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు 65 మంది రైతులు 2076 బస్తాల్లో 1246 క్వింటాళ్ల మొక్కజొన్నలను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువ చ్చారు. రైతులు తమ చెల్కల వద్ద స్థలం లేకపోవడంతో మార్కెట్‌కు మొక్క జొన్నలను తీసుకువచ్చి ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్నారు. మరికొంత మంది రైతులు తమ సరుకు తేమశాతం అధికంగా ఉండడంతో ఓపెన్ యార్డులో పోసుకున్నారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా వర్షం రావడంతో రైతులు తమ సరుకును కుప్పగా పోసుకొని, రక్షించుకునేంత వ్యవధి కూడా లేక సరుకు పూర్తిగా తడిచిపోయింది. ఆరుగాలం కష్టపడి పండిం చిన పంట అకస్మాత్తుగా కురిసిన వర్షంతో వరద నీటిలో మొక్కజొన్న కొట్టు కుపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సరుకు ఆరబెట్టుకు వారిలో కొంతమంది ఈ-నామ్ లాట్ తీసుకున్నవారు సైతం ఉన్నారు. వర్షం వస్తున్న సమయంలో మార్కెట్ కార్యాలయంలో టార్పాలిన్లు కావాలని అడిగే లేవని సమాధానం చెప్పారని మండలంలోని పెనుగొండకు చెందిన రైతు శీలం శ్రీధర్‌తోపాటు మరికొంతమంది రైతులు ఆరోపించారు. మార్కెట్లో ఆర బెట్టుకున్న సరుకుకు తాము బాధ్యత వహించబోమని మార్కెట్ అధికా రులు ఖరాకండితంగా చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెనుగొండకు చెందిన తుప్పర్తి భద్ర య్య, నర్సింహులగూడెం భూక్య రాంజీ, నారాయణపురం నాంపెల్లి సురేందర్, భూక్య మంగ్యా, గుగులోత్ వెంకన్న, భవానిగడ్డతండా ధరావత్ లచ్చీరాం తదితరులకు చెందిన సుమారు వెయ్యి బస్తాలకుపైగా మొక్కజొన్నలు తడిచిపోయాయి.

నేడు బల్దియాలో ఉచిత వైద్య శిబిరం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరవుతారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9701999689 సెల్ నెంబర్‌కు ఫోన్‌చేయాలని డాక్టర్ రాజేశ్ తెలిపారు.

30 నుంచి కేయూ మెస్‌కు దసరా సెలవులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: కాకతీయ యూనివర్సిటీలోని మెస్‌లకు సెప్టెంబరు 30 మధ్యాహ్నం నుంచి దసరా పండువను పురస్కరించుకుని సెలవులను ప్రకటిస్తున్నట్లు వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో దసరా సెలవులు అక్టోబరు 2 నుంచి 14 వరకు ప్రకటించారన్నారు. కాగా, విద్యార్థులకు అక్టోబరు 15 నుంచి మెస్‌లన్నీ యథావిధిగా పునఃప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు. అక్టోబరు 15 తర్వాత విద్యార్థులు హాస్టల్స్ అడ్మిషన్లు రెన్యూవల్ చేసుకోవాలని వారికే భోజనం పెడతామని స్పష్టం చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: కాకతీయ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టుపై 68 అసిస్టెంట్ ప్రొఫెసర్, నాలుగు సీఏఎస్ఆర్ఎంవో పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి కేఎంసీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 27 నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు కేఎంసీలో ఉదయం 10 నుంచి 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రెయినీ ఎస్సైలకు పోలీసు స్టేషన్‌ల కేటాయింపు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలకు కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌లను కేటాయిస్తూ బుధవారం సీపీ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. పల్లె పవన్‌కు కాజీపేట, మామునూరు, బి.హేమలతకు సుబేదారి, వర్ధన్నపేట, బండారి శివకు మిల్స్‌కాలనీ, రఘునాథపల్లి, బి.సుజిత్‌కు ఆత్మకూరు, హనుమకొండ, అనంతగిరి మధుకు జనగామ, ఇంతెజార్‌గంజ్, లింగాల దిలీప్‌కు నర్సంపేట, హసన్‌పర్తి, పి.భాగ్యశ్రీకి స్టేషన్ ఘన్‌పూర్, పరకాల పోలీసుస్టేషన్‌లకు కేటాయించారు. ప్రతీ ఎస్సైకి రెండు స్టేషన్‌లు కేటాయించారు. వీరు ఈనెల 25 నుంచి వచ్చేనెల 10వరకు ఒక స్టేషన్, వచ్చేనెల 10 నుంచి 24వ తేదీ వరకు మరో స్టేషన్‌లో విధులపై శిక్షణ తీసుకోనున్నారు.



కేఎంసీలో జరిగిన ఉత్కర్ష వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు





వేడుకలను ప్రారంభిస్తున్న అధికారులు

ఉత్సాహంగా సాగుతున్న ఉత్కర్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: కాకతీయ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్కర్ష వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బుధవారం ఐదోరోజు ట్రెడిషనల్ డే నిర్వహించారు. ఇందులో విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రాధారణలో కనిపించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో విశేషంగా ఆకట్టుకున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం ట్రెడిషనల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి బహుమతులను అందజేశారు. సాయంత్రం విద్యార్థులు దాండిక కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ లక్ష్మణ్ నాయక్ మృతి

వడ్డెపల్లి, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ సదాశివ కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కునుసూతు లక్ష్మణ్ నాయక్ (57)గుండె పోటుతో బుధవారం తెల్లవారుజాముున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మణ్ నాయక్ భౌతికకాయాన్ని పరకాల ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ ధరంసింగ్, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ యూనియన్ నేత గోవర్ధన్ నాయక్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ.20వేలను ప్రభుత్వ పరంగా కుటుంబ సభ్యులకు అందించారు. 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, ఎస్‌డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ గుగులోత్ వీరన్న నాయక్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

మైనర్లపై కేసు నమోదుపై ఆరా

ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదిక

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: మైనర్లపై కేసు నమోదుపై ప్రభుత్వం ఆరా తీసింది. దీనిపై ఇంటెలిజెన్స్ అధికారులు నివేదికను పంపించారు. బుధవారం పత్రికల్లో మైనర్లపై కేసు నమోదుపై కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై ప్రభుత్వం నివేదికను కోరగా ఇంటెలిజెన్స్ అధికారులు పంపారు. కట్ల రాజు అనే సీఐడీ కానిస్టేబుల్ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ టవర్స్‌లో ఉంటున్నాడు. ఈయనకు కూతురు ఉంది. అదే అపార్ట్‌మెంట్‌లో ఉన్న 8మంది పిల్లలు రాజు కూతురిని దూషిస్తూ కారుపై గీతలు గీశారు. సీసీ పుటేజీ ద్వారా పిల్లలు చేసిన పనిని గుర్తించి వారి తల్లిదండ్రులకు చెప్పారు. అయితే కారు రిపేరుకు డబ్బులు చెల్లిస్తామని చెప్పి 10రోజుల వరకు స్పందించలేదు. దీంతో కానిస్టేబుల్ రాజు సుబేదారి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఇన్సూరెన్స్ కంపెనీ కారు డ్యామేజీకి రూ.80వేలు చెల్లించింది. కేసు విచారణలో భాగంగా పిల్లల తల్లిదండ్రులను ఎస్ఐ పిలిపించినందుకు సోషల్ మీడియాలో వైరల్ అయిందని, ఆపై పత్రికల్లో కథనాలు వచ్చాయని నివేదికను ఇంటెలిజెన్స్ అధికారులు పంపించారు.

ఆ 'పెద్ద మనిషి' ఎవరు?

● ఆరా తీస్తున్న నిఘా వర్గాలు

● పోలీసులు మర్యాదలపై సీఎం సీరియస్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పోలీసు మర్యాదలు పొందుతున్న వ్యక్తిపై నిఘా వర్గాలు ఆరా తీసినట్లు సమాచారం. మంగళవారం కార్పొరేషన్‌కు వచ్చిన సదరు వ్యక్తికి ఒక ఏసీపీ, సీఐలు మర్యాదలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో సాధారణవ్యక్తిగా ఉన్న ఆ వ్యక్తికి ఇద్దరు గన్‌మెన్‌లు సైతం ఉన్నట్లు సమాచారం. ఆ వ్యక్తి విషయం హాట్ టాపిక్‌గా మారడంతో ముఖ్యమంత్రి దృష్టికి సైతం వెళ్లినట్లు తెలిసింది. దీనిపై సీఎం సీరియస్ అయినట్లు సమాచారం. అతడికి గన్‌మెన్‌లు ఎందుకు ఇచ్చారని పోలీసు అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. అధికార పార్టీ పేరు చెప్పుకుని పార్టీకి నష్టం కలిగే పనులు చేసేవారిని క్షమించకూడదని జిల్లా పార్టీ నేతలకు రేవంత్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. సదరు వ్యక్తికి గన్‌మెన్‌లను తొలగించడంతో పాటు పార్టీకి దూరం పెట్టే అవకాశాలున్నట్లు తెలిసింది. మర్యాదలు చేసిన పోలీసు అధికారులపై త్వరలో చర్యలుండే అవకాశం ఉన్నట్లు అధికారిక సమాచారం.

తల్లిదండ్రులు తలెత్తుకునేలా అమ్మాయిలు ఎదగాలి..

కేయూలో మహిళ ఇంజనీరింగ్ కళాశాల అవిర్భావ వేడుకల్లో డీసీపీ షేక్ సలీమా



యూ బ్లెడ్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ షేక్ సలీమా, ఈసీ మెంబర్లు సురేశ్‌లాల్, నిమ్మ సుదర్శన్ తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: అమ్మాయిలు తమ తల్లిదండ్రులు తలెత్తుకునేలా జీవితంలో ఎదగాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ఉద్బోధించారు. గురువారం కేయూ సెనెట్ హాల్‌లో వర్సిటీ క్యాంపస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు అధ్యక్షతన కళాశాల అవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ సలీమా మాట్లాడుతూ.. మహిళలందరూ అన్ని రంగాల్లో ముందుడాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించాలని సూచించారు. జీవితంలో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు. షీటీంలపై అవగాహన ఉండాలని చెప్పారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగమణి మాట్లాడుతూ.. అమ్మాయిలు చదువులతో పాటు వ్యక్తిగత రక్షణ, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మంచి గుర్తింపు తెచ్చుకుని తమ కిష్టమైన రంగాల్లో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు మాట్లాడుతూ.. ప్రైవేట్ కళాశాలతో పోటీపడి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. అమ్మాయిలు చదువులతో పాటు తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. వర్సిటీ న్యాయకళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యుడు డాక్టర్ నిమ్మ సుదర్శన్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యకు బాగా డిమాండ్ ఉందని చెప్పారు. ఖరీదైన ఇంజనీరింగ్ విద్యను గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మాయిలకు వర్సిటీ క్యాంపస్ కళాశాల అందిస్తోందని వివరించారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని ఎదగాలని హితవు పలికారు. ఈసీ మెంబర్ డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో స్థిరపడేందుకు మంచి అవకాశాలున్నాయని చెప్పారు. ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు మాట్లాడుతూ. వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో పేద, మధ్యతరగతి యువత చదువుకుని టెక్నాలజీరంగంలో ఎదుగుతున్నారని అన్నారు.

కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.కిరణ్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించగా, అధ్యాపకులు డాక్టర్ వీణ, తూర్పాటి వెంకటేశ్, సురేందర్, సాయి తరుణ్, స్వప్న, వాణిశ్రీ, సాహితీ, యశస్విని, దీప్తి, పీవీ వైష్ణవి, రచన, శ్రీజ, కిషన్, దేవేందర్, వాణి, డాక్టర్ జ్యోత్స్న, అనూష, రమ, జ్యోతి ఏఆర్ ఆర్.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వీరునాయక్, బోధనేతర సిబ్బంది మల్లేశం, జగన్, యాదగిరి, ఫిరోజ్, హుస్సేన్, చైతన్య, లావణ్య, నాగరాజు, తాజ్‌బాబా, ప్రమీల, మమత, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు చేశారు. అలాగే క్రీడాపోటీల్లోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా అతిథులు యూ బ్లెడ్‌యాప్‌ను ఆవిష్కరించారు. రక్తదాన ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని పేర్కొన్నారు.

క్యాన్సర్ నిర్మూలనకు సమగ్ర పరిశోధనలు జరగాలి

హైదరాబాద్ హెచ్‌సీయూ ప్రొఫెసర్ గీత కె.వేముగంటి

కేయూలో జంతుశాస్త్రం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న గీత వేముగంటి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఇస్తారి తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: క్యాన్సర్ నిర్మూలనకు సమగ్ర పరిశోధనలు జరగాలని హైదరాబాద్ కేంద్రియ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ గీత కె.వేముగంటి అన్నారు. బుధవారం జంతుశాస్త్ర విభాగంలో రెండురోజుల జాతీయ సదస్సు క్యాంపస్‌లోని జువాలజీ సెమీహాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా గీత కె.వేముగంటి మాట్లాడుతూ.. 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ యానిమల్ సైన్సెస్' అనే అంశం కీలక ప్రసంగం చేశారు. క్యాన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధన అవసరమన్నారు. సాధారణ కణాలు ఉత్పరివర్తనం చెందడంతో క్యాన్సర్ కణాలుగా మారుతాయని పేర్కొన్నారు. క్యాన్సర్ కణాలు శరీరంలో ఇతర విభాగాలకు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. క్యాన్సర్ చివరి దశలో ప్రాణ ప్రాయం స్థితి ఏర్పడుతోందని చెప్పారు. క్యాన్సర్ చికిత్సలో వాడే మందుల వలన రోగ నిరోధక శక్తి క్రమగా తగ్గుతోంద ని అన్నారు. క్యాన్సర్ మూల కణాలపై సమగ్ర పరిశోధనలు జరగాలని అన్నారు. పరిశోధనలతోనే అనేక రకాల వ్యాధులకు ఔషధాలను కనుగోనేందుకు వీలవుతుందని చెప్పారు.

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. బయోటెక్నాలజీ రంగంలో దేశం ముందుకుపోతోందని అన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రెండురోజుల జాతీయ సదస్సును నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. జువాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ షమిత మాట్లాడుతూ.. రెండు రోజుల జాతీయ సదస్సుల్లో ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు 100మంది వరకు విలువైన పరిశోధన పత్రాలను సమర్పిస్తారని వెల్లడించారు. బెంగళూరు గీతం వర్సిటీతోపాటు ఇతర వర్సిటీ నుంచి అతిథులు హాజరుకానున్నట్లు వివరించారు. సెమినార్ సావనీర్‌ను అతిథులతో కలిసి ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ మావిండాల ఇస్తారీ ఆవిష్కరించారు.



హనుమకొండ బస్టాండ్‌లో పోగొట్టుకున్న బంగారు గొలుసును అందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

బాలసముద్రం, సెప్టెంబరు 25: హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి ప్రయాణం చేస్తున్న ఓ వృద్ధురాలు పోగొటు ్టకున్న బంగారు గొలుసును ఆర్టీసీ సిబ్బంది గుర్తించి ఆ వృద్ధురాలికి అందించారు. బుధవారం ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఆకుల శంకరమ్మ బుధవారం హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణిస్తోంది. హనుమకొండలో దిగిన శంకరమ్మ తన బంగారు గొలుసు ఉన్న పర్సును బస్సులోనే మరిచిపోయింది. పర్సు పోయిందని గమనించిన ఆమె.. అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది నవీన్, ఆర్.శ్రీధర్‌లకు విషయాన్ని తెలిపింది. వెంటనే స్పందించిన వారు శంకరమ్మ ప్రయాణించిన బస్సు హనుమకొండ బస్టాండ్ నుంచి బయటకు వెళ్తుండగా బస్సును నిలిపివేసి అందులో ఉన్న బంగారం, ఇతర వస్తువులు తీసుకొచ్చి శంకరమ్మకు అందించారు. ఈ సందర్భంగా బస్‌స్టేషన్ మేనేజర్ సెక్యూరిటీ సిబ్బందిని అభినందించారు.



కొండా లక్ష్మణ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనందం

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 25: కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని హనుమకొండ అదాలత్‌లోని అమరవీరుల స్థూపం పక్కన ఏర్పాటు చేయాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం డిమాండ్ చేశారు. ఈ మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జి. రాంరెడ్డిని హనుమకొండ కలెక్టరేట్‌లోని చాంబర్‌లో బుధవారం పద్మశాలీ సంఘం జిల్లా నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రాంరెడ్డిని కలిసిన వారిలో జిల్లా పద్మశాలీ సంఘం నాయకులు వి.నరేందర్, కుసుమ శ్యాంసుందర్, వెంగళ వేణు, తవటం రవీందర్, కేదాశి వెంకటేశ్వర్లు, పోరండ్ల రమేష్, వెంగళ రమేష్, రాజేందర్ తదితర నాయకులు ఉన్నారు.



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్ల జేఏసీ ప్రతినిధులు

ఆటోడ్రైవర్లకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 25: రెక్కాడితే గాని డొక్కాడని ఆటోడ్రైవర్లకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆటో డ్రైవర్స్ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చిర్ర రమేష్‌గౌడ్, కన్వీనర్ ఎం.డి. అంకుషావలి కోరారు. బుధవారం హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆటో డ్రైవర్స్ జేఏసీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలను విస్మరించిందన్నారు. సొంత ఇల్లులేక అద్దెగృహాల్లో నివాసం ఉంటూ చాలీచాలని సంపాదనతో కుటుంబపోషణ భారంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వలన తమకు ఉపాధి కరువైందని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆటోడ్రైవర్స్ ఉమ్మడి జిల్లా జేఏసీ ప్రతినిధులు యాదగిరి, ఎల్లయ్య, లక్ష్మయ్య, సాంబయ్య, సదయ్య తదితరులు ఉన్నారు.

ఎస్సార్‌యూ డీన్‌కు బోర్లాగ్ అవార్డు

హసన్‌పర్తి, సెప్టెంబరు 25: మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల డీన్‌కు డాక్టర్ ఎన్.ఈ.బోర్లాగ్ అవార్డు లభించినట్లు ఎస్సార్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ దీపక్‌గార్గ్ తెలిపారు. డాక్టర్ జి.భూపాల్‌రాజ్‌కు పంటల సుస్థిర దిగుబడులకు సమతుల పోషకాల ఆవశ్యకత పైన జరిపిన వివిధ పరిశోధనలకుగాను ఈ అవార్డును అందించారు. ప్రపంచ ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ ఈ బోర్లాన్ పేరున ఉన్న అవార్డును ఆగస్టు 29న భారత వ్యవసాయమండలి సహకారంతో జరిపిన అంతర్జాతీయ సదస్సులో అవార్డును ప్రకటించినట్లు తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఆ సదస్సుకు హాజరుకాలేకపోయిన కళాశాల డీన్ డాక్టర్ భూపాల్ రాజ్‌కు బుధవారం పోస్టులో ఈఅవార్డును పంపించినట్లు ఎస్సార్‌యూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దీపక్‌గార్గ్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా అవార్డును అందుకున్న భూపాల్‌రాజ్‌ను యూనివర్సిటీ చాన్సలర్ ఎనగందుల వరదారెడ్డి, వైస్ చాన్సలర్ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, యూనివర్సిటీ అధ్యాపకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన మాజీ ఎంపీ



టీపీసీసీ అధ్యక్షుడికి బొకే ఇస్తున్న సురేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 25: ఉమ్మడి వరంగల్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అభినందనలు తెలియచేశారు. కార్యక్రమంలో నాయకుడు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ప్రజారోగ్యంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.లలితాదేవి
- ఘనంగా ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సం



డీఎంహెచ్‌వో లలితాదేవికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: ప్రజారోగ్య సంక్షేమంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని హనుమకొండ డీఎంహెచ్‌వో కోడూరి లలితాదేవి అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లలితాదేవి మాట్లాడుతూ.. ఫార్మసిస్టులు కరోనా సమయంలో అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. పెరిగిన పనిభారాన్ని ఎదుర్కొనేందుకు పీహెచ్‌సీలలో రెండు ఫార్మసిస్టుల పోస్టులను మంజూరు చేసేందుకు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, కందకట్ల శరత్‌బాబు, ఉప్పు భాస్కర్‌రావు, సతీష్, ప్రేమ్‌సాగర్, అవినాశ్, నాగమణి, వెంకటస్వామి, విజయ, ఝాన్సీ, శోభ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులను వినియోగించొద్దు

పొగాకు, పొగాకు ఉత్పత్తులను వినియోగించొద్దని డీఎంహెచ్‌వో లలితాదేవి సూచించారు. బుధవారం హనుమకొండ బస్టాండ్ రోడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో లలితాదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పొగాకు, పొగాకు ఉత్పత్తులు ఖైని, జర్దా, గుట్కా, సిగరేట్, బీడీలు, చుట్టలు, పాన్ మసాలా వంటి వాటితో వచ్చే అనారోగ్య సమస్యలపై చర్చించారు. అనంతరం లలితాదేవి మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు చూసి ఆకర్షితులై అలవాట్ల బారినపడి అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. అంతేకాకుండా ప్రజలు పొగాకు, పొగాకు సంబంధిత ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సయ్యద్ అహ్మద్, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ వాణి, హెల్త్ సూపర్‌వైజర్ రామచందర్, విప్లవ్, సోషల్ వర్కర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు అభినందనలు

హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా పూర్తి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.లలితాదేవిని బుధవారం పలువురు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి బైరి సోమయ్య, సహ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కత్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమావేశానికి సుందర్‌రాజ్ డుమ్మా

రాంనగర్, సెప్టెంబరు 25: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమావేశానికి మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ బుధవారం జరిగిన సమావేశానికి డుమ్మా కొట్టారు. ఇటీవల కేటీఆర్‌ను కలిసి పార్టీని వీడనని హామీ ఇచ్చిన సుందర్‌రాజ్ డుమ్మా కొట్టడంతో ఆయన పార్టీ వీడటం ఖాయమనే వార్తలు మరోసారి తెరపైకి వచ్చాయి. రెండు రోజుల కిందట హైదరాబాద్‌లో జరిగిన బీసీ సంఘ సమావేశంలో పాల్గొన్న సుందర్‌రాజ్.. బీఆర్‌ఎస్ సమావేశానికి హాజరుకాకపోవడం అనుమానాలకు అవకాశం ఇచ్చినట్లు అయింది. బీసీ సంఘ నేతల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీ ఆవిర్భావం అవుతుందనే ప్రచారం తెరపైకి రావడం.. సుందర్‌రాజ్ దానికి కీలకపాత్ర పోషించే అవకాశం ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

'మేలుకొలుపు'ను జయప్రదం చేయాలి

ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉపేందర్

ధర్మసాగర్, సెప్టెంబరు 25: మాదిగల మేలుకొలుపు యాత్రను జయప్రదం చేయాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించి జిల్లాల వారీగా రిజర్వేషన్ చేయాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అక్టోబర్ 1న మాదిగల మేలుకొలుపు యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఏబీసీడీ వర్గీకరణ రాష్ట్రాల వారీగా రిజర్వేషన్ చేసే విధంగా సుప్రీం కోర్టు తీర్పు వెలువడటంతో తెలంగాణలోని మాదిగలకు జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో తెలంగాణలో మాదిగల మేలుకొలుపు యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బర్ధన్ ఆశయం కోసం ఉద్యమిద్దాం

సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

బాలసముద్రం, సెప్టెంబరు25: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ ఆశయ సాధన కోసం ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. బుధవారం బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏబీ బర్ధన్ శత జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర ఉద్యమంలో విద్యార్థుల సమస్యలపై, భూసంస్కరణల అమలు చేయాలని నినదించిన మహా నేత బర్ధన్ అని అన్నారు. కులమతాలకు అతీతంగా మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు శాంతితో జీవించాలని దేశవ్యాప్తంగా ఉద్యమాలను నిర్వహించి తన జీవితం ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. దేశవ్యాప్తంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాలక ప్రభుత్వాలపైన ప్రశ్నించారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్రసమితి సభ్యులు అదిరి శ్రీనివాస్, ఏశ బోయిన శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి, మాలోతు శంకర్, గుంటి రాజేందర్, అశోక్, పూర్ణచందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన వృత్తి విద్యా కళాశాల విద్యార్థులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: హనుమకొండ జిల్లా యువజన క్రీడా సంక్షేమ శాఖ నేతృత్వంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగంలోని 10మంది వలంటీర్లు గ్రూప్ డ్యాన్స్ విభాగంలో ప్రతిభ చూపి జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల సంక్షేమ అధికారి అశోక్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీధర్‌లతోపాటు ఇతర అధికారులు, అధ్యాపకులు గెలుపొందిన వలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందచేసి అభినందించారు. విద్యార్థులు వచ్చేరోజుల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో కళాశాల పేరును నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సన్యాసి శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అక్టోబరు 27న ఎంటీఎస్ పరీక్ష

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 25: వచ్చే నెల 27న నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్‌లో మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఈ మేర కు బుధవారం ఇనిస్టిట్యూట్‌లో ఎగ్జామ్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షను మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టి ట్యూట్ ప్రధాన కేంద్రమైన రాజస్థాన్ కోటా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఎగ్జామ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 150 కోట్ల స్కాలర్‌షిప్, 2 కోట్ల ప్రైజ్ మనీ, 500 మంది విద్యార్థులకు ఉచిత విద్య అందివ్వనున్నట్లు తెలిపారు.

అదేవిధంగా మోషన్ వరంగల్ సెంటర్ నుంచి ఐదుగురికి ఉచిత విద్య, మరో ఐదుగురికి విద్యార్థులకు ఫీజుల్లో 50 శాతం రాయితీతో పాటు రూ. 18 లక్షల స్కాలర్‌షిప్, మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్, రెండో ర్యాంకు సాధించిన విద్యార్థికి ట్యాబ్లెట్, లక్ష రూపాయల విలువ గల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. మిగతా వివరాల కోసం నయీంనగర్ ఇనిస్టిట్యూట్‌లో గానీ, లేదా 9703000850, 51, 52 నెంబర్స్‌కు ఫోన్ చేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మోషన్ ఇనిస్టి ట్యూట్ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్‌గౌడ్, మోషన్ బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేశ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి.మురళి, మార్కెటింగ్ మేనేజర్ శనిగరపు సుమన్, మార్కెటింగ్ టీం సభ్యులు తాళ్లపల్లి రమేశ్, పాక నాగరాజు, రచ్చ కుమార్, మండల రాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇనిస్టిట్యూట్ చైర్మన్ వేణుగోపాల్

మాల పరిచయ వేదిక భవన అభివృద్ధికి కృషి చేస్తా

న్యూశాయంపేట, సెప్టెంబరు 25: మాల పరిచయ వేదిక భవన అభివృద్ధికి కృషిచేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. న్యూశాయంపేట జంక్షన్‌లో ఉన్న నందనార్ మాల కళ్యాణ పరిచయ వేదిక భవన నిర్మాణ పనులకు బుధవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజుతో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరూ. ఒకేచోట కలుసుకునే ఇలాంటి కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వ సహాయ సహకారాలు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, నందనార్ మాల కళ్యాణ పరిచయ వేదిక నాయకులు పాల్గొన్నారు.

కిట్స్‌లో ఇంటర్ కాలేజియేట్ పురుషుల టోర్నమెంట్

ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి

హసన్‌పర్తి, సెప్టెంబరు 25: మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ కళాశాల క్యాంపస్ ప్లే ఫీల్డ్స్‌లో ఈనెల 29న కేయూ ఇంటర్ కాలేజియేట్ పురుషుల టోర్నమెంట్స్ ఫేజ్-1 ప్రారంభమవుతుందని కిట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే అశోక్‌రెడ్డి తెలిపారు. కళాశాల ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 29, 30 రెండు రోజుల పాటు ఈ టోర్నమెంట్స్ ఓపెన్ డయిస్, ప్లే ఫీల్డ్స్, కిట్స్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ వరంగల్ రిజిస్ట్రేషన్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, గౌరవ అతిథిగా కేయూ వరంగల్ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ పి.వెంకయ్య, కిట్స్ చైర్మన్ కెప్టెన్ వీ లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఇందులో భాగం గా మొత్తం ఆరు రకాల ఆటలు షటిల్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బా ల్, టేబు ల్ టెన్నిస్, చెస్, వాలీబాల్, ఫుట్‌బాల్ నిర్వహిం చబ డుతాయని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్, ఫిజిక ల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌వో డాక్టర్ డి.ప్రభాకరాచారి, డీన్స్, హెడ్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'వర్సిటీ భూ కబ్జాదారులకు వ్యతిరేకంగా పోరాటం'

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: వర్సిటీ భూములను కబ్జా చేసిన వారికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ (డీఎస్ఏ) రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ వెల్లడించారు బుధవారం కేయూ అతిథిగృహం వద్ద ఏర్పాటుచేసిన డీఎస్ఏ సమావేశంలో శ్రావణ్ మాట్లాడారు. రాష్ట్రంలోని వర్సిటీల్లోని భూములను కబ్జాదారులు అక్రమించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీ అధికారులే కబ్జాల్లో ఉండటం గమనార్హమని చెప్పారు. వర్సిటీ, రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని కబ్జాదారుల నుంచి వర్సిటీ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్ఏ రాష్ట్ర కోకన్వీనర్ మున్నా గణేశ్ మాట్లాడుతూ.. వర్సిటీకి సుమారు 650 ఎకరాల భూమి ఉండగా, ప్రస్తుతం 400 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు తెలు స్తోందని ఆరోపించారు.

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం వర్సిటీ భూముల హద్దులను నిర్ధారించి న్యాయం చేయాలని అన్నారు. సీఆర్‌పీఎఫ్‌కు గతంలో వర్సిటీ కేటాయించి భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎస్ఏ రాష్ట్ర నాయ కులు ఉప్పుల శివ, మహేశ్, సాయిరాం, రవి, శివ, అశోక్, చరణ్, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 25: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఈద్గా, ఫైన్ ఫంక్షన్‌హాల్, పోచమ్మకుంట, శ్రీనగర్‌కాలనీ, నయీంనగర్, లష్కర్ సింగారం, రాంనగర్, రాజాజీనగర్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్ బ్యాక్ సైడ్‌లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, కిషన్‌పురలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని వినాయకనగర్ కాలనీ, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సర్క్యూట్ హౌస్ రోడ్డు, కోర్టు బ్యాక్‌సైడ్ ఏరియాలో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సిద్ధార్థ నగర్, వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్, అన్సారీ కాలనీ, వీజీఆర్ అపార్ట్‌మెంట్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని అడ్వకేట్స్ కాలనీ, బాలసముద్రం, హనుమకొండ చౌరస్తా, కాకాజీ కాలనీ, లైబ్రరీ, మచిలీబజార్, రాంనగర్, సాయినగర్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 9 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ తెలిపారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

మడికొండ, సెప్టెంబరు 25: బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం మడికొండలో భారతీయ జన సంఘ్ సిద్ధాంతకర్త దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ సరోజన కరుణాకర్, జిల్లా నాయకులు పొనగోటి వెంకట్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, బొల్లికొండ వినోద్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జి పొనుగోటి పాపారావు, పిట్టల రమేష్ ,దువ్వ నవీన్, కేటిక సదానందం, కందుకూరి బాలరాజు, కొలిపాక కుమార్ బాబు, వస్కుల మౌళి, నిఖిల్ రావు, మాచర్ల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ సమస్యను పరిష్కరించాలి

మడికొండ, సెప్టెంబరు 25: మడికొండ శివారులోని చెత్త డంపింగ్ యార్డు తొలగించాలని కోరుతూ వడ్డెర సంఘం జిల్లా వ ర్కింగ్ ప్రెసిడెంట్, బీజేపీ నాయకులు పల్లపు మల్లికార్జున్ మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ.. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న విషవాయువులు సమీపంలోని మడికొండ, రాంపూర్, ఎలుకుర్తి గ్రామాలకు విస్తరించి ప్రజల పాలిట శాపంగా మారాయని తెలిపారు. ప్రజలు అనారోగ్యానికి గురవడంతో పాటు అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రిన్సిపల్ సెక్రటరీని కోరినట్లు మల్లికార్జున్ తెలిపారు.

బల్దియా జేఏసీ ఎన్నికలు ఏకగ్రీవం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ జేఏసీ ఎన్నికలు బుధవారం బల్దియాలోని కౌన్సిల్ హాల్‌లో జరిగాయి. ఈ ఎన్నికలకు పర్యవేక్షకుడిగా గౌరవ అధ్యక్షుడు బీరు శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడు బొట్ల భిక్షపతి మాదిగ, ఏల్పుల ధర్మరాజు యాదవ్ వ్యవహరించారు. గతంలో బల్దియా ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై కృషిచేసిన వారిని ఏకగ్రీవంగా నియమించినట్లు ఎన్నికల పర్యవేక్షకులు వెల్లడించారు. జేఏసీ అధ్యక్షుడిగా బొట్ల రమేష్, ప్రధాన కార్యదర్శిగా భాకం సంతోష్, కోశాధికారిగా కట్కూరి స్వర్ణరాజు, కార్యదర్శిగా బానోత్ బాలునాయక్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా రాజారపు భాస్కర్‌లను నియమించారు. కొద్దిరోజుల్లో పూర్తిస్థాయి కమిటీ వేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్ల రమేష్, జన్ను ప్రకాశ్, జీవన్, పాశం రవి, సత్యం, దేవేందర్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ ప్రతుల దహనం

వడ్డెపల్లి, సెప్టెంబరు 25: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను నిరసిస్తూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బ్లాక్‌డేను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లేబర్ కోడ్‌ల ప్రతులను వారు దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు తెలూరి ఉప్పలయ్య, పుల్ల అశోక్, బొల్లారపు సంపత్, రజిత, యాకయ్య, గుడ్డి రాజేందర్, పూర్ణచందర్, మల్లయ్య, మంద మల్లేశం, కారు ఉపేందర్, సంపత్, వెంకట్, భాను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: చాలా కాలంగా గ్రేటర్ వరంగల్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సింగారపు బాబురావు డిమాండ్ చేశారు. బుధవారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుల కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. చాలాకాలంగా సిబ్బందికి పీపీ కిట్లు, యూనిఫామ్, ఆప్రాన్, షూష్‌కాట్స్, చీపుర్లు, సబ్బులు, నూనెలు, రక్షణ పరికరాలు మూడేళ్లుగా ప్రభుత్వం ఇవ్వకుండా జాప్యం చేస్తోందని మండిపడ్డారు. వెంటనే కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు బరుపట్ల మహేశ్, జన్ను ప్రకాశ్, జీవన్, రంజీత్, సునీత, శ్యాం, నరేంద్రచారి, మాధవ్, కిశోర్ పాల్గొన్నారు.

ఈఈ రాజయ్యకు ఎస్ఈగా పదోన్నతి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో ఈఈగా పనిచేస్తూ ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్ఈగా కొనసాగుతున్న కె.రాజయ్యకు పూర్తిస్థాయి ఎస్ఈ (సూపరింటెండింగ్ ఇంజనీర్)గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన బదిలీలలో వరంగల్ బల్దియా ఇంజనీరింగ్ విభాగంలో ఎస్ఈగా పనిచేసిన కృష్ణారావుకు హైదరాబాద్‌కు బదిలీ అయ్యింది. అప్పటినుంచి రాజయ్య ఎస్ఈగా అదనపు బాధ్యతలు చేపట్టారు. కాగా, బుధవారం రాజయ్యతోపాటు రాష్ట్రంలో మరో నలుగురికి ఎస్ఈలుగా పదోన్నతులు కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరి దానకిశోర్ ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతి పొందిన రాజయ్యను తన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యవసాయంపై అవగాహన కోసం శిక్షణ

ధర్మసాగర్, సెప్టెంబరు 25: వ్యవసాయంపై అగ్రికల్చర్ విద్యార్థులకు అవగాహన కోసం గ్రామీణ ప్రాంతాలలో రైతులతో కలిసి శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్ఆర్ వర్శిటీ కళాశాల డీన్ భూపాలరాజ్ అన్నారు. ఎస్ఆర్ యూనివర్సిటీ అగ్రికల్చర్ ట్రైనీ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ మూల్యాంకనం విశ్లేషణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అగ్రికల్చర్ విద్యార్థులను గ్రామాలకు అనుసంధానం చేస్తూ, తరగతి గదుల్లో నేర్చుకోవడంతో పాటు ప్రత్యేకంగా పంట పొలాల్లో ఏ సమస్యలు ఉన్నాయని తెలుకోవడానికి, ఆరు నెలల పాటు ప్రత్యేక సెమిస్టర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థికి ఒక రైతును అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. రైతుతో పాటు పొలాలకు వెళ్లి గత ఐదు సంవత్సరాలలో ఏయే పంటలు పండించారో, పండించిన ఆ పంటల్లో ఏం సమస్యలు ఉన్నాయే తెలుసుకోవాలని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్యామ్‌బాబు, రాథోడ్‌లాల్, శ్రీను, గిరీశం, విద్యార్థులు బి. ప్రియ, బి.శివాని, వి. వైష్ణవి, వి. వర్ష, పి.శ్రీవల్లి, ఎస్. శివాని పాల్గొన్నారు.

పిల్లల కోసం సమయం కేటాయించాలి



అవగాహన కల్పిస్తున్న అనితారెడ్డి

కాజీపేట జంక్షన్, సెప్టెంబరు 25: తల్లిదండ్రులు తమ పిల్లల కోసం సమయం కేటాయించాలని కేయూ పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డి సూచించారు. బుధవారం హనుమకొండలోని వాగ్దేవి పాఠశాలలో 'గుడ్ - బ్యాడ్ టచ్' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గురువులు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి దేశానికి ఉపయోగపడేలా తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు స్వప్న, శోభారాణి, వాహిని, సమత, శ్రీలత, పూజిత, జ్యోతి, నవత, శిరీష పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 25: బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో కంచరకుంట, 7వ డివిజన్‌లో సభ్యత్వ నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, బీజేపీ కార్యకర్తలు యాదగిరి, పూజిత, కనకయ్య, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



9 ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం
26 సెప్టెంబరు 2024

మగరాయుడని వెక్కిరించారు

రంగు బాలలక్ష్మీగౌడ్... కష్టాలు, కన్నీళ్లు, అవమానాలు, ఛీత్కారాలు... సినిమా కథకు ఏమాత్రం తీసిపోదు ఆమె జీవితం. అన్నిటినీ భరించి... ఉద్యమ బాటలో నడిచి... యువతరానికి స్ఫూర్తిమంత్రమయ్యారు. 'తెలంగాణ బీసీ కమిషన్'లో మొట్టమొదటి మహిళా సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తన పోరాట నేపథ్యాన్ని బాలలక్ష్మి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

"తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించిన క్షణం నా హృదయం ఆనందంతో ఉప్పొంగింది. ఏ తెలంగాణ కోసమైతే ప్రాణాలకు తెగించి పోరాడానో, ఆ తెలంగాణ రాష్ట్ర చిహ్నం చెంతన ఉన్నత హోదాలో కొలువు దీరడం ఎంతో ఉద్వేగానికి గురి చేసింది. ఆ మధుర క్షణంలో నా గతం కళ్లముందు కదలాడింది. ఉమ్మడి వరంగల్ జిల్లా 'మర్రి ముచ్చాల' అనే మారుమూల పల్లెటూరులో ఓ నిరుపేద కల్లుగీత కార్మికుడి కూతురినైన నేను... ఇవాళ ఇక్కడి వరకు రాగలిగానంటే అదంతా తెలంగాణ పోరాట ఫలితమే.

మా అమ్మానాన్న ఐలయ్యగౌడ్, సువర్ణ. ఐదుగురు కూతుళ్లలో పెద్దమ్మాయిని. అప్పుడు నాకు ఆరేళ్ల ఉంటాయి. ఒకరోజు తెల్లవారుజామున పోలీసులు మా ఇంటికొచ్చి, తాటి చెట్లు ఎక్కడం, కరెంటు పని తప్ప మరో లోకం తెలియని మా నాన్నను 'నక్సలైట్ల ఇన్ఫార్మర్' అంటూ చిత్రహింసలు పెట్టారు. తనకేమీ తెలియదని నాన్న మొత్తుకున్నా వినకుండా అరెస్టు చేశారు. ఐలయ్య పేరుగల మరొకరి కోసం గాలిస్తూ, అదే పేరుగల మా నాన్నను పొరపాటున తీసుకెళ్లామని తెలుసుకొని, తర్వాత విడుదల చేశారు. ఖాకీ డ్రెస్‌కు అంత పవర్ ఉంటుందని చూసి, నిర్ఘాంతపోయాను. పెద్దయ్యాక నేనూ పోలీసు అవ్వాలని బలంగా నిశ్చయించుకున్నా. అయితే మనం ఒకటి తలిస్తే, విధి మరొకటి తలుస్తుంది అన్నట్టు తొమ్మిదో తరగతిలో ఉండగానే నాకు పెళ్లి చేశారు. అది నా జీవితంలో పెద్ద కుదుపు.

అక్కడే తొలి అడుగు...

పెళ్లి అయ్యి నెలలు గడుస్తున్నా... అత్తింటివాళ్లు నన్ను తీసుకెళ్లలేదు. 'బాధపడుతూ కూర్చోవద్దు. మళ్లీ చదువు కొనసాగించ'మని నాయనమ్మ చెప్పింది. మా ఊరి హైస్కూల్లో చేరదామని వెళితే... 'విద్యా సంవత్సరం మధ్యలో చేరి, మళ్లీ ఫెయిల్ అయితే స్కూలుకు చెడ్డ పేరు' అని హెడ్‌మాస్టర్ కుదరదన్నారు. 'ఈ అమ్మాయి మంచి మార్కులు తెచ్చుకుంటుంది చూడండి' అని సుధాకర్ మాస్టారు నచ్చజెప్పడంతో నన్ను తరగతి గదిలోకి వెళ్లనిచ్చారు. ఆయన అన్నట్టుగానే పదో తరగతిలో ఫస్ట్‌క్లాసులో ఉత్తీర్ణత సాధించాను. చేర్యాలలో ఇంటర్ పూర్తయ్యాక, సిద్దిపేటలో డిగ్రీలో చేరాను. అక్కడ నాకు సమాజాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన సామాజిక అంశాలు పరిచయమయ్యాయి. మా తెలుగు అధ్యాపకుడు నందిని సిధారెడ్డి సారు కవిత్వం చదవడం ద్వారా తెలంగాణ అస్తిత్వ సోయి మాలో కలిగింది. గద్దరన్న పాటలు, ప్రొఫెసర్ జయశంకర్ సారు రాతలు, కాళోజీ కవితలు నాకు చైతన్య ప్రబోధాలయ్యాయి. వాటన్నింటి ప్రభావంతో ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష నాలో బలంగా నాటుకుంది.

నా లక్ష్యం ముఖ్యం కాదనుకున్నా...

నా జీవితాన్ని మలుపు తిప్పింది ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఎకనామిక్స్ పోస్టు గ్రాడ్యుయేషన్‌కు ఆర్ట్స్ కళాశాలలో అడుగుపెట్టాను. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి సన్నద్ధమయ్యాను. అయితే ప్రిలిమ్స్‌లో విజయం సాధించినా, పరుగు పోటీలో కొద్ది తేడాతో అవకాశం చేజారింది. పీజీ పూర్తయ్యాక, ఉస్మానియా లా కాలేజీలో ఎల్ఎల్‌బీలో చేరాను. అది 2009... నవంబర్ 30. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మలుపు తీసుకొంటున్న సందర్భం... క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో మొదటి సంవత్సరం లా పరీక్షలు వాయిదా పడ్డాయి. గ్రూప్స్ ద్వారా డీఎస్పీ కావచ్చన్న ఉద్దేశంతో ఓయూ హాస్టల్‌లోనే ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఆ సమయంలో నా పీజీ క్లాస్‌మేట్ శ్రీను ఫోన్ చేసి, 'ఆర్ట్స్ కాలేజీ దగ్గర విద్యార్థుల తలకాయలు పగులుతుంటే, మీరు హాస్టల్‌లో కూర్చొని చదువుకుంటున్నారా' అన్నాడు. అసలు ఏమైందా అని టీవీ పెడితే కానీ మాకు తెలియలేదు అంత పెద్దఎత్తున నిరసన జ్వాలలు ఎగసిపడుతున్నాయని. ఇక ఆలోచించలేదు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థినులను వెంటబెట్టుకుని ర్యాలీకి వెళ్లాను. ఆ రోజు నుంచి వెనక్కి తిరిగి చూడలేదు. పోలీసు అవ్వాలన్న నా లక్ష్యంకన్నా తెలంగాణ సాధనే అత్యంత ముఖ్యం అనిపించింది.

పెళ్లి పెద్దగా బాపూజీ...

నన్ను తెలంగాణ మలిదశ పోరాటంవైపు నడిపించిన నా క్లాస్‌మేట్ కందకట్ల శ్రీనివాస్‌తో 2011లో నా వివాహమైంది. ఆయనది జనగాం దగ్గర నర్మేట గ్రామం. చేనేత కుటుంబ నేపథ్యం. నా మీద వాత్సల్యం కొద్దీ మా పెళ్లి పెద్దగా వ్యవహరించిన కొండా లక్ష్మణ్ బాపూజీ "నేత- గీత బంధం ఈనాటిది కాదు" అని మమ్మల్ని దీవించారు. మాకు ఒక అమ్మాయి. చే గువేరా మీద అభిమానంతో పాపకు 'చేశ్రీ' అని పేరు పెట్టాం

అలా కించపరచడం తగదు...



తెలంగాణ మలిదశ పోరు సమయంలో మద్దతు ప్రకటించడానికి ఓ రోజు మా దీక్షా శిబిరానికి వచ్చిన ఒక నాయకుడు ప్రసంగిస్తూ, 'మనమేమీ చేతులకు గాజులు తొడుక్కోలేదు' అని ప్రస్తావించాడు. ఆయన మాటలకు నేను అడ్డుపడి, "అన్నా! ఆడవాళ్ళను కించపరిచేలా మాట్లాడద్దు" అని హెచ్చరించాను. ఆ నాయకుడు సభాముఖంగానే తన తప్పు ఒప్పుకొని క్షమాపణలు తెలిపాడు. ఈ రోజుకూ చాలామంది రాజకీయ నాయకులు 'చీర, గాజులు' అంటూ స్త్రీలను కించపరిచేలా మాట్లాడుతున్నారు. అలాంటి వాటిని ఒక మహిళగా ఉపేక్షించను.

మొదటి అమ్మాయిని...

మలి దశ తెలంగాణ పోరాటంలో భాగంగా ఓయూలో సాగిన రిలే నిరాహార దీక్షలో కూర్చున్న మొట్టమొదటి అమ్మాయిగా నన్ను గూడ అంజయ్య లాంటి ప్రముఖ కవి గుర్తించి, పూల మాలతో సత్కరించారు. నా జీవితంలో మరిచిపోలేని మధురానుభూతి అది. ఓయూ విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ అధికార ప్రతినిధిగా... విద్యార్థి మహాగర్జన, మహాపాదయాత్ర, ఛలో అసెంబ్లీ, మిలియన్ మార్చ్, పొలికేక ఇలా... తెలంగాణ కోసం సాగిన ప్రతి కార్యక్రమంలో ముందున్నాను. హైకోర్టులో తెలంగాణ న్యాయవాదుల దీక్షకు మద్దతుగా 30మంది విద్యార్థులను వెంట తీసుకెళ్లిన నన్ను ఒక లేడీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దారుణంగా కొట్టింది. నా కుడి చెయ్యి వెనక్కి విరిచిమరీ పిడిగుద్దులు గుద్దింది. ఇప్పటికీ ఆ చెయ్యి వెనక్కి వంచలేను. మరొక సందర్భంలో పోలీసులు ఉరికించి కొట్టడంతో స్పృహతప్పి పడిపోయాను. రబ్బరు బుల్లెట్లు, పెల్లెట్లు... ఒక్కటి కాదు, ఎన్నో దెబ్బలు తిన్నాను. అయినా, భయపడలేదు. ఒకరోజు మా నాన్న ఫోన్ చేసి 'అమ్మా... నీకేమైనా అయితే భరించలేం. ఉద్యమాలు మనకు వద్దు' అన్నాడు. ఆ వెంటనే అమ్మ కల్పించుకొని, 'అది పోతే, మనకు ఇంకా నలుగురున్నారు. అమ్మాయిని ఆపకు' అన్న మాటలు... ఇప్పటికీ నా చెవుల్లో మార్మోగుతున్నాయి. ఒకటా రెండా... 500కు పైగా సభల్లో తెలంగాణ గళాన్ని వినిపించాను. నా మీద అటెంప్ట్ టు మర్డర్‌తో పాటు 30 కేసులు బనాయించారు. ఆ సమయంలో నా నలుగురు చెల్లెళ్ల ఆర్థిక సాయం అందించారు. మరెంతో మంది అండగా నిలిచారు. తెలంగాణ మలిదశ పోరాట చరిత్రలో ఆర్ట్స్ కాలేజీది ప్రముఖ అధ్యాయమైతే, అందులో నేనూ ఒక పేజీ అయినందుకు గర్వంగా ఉంది.

కారు... కరెన్సీ లేకున్నా...

అదే ఓయూ నుంచి ఎల్ఎల్ఎమ్ పట్టా పొందాను. ప్రస్తుతం అక్కడే 'రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం' అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్నాను. 2016లో నన్ను రేవంత్ అన్న కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ కోఆర్డినేటర్‌గా, తుంగతుర్తి నియోజకవర్గం పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా... ఇలా నాకు అప్పగించిన ప్రతి బాధ్యతనూ శక్తివంచన లేకుండా నిర్వర్తించాను. నా నిజాయితీకి దక్కిన గుర్తింపు, గౌరవమే బీసీ కమిషన్ సభ్యురాలి పదవి. అన్ని పార్టీల్లో నన్ను అభిమానించేవాళ్ళు ఉన్నట్టే, అవమానించేవాళ్ళూ ఉంటారు. "సొంతిల్లు, కారు లేని ఆమె ఎమ్మెల్యే ఎలా అవుతుంది. ఆటోల్లో బస్సుల్లో తిరిగే తనకు ఈ రాజకీయాలు అవసరమా' అని నా ముందే హేళన చేసినవారున్నారు. 'మగరాయుడు లెక్క కుర్తా పైజమా వేసుకుంటుంద'ని నా వస్త్రధారణను వెక్కిరించిన వారున్నారు. అవేవీ పట్టించుకోలేదు. నా అంతిమలక్ష్యం చట్టసభల్లో అడుగుపెట్టడమే. కారు, కరెన్సీ, ఖద్దరు లేకున్నా బహుజన ఆడబిడ్డలు రాజకీయాల్లో రాణించగలరన్న నమ్మకాన్ని కలిగించడానికి నా వంతు ప్రయత్నిస్తాను."

• సాంత్వన్

ఫొటోలు: రాజ్‌కుమార్

కిచెన్‌లో వస్తువుల అమరిక ఇలా...

కిచెన్‌లో స్టోరేజ్ సమస్య చాలామందికి ఎదురయ్యేదే. ఏది ఎక్కడ పెట్టాలో తెలియక ఎక్కడో ఓ చోట పెట్టేస్తారు. మళ్లీ దాని కోసం కిచెన్ మొత్తం వెతుకుతారు. అయితే కాస్త ఓపికగా కిచెన్‌ను సర్దుకుంటే ఇలాంటి ఇబ్బందులు దరిచేరకుండా ఉంటాయి. కిచెన్‌లో వస్తువుల అమరికలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

- కిచెన్‌లో స్టోరేజ్ సమస్య తీరాలంటే ముందుగా పనికిరాని వస్తువులను తీసేయాలి. ఇందుకోసం క్యాబినెట్స్‌లో నుంచి వస్తువులన్నీ తీసి బయటపెట్టాలి. వాటిని మూడు రకాలుగా విభజించాలి. ఒకటి ట్రాష్ బిన్‌లో వేసేవి. రెండో రకం డొనేట్ చేసేవి. మూడో రకం అవసరమైనవి. ఈ మూడో కేటగిరీకి చెందిన వస్తువులను మాత్రమే క్యాబినెట్‌లో సర్దుకోవాలి. ఇలా చేయడం వల్ల కిచెన్‌లో సగం పనికిరాని వస్తువులు బయటకు వెళ్లి స్థలం కలిసొస్తుంది.





- క్యాబినెట్స్, షెల్ఫ్‌లు క్లీన్ చేశాక కిచెన్ వస్తువులను కేటగిరీలుగా విభజించుకోవాలి. అంటే కుక్‌వేర్, డిన్నర్‌వేర్, తినే ఆహారపదార్థాలు.. ఇలా కేటగిరీలుగా విభజించుకోవాలి. వంట పాత్రలు, ప్యాన్‌లు, కటింగ్‌బోర్డ్, ప్లేట్లు, గ్లాసులు... ఇవన్నీ కుక్‌వేర్‌లోకి వస్తాయి. వీటిని ఒక క్యాబినెట్‌లో సర్దుకోవాలి. డ్రింక్‌లు, బేకింగ్‌కు ఉపయోగించే పదార్థాలు, స్నాక్స్ వంటివన్నీ మరో కేటగిరీగా విభజించి సర్దుకోవాలి. మసాలా దినుసులు, పప్పులు, రకరకాల పిండిపొడులను మరోచోట ఈజీగా దొరికేలా అమర్చుకోవాలి.
- రోజులో ఎక్కువ సార్లు ఉపయోగించే వస్తువులను సులభంగా తీసుకునేలా అమర్చుకోవాలి. ఉదాహరణకి రోజులో నాలుగైదు సార్లు కాఫీ తాగే అలవాటు ఉంటే కాఫీ కప్పులు, కాఫీ పొడిని సులభంగా తీసుకునేలా పెట్టుకోవాలి.



- ఏదైనా ఫంక్షన్స్ జరిగినప్పుడు మాత్రమే ఉపయోగించే వస్తువులను పై క్యాబినెట్‌లలో అమర్చుకోవాలి. ఆహారాన్ని నిలువ ఉంచే పాత్రలను కౌంటర్ పైభాగంలో పెట్టుకోవాలి.
- కింది క్యాబినెట్‌లలో దోశ, ఫ్రై ప్యాన్‌లు, బేకింగ్ షీట్లు, కటింగ్ బోర్డ్‌లు, మిక్సింగ్ బౌల్స్ వంటివి అమర్చుకుంటే అనువుగా ఉంటుంది.
- పాత్రలు శుభ్రం చేసేందుకు ఉపయోగించే సబ్బులు, లిక్విడ్‌లను సింక్ కింద అమర్చుకుంటే స్థలం కలిసి వస్తుంది. స్పాంజ్‌లు, డిష్ వాషర్ పాడ్‌లను కూడా ఇక్కడే పెట్టుకోవాలి.
- క్యాబినెట్ డోర్లపై లేబుల్స్ అంటించుకోవడం ద్వారా ఏ క్యాబినెట్‌లో ఏమున్నాయో సులువుగా గుర్తించడానికి వీలవుతుంది. పప్పులు, మసాలా దినుసులు భద్రపరచుకున్న సీసాలపై కూడా లేబుల్స్ అంటించుకోవడం ద్వారా సమయం వృథా కాకుండా ఈజీగా తీసుకోవచ్చు.

బ్యూటీ

చర్మం కోమలంగా!

30 ఏళ్ల నుంచి చర్మం బిగుతును కోల్పోవడం మొదలుపెడుతుంది. కొత్త చర్మ సమస్యలు కూడా ఆ వయసు నుంచే మొదలవుతాయి. వీటిని దూరం చేసుకోవాలంటే కొన్ని చర్మ చికిత్సలు, జాగ్రత్తలు, చిట్కాలు పాటించాలి.

- **క్లీనింగ్:** మాయిశ్చరైజర్ వల్ల చర్మం తేమగా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే అంతకంటే ముందు చర్మం మీద పేరుకునే మృతకణాలను తొలగించుకోవాలి. ఇందుకోసం రోజు విడిచి రోజు మెత్తని బియ్యం పిండి, నిమ్మరసం, తేనె, పెరుగు మిశ్రమంతో ముఖ చర్మాన్ని కొద్దిసేపు మర్దన చేసి కడిగేసుకోవాలి. ఆ తర్వాత మెత్తని తువ్వాలుతో తుడుచుకుని, మాయిశ్చరైజర్ పూసుకోవాలి.
- **తేమగా:** చర్మానికి తేమ అవసరం. ఇది వ్యక్తికీ, వ్యక్తికీ, కాలానికీ మారుతూ ఉంటుంది. పొడిచర్మం కలిగిన వాళ్లు నీటి ఆధారిత మాయిశ్చరైజర్, జిడ్డుచర్మం కలిగినవాళ్లు ఆయిల్ బేస్డ్ మాయిశ్చరైజర్ వాడుకోవాలి. వీలైతే మీగడ, తేనె, నిమ్మరసం మిశ్రమం ముఖానికి పూసుకుని ఆరిన తర్వాత కడిగేసుకోవాలి. ఇలా ప్రతి మూడు రోజులకు ఒకసారి చేస్తూ ఉండాలి.
- **ఎక్స్‌ఫోలియేట్:** చర్మం మెరుపులీనాలంటే మృత కణాలు తొలగించాలి. ఇందుకు తగిన సమయం రాత్రివేళ. అయితే ముఖం మీద మొటిమలు ఉన్నా, చర్మం కంది ఉన్నా ఎక్స్‌ఫోలియేట్ చేయకూడదు. దీనికి బదులుగా సెనగపిండి, పాలు, గులాబీ నీళ్ల కలిపిన మిశ్రమం ముఖం మీద పూసుకుని, ఆరిన తర్వాత కడిగేసుకోవాలి.



- **సన్‌స్క్రీన్:** సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాలు చర్మానికి హాని చేస్తాయి. వీటి నుంచి కాపాడుకోవడానికి సన్‌స్క్రీన్ వాడడం తప్పనిసరి. అయితే ఎండ తీవ్రత ఉన్నా, లేకపోయినా, సూర్యకిరణాలు సోకడం వల్ల చర్మం రంగుమారడం ఆగదు. కాబట్టి సన్‌స్క్రీన్ లోషన్ వాడడం తప్పనిసరి.
- **నిద్రకు ముందు:** నిద్రకు ముందు వేసుకున్న మేకప్ పూర్తిగా తొలగించాలి. లేదంటే ఉదయానికి కళ్లు ఎర్రగా మారతాయి, ముఖం మీద మొటిమలూ తలెత్తుతాయి. చర్మానికి గాలి సోకి, పునరుజ్జీవం పొందేలా రాత్రి నిద్రకు ముందు క్లీన్సర్ లేదా మేకప్ రిమూవర్‌తో మేకప్ పూర్తిగా తొలగించుకోవాలి. స్వచ్ఛమైన కొబ్బరినూనెతో మేకప్ తొలగించడం అన్ని విధాలా ఉత్తమం.
- **వ్యాయామం:** చర్మం యవ్వనంగా ఉండాలంటే క్రమంతప్పక వ్యాయామం చేయాలి. రక్తప్రసరణ మెరుగైతే చర్మం మెరుపులీనుతూ ఉంటుంది. వ్యాయామంతో వెలువడే స్వేదంతో చర్మరంధ్రాలు శుభ్రపడతాయి. వ్యాయామంతో మనసును హుషారుగా ఉండే హార్మోన్లు కూడా సరిపడా విడుదల అవుతాయి. కాబట్టి రోజులో కనీసం 30 నుంచి 40 నిమిషాలపాటు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి.
- **కాలుష్యం:** వాతావరణ కాలుష్యం చర్మ సమస్యలకు మూలం. కాబట్టి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రతిసారీ ఎండకు, దుమ్ము, ధూళి నుంచి చర్మానికి రక్షణ కల్పించుకోవాలి. ఇందుకోసం ముఖానికి మాస్కులు ధరించవచ్చు. స్కార్ఫ్‌తో కప్పి ఉంచుకోవచ్చు. వీలైనంత వరకూ గొడుగు వాడాలి. వాహనాల మీద ప్రయాణం చేసేవారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. స్కార్ఫ్‌తోపాటు, చలువ కళ్లద్దాలు తప్పనిసరిగా ధరించాలి.

కౌన్సెలింగ్

వరుస గర్భస్రావాలను ఆపేదెలా?

డాక్టర్! నా వయసు 29. పెళ్లై ఏడేళ్లయింది. ఈ ఏడేళ్లలో పలు సార్లు అబార్షన్లు అయ్యాయి. మొదటిసారి గర్భం దాల్చినప్పుడు, మూడు నెలలకే పిండంలో ఎదుగుదల లేదనే కారణంతో గర్భస్రావం చేయించుకోవలసి వచ్చింది. రెండోసారి కూడా ఇలాగే జరిగింది. ముందు ముందు కూడా ఇదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలున్నాయని వైద్యులు అంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించుకుని, పండంటి బిడ్డను కనే మార్గం లేదా?

- ఓ సోదరి, హైదరాబాద్.

రెండు, అంతకంటే ఎక్కువ సార్లు గర్భస్రావాలైతే, ఆ పరిస్థితిని రికరెంట్ ప్రెగ్నెన్సీ లాస్ అంటారు. ఇలాంటి వాళ్ల తప్పనిసరిగా కొన్ని పరీక్షలు చేయించుకోవాలి. మరీ ముఖ్యంగా జన్యుపరమైన కారణాలున్నాయేమో పరీక్షించుకోవలసి ఉంటుంది. అందుకోసం భార్యాభర్తలిద్దరి జెనెటిక్ అనాలసిస్ చేయించుకోవాలి. కుటుంబంలో వరుస గర్భస్రావాలు జరుగుతున్న సందర్భాలు ఉన్నప్పుడు కూడా జన్యుపరమైన సమస్యగానే పరిగణించాలి. అలాగే ప్రెగ్నెన్సీకి వ్యతిరేకంగా శరీరంలో యాంటీబాడీస్ పెరగడం వల్ల గర్భస్రావం జరుగుతుందేమో కూడా తెలుసుకోవాలి. అలాగే థైరాయిడ్, మధుమేహాలను కూడా పరీక్షించుకోవాలి. వీటితో పాటు రక్తం గడ్డకట్టే తత్వం ఎక్కువగా ఉన్నప్పుడు, బిడ్డకు రక్తసరఫరాలో అంతరాయం ఏర్పడి, గర్భస్రావం జరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఆ అంశాన్ని కూడా పరీక్షించుకోవాలి. ఈ పరీక్షలన్నీ చేయించుకుని, అసలు సమస్యను కనిపెట్టి, తగిన చికిత్సను ఎంచుకోగలిగితే, ఆరోగ్యకరమైన బిడ్డను ప్రసవించే వీలుంటుంది. కాబట్టి మీరు మొదట ఈ పరీక్షలన్నీ చేయించుకుని, మూల కారణాన్ని కనిపెట్టి, గర్భం దాల్చే ప్రయత్నం చేయడం ఉత్తమం.





డాక్టర్ మంజుల అనగాని
హెడ్‌ఓడి ఆఫ్ గైనకాలజీ,
కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్.



భావి పౌరుల్ని తీర్చిదిద్దే తరగతి గదిలో పాఠాల నుంచి... దేశ భవిష్యత్తుని మలచే చట్టసభల వరకూ సాగిన హరిణి అమరసూర్య ప్రయాణం... ఇప్పుడు శ్రీలంక ప్రధానిగా కొత్త మలుపు తీసుకుంది. హక్కుల కార్యకర్తగా, స్త్రీవాదిగా, సంస్కరణవాదిగా పేరుపొందిన హరిణి... ఢిల్లీ హిందూ కాలేజీ పూర్వ విద్యార్థి. కల్లోలాలతో సతమతమవుతున్న శ్రీలంకకు మూడో మహిళా ప్రధానిగా... తనదైన ముద్ర వెయ్యడానికి ఆమె సిద్ధమవుతున్నారు.

కల్లోల లంకలో కాంతిరేఖ

శ్రీలంక దక్షిణ ప్రాంతంలోని ఒక చిన్న గ్రామంలో, దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు హరిణి అమరసూర్య. ఆమె తండ్రి తేయాకు తోటలో ఉద్యోగి. ఆమెకు ఇద్దరు తోబుట్టువులు. వారిద్దరి తరువాత... చాలాకాలానికి హరిణి పుట్టడంతో కుటుంబంలో అందరూ ఆమెను ఎంతో ప్రేమగా చూసుకొనేవారు. సరదాగా సాగిపోతున్న ఆమె బాల్యంలో హఠాత్తుగా ఒక కుదుపు... 1970ల్లో శ్రీలంక సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. టీ ఎస్టేట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీనితో ఆమె తండ్రి ఉపాధి పోయింది. ఆ కుటుంబం కొలంబోకు వలస వెళ్ళాల్సి వచ్చింది. అక్కడ ఒక ప్రైవేట్ గర్ల్స్ స్కూల్‌లో ఆమె చేరారు. దాన్ని క్రిస్టియన్ నన్స్ నిర్వహించేవారు. తన జీవితం మీద వారి ప్రభావం చాలా ఎక్కువగా ఉందనీ, తనలో ఫెమినిస్ట్ భావాలకు అక్కడే బీజం పడిందనీ ఆమె చెబుతారు. "శ్రీలంక ఘర్షణలకు, ముఖ్యంగా 1983లో చోటుచేసుకున్న జాతిపరమైన దాడులకు సంబంధించిన జ్ఞాపకాలు నాలో ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. మా పొరుగున ఎన్నో తమిళ కుటుంబాలవారు ఉండేవారు. అప్పుడు నాకు పదమూడేళ్ళు వారిలో కొందరు హఠాత్తుగా మాయమైపోయేవారు. నా తవిళ మిత్రుల్లో చాలామంది తరగతులకు రాకపోవడం, టీచర్లలో ఎంతోమంది ఉద్యోగం మానెయ్యడం లాంటి సంఘటనలు నాలో గందరగోళాన్నీ, భయాన్నీ కలిగించేవి. మేము స్కూల్‌కు వెళ్ళడానికి ముందు మా నాన్న వీధిలోకి వచ్చి... రోడ్ల మీద పరిస్థితుల్ని గమనించేవారు. అంతా సజావుగా ఉందనుకుంటేనే మమ్మల్ని బడికి పంపించేవారు. అయితే మేము మెజారిటీ వర్గానికి చెందినవాళ్ళం కావడం, దక్షిణ ప్రాంతంలో నివసించడం అనేవి ఆ పరిస్థితుల ప్రభావం మా మీద లేకపోవడానికి కారణమని ఆ తరువాత గ్రహించాను. ఏది ఏమైనా మన చుట్టూ ఇటువంటివి జరుగుతున్నప్పుడు... ప్రపంచం పట్ల, సంస్కృతి పట్ల మన దృక్పథాన్ని అవి ప్రభావితం చేస్తాయి" అంటారు హరిణి. ఆ స్కూల్లో చదువుతున్నప్పుడే... స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కింద ఆమె ఏడాది పాటు అమెరికా వెళ్ళారు. "అది 1988-89 మధ్యకాలం. శ్రీలంకలో అది అత్యంత హింసాత్మకమైన కాలం. దేశం ఉత్తర ప్రాంతంలో తీవ్రమైన యుద్ధం, దక్షిణ ప్రాంతంలో తిరుగుబాట్లు తలెత్తాయి. నేను అమెరికా నుంచి తిరిగి వచ్చేసరికి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. స్కూళ్ళు, కాలేజీలు, యూనివర్సిటీలు మూతపడ్డాయి. దాంతో... ఇండియాకు వచ్చి, ఢిల్లీ యూనివర్సిటీలోని హిందూ కాలేజీలో అండర్‌గ్రాడ్యుయేషన్ కోర్సులో చేరాను. ఆ నాలుగేళ్ళు చాలా ఆహ్లాదంగా గడిచాయి" అని చెబుతారామె.

అది నా కళ్ళు తెరిపించింది...

ఆ తరువాత ఆస్ట్రేలియాలో అప్లయిడ్ ఆంత్రోపాలజీలో మాస్టర్స్ చేశారు హరిణి. అనంతరం పిహెచ్‌డి కోసం స్కాట్లాండ్ వెళ్ళారు. ఆ సమయంలోనే పౌరహక్కులు, ఫెమినిజం గురించి అధ్యయనం చేశారు. రచనలు మొదలుపెట్టారు. స్వదేశానికి వచ్చిన తరువాత... శ్రీలంక ఓపెన్ యూనివర్సిటీలో సోషియాలజీ లెక్చరర్‌గా చేరారు. మరి ఎంతో ఇష్టమైన బోధనా వృత్తి నుంచి ఎన్నికల రాజకీయాల్లోకి అడుగు పెట్టాలనే నిర్ణయం ఆమె ఎందుకు తీసుకున్నారు? "నా జీవితం మీద గొప్ప ప్రభావం చూపిన వాటిలో ఒకటి... స్థానిక ఎన్జీవో ఆధ్వర్యంలోని ఒక కమ్యూనిటీ మెంటల్ హెల్త్ సెంటర్‌లో పని చెయ్యడం. నిజానికి నేను చేసిన మొదటి ఉద్యోగం అదే. అక్కడ వేధింపులకు, వివక్షకు, నిర్బంధానికి గురైన మహిళల దుస్థితి నన్ను బాగా కదిలించింది. ఆ ఉద్యోగంలో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాను. అది ప్రపంచాన్ని నేను చూసే తీరును మార్చింది. మనం గమనించని ప్రదేశాల్లో ఏం జరుగుతోందనే సత్యాన్ని నా కళ్ళముందు నిలబెట్టింది. నా కళ్ళు తెరిపించింది. ఆసుపత్రుల వ్యవస్థ, కుటుంబాలు, ప్రభుత్వం దీనికి బాధ్యత వహించాలని మేం పోరాటం చేశాం. అలాగే యూనివర్సిటీలో ఉద్యోగానికి ఎంపికయినప్పుడు... ఇంకా జాబ్ ఆఫర్ లెటర్ తీసుకోకుండానే... ఉపాధ్యాయ సంఘంలో చేరాను. ఆ తరువాత... రాజ్ పక్స ప్రభుత్వం ప్రతిపక్షాల మీద ఉక్కుపాదం మోపినప్పుడు... అంతటా భయానకమైన వాతావరణం ఏర్పడింది. మేం మూడు నెలలపాటు సమ్మె చేశాం. శ్రీలంకలో హింస తారస్థాయిలో ఉన్న 1980-90ల మధ్య విద్యార్థి నాయకులుగా ఉన్నవారు ఈ సమ్మె కాలంలో సామాజిక, రాజకీయ కార్యకర్తలుగా మారారు. వాళ్ళు ఒక నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. నేను దానిలో భాగమయ్యాను. క్రమంగా... 'జనతా విముక్తి పెరమున' (జెవిపి) పార్టీతో సాన్నిహిత్యం ఏర్పడింది. విద్యారంగంలో మార్పుల పట్ల జెవిపికి ఉన్న అభిప్రాయాలు నాకు నచ్చాయి. పార్టీ విధాన రూపకల్పనలో కూడా పాల్గొన్నాను. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల హక్కుల గురించి నా గళాన్ని గట్టిగా వినిపించాను" అని వివరించారు హరిణి.

> మీరు ఎందుకు పెళ్ళి చేసుకోలేదు? స్త్రీ సహజమైన మాతృత్వాన్ని ఎందుకు వద్దనుకున్నారు? కుటుంబ వ్యవస్థ మీద మీ అభిప్రాయం ఏవిటి?"... ఇలాంటి ప్రశ్నలు ఎన్నో ఎదురయ్యాయి. అంతేకాదు నా రూపం మీద, జుట్టు మీద, దుస్తుల మీద కూడా ఎన్నో కామెంట్స్ వచ్చాయి.

నా రూపంమీద, జుట్టు మీద కామెంట్స్ చేశారు...

2019 శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో 'నేషనల్ పీపుల్స్ పవర్' కూటమిలో భాగమైన తమ పార్టీ అభ్యర్థి అనుర కుమార దిసనాయకే తరపున ప్రచారం చేసిన ఆమె... 2020లో పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. మరోవైపు 'ప్రోగ్రెసివ్ ఉమెన్ కలెక్టివ్' ప్రతినిధిగా... నాయకత్వ స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి కృషి చేస్తున్నారు. "మహిళల పట్ల అణచివేత ఎన్నో రూపాల్లో సాగుతోంది. అదే సమయంలో... రాజకీయాలు అవినీతిమయం అయ్యాయనీ, కలుషితమయ్యాయనీ, కాబట్టి గౌరవనీయులైన మహిళలకు ఇవి పనికిరావనీ శ్రీలంకలోని చాలామంది మహిళల్లో ఒక అభిప్రాయం ఉన్నట్టు నేను గమనించాను. అంతేకాదు... ప్రజాజీవితంలో ఉన్న మహిళల్లో ఏవైనా లోపాలు కనిపిస్తాయేమోనని రంధ్రాన్వేషణ చేసేవారు కూడా ఎక్కువయ్యారు. "మీరు ఎందుకు పెళ్ళి చేసుకోలేదు? స్త్రీ సహజమైన మాతృత్వాన్ని ఎందుకు వద్దనుకున్నారు? కుటుంబ వ్యవస్థ మీద మీ అభిప్రాయం ఏమిటి?"... ఇలాంటి ప్రశ్నలు ఎన్నో ఎదురయ్యాయి. అంతేకాదు నా రూపం మీద, జుట్టు మీద, దుస్తుల మీద కూడా ఎన్నో కామెంట్స్ వచ్చాయి. పార్లమెంట్ సభ్యురాలుగా చీర కాకుండా సల్వార్ ధరిస్తున్నందుకు కూడా నన్ను కొందరు విమర్శించారు" అని గుర్తు చేసుకున్నారు హరిణి. తాజాగా శ్రీలంక ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన ఆమె... విద్యారంగ సంస్కరణలు, బాలలకు, మహిళలకు రక్షణ, నిరుద్యోగ సమస్య పరిష్కారం, వివిధ వర్గాల హక్కుల పరిరక్షణ తన ధ్యేయాలని చెబుతున్నారు. "సిరిమావో బండారునాయకే, చంద్రికా కుమార తుంగ తరువాత... శ్రీలంక మూడో మహిళా ప్రధానిని కావడం గౌరవంగా భావిస్తున్నాను. కానీ అదే సమయంలో... మా పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం 5.33 శాతం మాత్రమే. ప్రపంచంలోనే అతి తక్కువ మహిళా ప్రాతినిధ్యాల్లో ఇదొకటి. ఈ పరిస్థితి మారడానికి, రాజకీయాల పట్ల మహిళలు ఆకర్షితులు కావడంతో పాటు... పార్టీలు వారికి మరిన్ని అవకాశాలు ఇచ్చే విధంగా మార్పు తేవడానికి కృషి చేస్తాను" అంటున్నారు హరిణి.






నా దృష్టిలో... వేడుక అంటే ఇదే

నటి శోభితా ధూళిపాళ, నాగచైతన్య ఇటీవలే నిశ్చితార్థం చేసుకున్న సంగతి విదితమే. ఎంతో సింపుల్‌గా జరిగిన ఈ ఎంగేజ్‌మెంట్ గురించి ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ వేడుకను గ్రాండ్‌గా చేసుకోవాలని ముందుగా ప్లాన్ చేయలేదు. ఇలా ఉండాలి.. అలా ఉండాలి అని కలలు కనలేదు. జస్ట్.. జీవితంలో అతి ముఖ్యమైన ఆ మధుర క్షణాలని ఆస్వాదించాలని అనుకున్నాను. తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా ఇలాంటి వేడుకలు జరగాలని కోరుకునేదాన్ని. ఇది ఇలాగే జరిగింది. కాబట్టి ఈ వేడుక నిరాడంబరంగా జరిగిందని అనుకోవట్లేదు. నా వరకూ ఇదో పర్ఫెక్ట్ పద్ధతిలో సాగిన వేడుక" అని చెప్పారు.

ఒక్క రాత్రిలో జరిగే కథ



ఫీల్‌గుడ్ ప్రేమకథా చిత్రం '96'తో అందరినీ విశేషంగా ఆకట్టుకున్న దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సత్యం సుందరం'. కార్తి, అరవింద స్వామి ప్రధాన పాత్రలు పోషించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్ మీడియాతో ముచ్చటించారు. "ఇదో బ్యూటిఫుల్ ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాకు కార్తి, అరవింద్ స్వామి బిగ్గెస్ట్ స్ట్రెంగ్త్. వారిద్దరూ అంగీకరించకుంటే.. ఈ ప్రాజెక్ట్‌ను మొదలెట్టేవాణ్నే కాదు. ఇది ఒక్క రాత్రిలో జరిగే కథ. సక్సెస్‌ను, ఫెయిల్యూర్‌ని నేను పట్టించుకోను. సినిమా చేసేటప్పుడు వచ్చే సంతృప్తి మాత్రమే ముఖ్యం. ఈ సినిమా విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను. ప్రొడ్యూసర్స్ సూర్య, జ్యోతిక మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. టెక్నికల్‌గా సినిమా ఉన్నతంగా ఉంటుంది. గోవింద్ వసంత ఇచ్చిన సంగీతం అద్భుతంగా ఉంటుంది. తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరించే సినిమా ఇది" అని చెప్పారు.




నేరస్థుల పాలిట యముడు

'జై భీమ్' ఫేమ్ టీ.జే. జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. 33 ఏళ్ల తర్వాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలసి నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. తాజాగా, రజనీ పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ఓ ప్రివ్యూను విడుదల చేశారు. ఇందులో నేరస్థుల పాలిట యముడిగా.. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా.. ఆయన పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో హింటిచ్చారు. అలాగే, సినిమాలోని ముఖ్య పాత్రధారుల్ని ఈ వీడియోలో పరిచయం చేశారు. దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది.

ఆ వీధికి బాలు పేరు


• సీఎం స్టాలిన్ ఉత్తర్వులు



గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీబీ) వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వాంతన చేకూర్చే కబురందించారు. బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కోరిక మేరకు స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్ మొదటివీధి పేరును మార్చేందుకు స్టాలిన్ అంగీకరించారు. ఆ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం యేళ్ల తరబడి నివసించిన కామదార్‌నగర్ ఫస్ట్‌స్ట్రీట్ పేరును 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్డు'గా మార్చుతున్నట్లు ప్రకటించారు. ఎస్పీబీ భౌతికంగా లేకపోయినా వివిధ భాషల్లో ఆయన పాడిన పాటల ద్వారా అభిమానుల మనస్సుల్లో చిరంజీవిగా సుస్థిరంగా నిలిచి ఉంటారని స్టాలిన్ ఈ సందర్భంగా కొనియాడారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

కేరళలో ముగించారు



శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ('శర్వా 37'- వర్కింగ్ టైటిల్) కీలక షెడ్యూల్ పూర్తయింది. పది రోజుల పాటు కేరళలో జరిగిన షెడ్యూల్‌లో పాట, ఫైట్ సీక్వెన్స్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జంటగా సాక్షి వైద్య, సంయుక్త నటిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ వీఎస్

నటి ఊర్మిళ విడాకులు



'రంగీలా, భారతీయుడు' లాంటి హిట్ చిత్రాలతో ప్రేక్షక హృదయాలను కొల్లగొట్టారు నటి ఊర్మిళా మతోండ్కర్. కశ్మీర్‌కు చెందిన వ్యాపారవేత్త మోసిన్ అక్తర్ మీర్‌ను ఆమె 2016లో పెళ్లాడారు. అయితే ఇప్పుడు వీరి వైవాహిక జీవితం ఒడిదుడుకులు ఎదుర్కొంటోందనీ, త్వరలోనే ఇద్దరూ విడిపోబోతున్నారని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఊర్మిళ నాలుగు నెలల క్రితమే విడాకుల కోసం ముంబై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు జాతీయ మీడియా పేర్కొంది.

దేవర టికెట్ ధరల పెంపు 10 రోజులే



జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా టికెట్ల ధరల పెంపును 10రోజులకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు ఉత్తర్వులు ఇస్తున్నామని పేర్కొంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ నెల్లూరుకు చెందిన పి. శివకుమార్ రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ నెల 27న విడుదల కానున్న దేవర సినిమా ప్రత్యేక ప్రదర్శనలతో పాటు టికెట్ ధరలను పెంపునకు అనుమతిస్తూ నిబంధనలకు లోబడి టికెట్ ధరలు నిర్ణయించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది శివప్రసాద్ రెడ్డి వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 13 ప్రకారం సినిమా విడుదలైన నాటి నుంచి పదిరోజుల పాటు మాత్రమే టికెట్ ధరల పెంపునకు వెసులుబాటు ఉందని న్యాయస్థానం గుర్తు చేసింది. ప్రభుత్వం జారీ చేసిన మెమోపై స్పష్టతనిస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి, చిత్ర నిర్మాతకు నోటీసులు జారీ చేసింది. విచారణను వారంరోజులకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి వాదనలు వినిపిస్తూ.. టికెట్ ధరల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోలో పెంపు ఎన్ని రోజులో ప్రస్తావించలేదన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

ఇన్ ప్రోగ్రెస్



విభిన్నంగా 'క'

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌తో సుజిత్, సందీప్ దర్శకులుగా పరిచయమవుతున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తయిందనీ, ఈ చిత్ర నిర్మాణం తమకు మధురమైన అనుభూతులు మిగిల్చిందనీ, జీవితాంతం గుర్తుండిపోయే అనుభవాలను ఇచ్చిందనీ వారు పేర్కొన్నారు. సినిమా సాధించే హిట్ కోసం ఎదురుచూస్తున్నామని సుజిత్, సందీప్ చెప్పారు. టైటిల్‌కు తగ్గట్లుగానే సినిమా కూడా విభిన్నంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ విడుదల చేస్తున్నారు.

ఆ శత్రువుని వెంటేసుకుని పుడతాడు



'మనిషి పుట్టడంతోనే జీవితం అనే శత్రువుని వెంటేసుకుని మరీ పుడతాడు. దాని మీద గెలిచినోడే గొప్పవాడవుతాడు. ఓడినోడు మధ్యలోనే..' అనే డైలాగ్‌తో మొదలయ్యే 'కలి' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను దర్శకుడు ప్రశాంత్ వర్మ విడుదల చేశారు. ప్రిన్స్, నరేశ్ అగస్త్య ఇందులో హీరోలుగా నటించారు. శివశేషు దర్శకత్వంలో లీలా గౌతమ్ వర్మ నిర్మించారు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇది సైకలాజికల్ థ్రిల్లర్ అనీ, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు చెప్పారు. కష్టాలతో ఆత్మహత్య చేసుకోవాలనుకునే శివరామ్ (ప్రిన్స్) ఇంటికి అపరిచిత వ్యక్తి (నరేశ్ అగస్త్య) వస్తాడు. అతను వచ్చాక శివరామ్ జీవితంలో ఎదురైన అనూహ్య సంఘటనలు ఏవిటన్నవి ఆసక్తికరంగా ఉంటాయని దర్శకుడు శివశేషు చెప్పారు.

వారణాసి నేపథ్యంలో



శివ తత్వాన్ని వివరిస్తూ వారణాసి బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకుంటున్న 'లైఫ్' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పవన్ కేతరాజు దర్శకుడు. కిశోర్ రాఠి, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మాతలు. 'ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. హీరో తండ్రి పాత్రలో ఎస్పీ చరణ్ నటించారు. నవాబ్ షా కీలక పాత్ర పోషించారు. శ్యామ్ కె నాయుడు ఫొటోగ్రఫీ, మణిశర్మ సంగీతం ఆకట్టుకుంటాయి' అని దర్శకుడు చెప్పారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

అమరావతికి ఆహ్వానం



శివ కంఠమనేని, ధన్యా బాలకృష్ణ ప్రధాన పాత్రధారలుగా తెరకెక్కుతోన్న చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. చిత్రీకరణ మొదలైంది. లైట్ హౌస్ సినీ మేజిక్ పతాకంపై కేఎస్ శంకర్ నిర్మిస్తున్నారు. జి. వెంకట కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్తేర్, హరీష్, భద్రం కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: విష్ణు భరద్వాజ్, సినిమాటోగ్రఫీ: ప్రభాకర్ రెడ్డి

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా రూపుదిద్దుకున్న 'జ్యూయెల్ థీఫ్' చిత్రం సెన్సార్ పూర్తయింది. ప్రేమ, అజయ్, పృథ్వీ, శివారెడ్డి తదితరులు నటించిన ఈ సినిమాను పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'ఇదో సస్పెన్స్ థ్రిల్లర్. యువతకు బాగా నచ్చుతుంది. శ్రీలేఖ అందించిన పాటలు ఆకట్టుకుంటాయి. యాక్షన్ పార్ట్ హైలైట్ అవుతుంది' అని చెప్పారు.

దిక్సూచి
DIKSUCHI

ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు



పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్- షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. • వెబ్‌సైట్: ftii.ac.in

బేసిక్ కోర్స్ ఇన్ డిజిటల్ ఫిల్మ్ మేకింగ్

కోర్సు వ్యవధి అయిదు రోజులు. మొత్తం 45 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. నవంబరు 4 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు. కనీసం ఆరోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 11 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ కోర్సులో ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ లాంగ్వేజ్ అండ్ స్టోరీ టెల్లింగ్ టెక్నిక్స్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ఆర్కైవల్ టెక్నిక్స్ తదితర అంశాలు బోధిస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.7000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14

ఫౌండేషన్ కోర్స్ ఇన్ స్క్రీన్‌ప్లే రైటింగ్

కోర్సు వ్యవధి పదకొండు రోజులు. మొత్తం 24 సీట్లు ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో షార్ట్ ఫిల్మ్ స్ట్రక్చర్, రైటింగ్ ఫర్ స్క్రీన్‌ప్లే, టైమింగ్ ఇన్ సినిమా, అరిస్టాటిల్ పొయిటిక్స్ ఫర్ స్క్రీన్ రైటర్స్, సీన్ కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్స్, మిస్టరీ/సస్పెన్స్/సర్‌ప్రైజ్/ఐరనీ టూల్స్, డెవలపింగ్ షార్ట్ ఫిల్మ్ స్టోరీ అండ్ స్క్రీన్‌ప్లే తదితర అంశాలు బోధిస్తారు. నవంబరు 11 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.17,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 21

బేసిక్ కోర్స్ ఆన్ స్మార్ట్‌ఫోన్ డాక్యుమెంటరీ

కోర్సు వ్యవధి ఎనిమిది రోజులు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో స్మార్ట్‌ఫోన్‌తో ఫిల్మ్ మేకింగ్, ఎడిటింగ్ విధానాలు; క్వాలిటీ వీడియోలు తీయడం; ఫోన్‌ను వీడియో కెమెరాగా వినియోగించడం; సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవిధంగా డాక్యుమెంటరీలు, షార్ట్ వీడియోలు తీయడం; డాక్యుమెంట్ మెమొరీస్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 20 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

- **కోర్సు ఫీజు:** రూ.9,800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30

బేసిక్ యాక్టింగ్ వర్క్‌షాప్

ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. దీని వ్యవధి పదకొండు రోజులు. రోజుకు రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు మరో బ్యాచ్ నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి. కనీసం మూడో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎనిమిది నుంచి పన్నెండేళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉదయం బ్యాచ్‌కు, పదమూడు నుంచి పదిహేడేళ్ల మధ్య వయసున్నవారు సాయంత్రం బ్యాచ్‌కు హాజరు కావాలి. ఈ కోర్సులో థియేటర్ గేమ్స్, ఇంప్రూవైజేషన్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైటింగ్, ఇమాజినేషన్, నవరసాలు, సీన్‌వర్క్, వాయిస్ అండ్ బ్రీతింగ్, అవేర్‌నెస్, మెమొరీ, కెమెరా వర్క్, ఆడిషన్ టెక్నిక్స్, ఆడిషన్ ప్రాక్టీస్, మ్యూజిక్ బేస్డ్ ఇమాజినేషన్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 29 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 7

సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ)- 'రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్(పీహెచ్‌డీ)-1-2025'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్, మోడర్న్ బయాలజీ సంబంధిత అంశాలపై రీసెర్చ్ వర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అభ్యర్థులు కోర్సు పూర్తయ్యే వరకు క్యాంపస్‌లోనే ఉండాలి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు రౌండ్లు ఉంటాయి. నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వీడియో కాన్ఫరెన్స్ ఇంటర్వ్యూ, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. కోర్సులో చేరినవారికి రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తారు.

రీసెర్చ్ విభాగాలు: సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ, డిసీజ్ బయాలజీ, జెనెటిక్స్, మాలిక్యులర్ మైక్రో బయాలజీ, ఇమ్యునాలజీ.

అర్హతలు: సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ ఐసీఎంఆర్/ఇన్‌స్పైర్/జెస్ట్/యూజీసీ-ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత పొంది ఉండాలి. జేఆర్ఎఫ్ అర్హత లేని అభ్యర్థులను ఇంటర్వ్యూకి అనుమతించరు. ఐసీఎంఆర్ నుంచి రెండేళ్ల ఫండెడ్ ప్రాజెక్ట్ స్కీమ్ కింద జేఆర్ఎఫ్ పొందినవారు, బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసి డీబీటీ జేఆర్ఎఫ్ నెట్ అర్హత ఉన్నవారు, డీబీటీ-బీ కేటగిరీ కింద జేఆర్ఎఫ్ నెట్ రాసినవారు, సీఎస్ఐఆర్-యూజీసీ(నెట్) ద్వారా ఎల్ఎస్ అర్హత పొందినవారు దరఖాస్తుకు అనర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 11
- **వెబ్‌సైట్:** www.cdfd.org.in

ఐఐటీ మద్రాస్‌లో ఈఎంబీఏ

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం) నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్) - ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(ఈఎంబీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వారాంతాల్లో క్లాస్ రూమ్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మూడు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ డిస్కషన్స్, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఎలక్టివ్ కోర్సులు ఉంటాయి. తొమ్మిది రోజుల ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ లెర్నింగ్ కోర్సు జతగా ఉంటుంది. ఇది 'గ్లోబల్ లీడర్‌షిప్ అండ్ కల్చరల్ ఇంటెలిజెన్స్'కు సంబంధించి ఉంటుంది. దీనిని బ్రస్సెల్స్-బెల్జియం; లిల్లీ & పారిస్-ఫ్రాన్స్‌లోని ఎస్ఈజీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిసెంబరు 31 నాటికి కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 20
- **వెబ్‌సైట్:** doms.iitm.ac.in

స్పోర్ట్స్

వరల్డ్ 6- రెడ్ స్నూకర్ చాంపియన్ కమల్



ఉలాన్‌బాటర్ (మంగోలియా): కమల్ చావ్లా ఐబీఎస్ఎఫ్ వరల్డ్ 6-రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నాడు. బుధవారం ఇక్కడ జరిగిన పురుషుల ఫైనల్లో 45 ఏళ్ల కమల్ 6-2తో పాకిస్థాన్ ఆటగాడు అస్జాద్ ఇక్బాల్‌ను ఓడించాడు.

శ్రీకాంత్, సిక్కిరెడ్డి జోడీ బోణీ

మకావు: కిడాంబి శ్రీకాంత్, సిక్కిరెడ్డి-సుమిత్ రెడ్డి జంట మకావు ఓపెన్ సూపర్ 300 టోర్నీలో బోణీ కొట్టారు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-14, 21-15తో డానిల్ (ఇజ్రాయిల్)పై నెగ్గాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి-సుమిత్ జోడీ 24-22, 10-21, 21-13తో లూ బింగ్ కున్-హో లో యి (మలేసియా) ద్వయంపై నెగ్గింది.

జార్ఖండ్‌కు ఆడనున్న ప్రణవి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ సీనియర్ మహిళల జట్టు మాజీ వైస్ కెప్టెన్ ప్రణవి చంద్ర ఇకపై జార్ఖండ్ జట్టుకు ఆడాలని నిర్ణయించుకుంది. హైదరాబాద్ సీనియర్ టీమ్‌లో చోటు దక్కకపోవడంతో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. జార్ఖండ్ తరఫున 2024-2025 దేశవాళీ సీజన్‌లో ఆమె గెస్ట్ ప్లేయర్‌గా ఆడనుందని ఆ రాష్ట్ర క్రికెట్ సంఘం తెలిపింది. ఇక, ప్రణవి చంద్ర వేరే జట్టుకు ఆడేందుకు హెచ్‌సీఏ మంగళవారం నిరభ్యంతర పత్రం ఇవ్వడం, అదే రోజు జార్ఖండ్ సంఘం ఆమెను ఆహ్వానించడం, సీనియర్ జట్టులోకి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

టాప్-10లోకి పంత్

దుబాయ్: వికెట్‌కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ బుధవారం విడుదలైన తాజా టెస్టు ర్యాంకింగ్స్‌తో మళ్లీ టాప్-10లోకి వచ్చాడు. పంత్ ఆరో ర్యాంక్‌కు ఎగబాకగా, యశస్వీ జైస్వాల్ ఐదో ర్యాంక్‌కు చేరుకున్నాడు. కాగా, రోహిత్ శర్మ ఐదు స్థానాలు కోల్పోయి పదోర్యాంకులో, ఐదు స్థానాలు చేజార్చుకున్న విరాట్ కోహ్లీ 12వ ర్యాంక్‌లో నిలిచారు.. జో రూట్ టాప్‌లో ఉన్నాడు. బౌలర్లలో అశ్విన్ టాప్ ర్యాంక్, బుమ్రా రెండో స్థానాన్ని పదిలం చేసుకున్నారు.

వినేశ్‌కు నాడా నోటీసులు

న్యూఢిల్లీ: రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు జాతీయ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (నాడా) నోటీసులు జారీ చేసింది. ఈనెల 9న జరగాల్సిన డోప్ పరీక్షకు అందుబాటులో లేని వినేశ్ తన ఆచూకీ వివరాలను అందజేయడంలో విఫలమైనందున 14 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని 'నాడా' పేర్కొంది. అయితే, ఒలింపిక్స్ సమయంలో వినేశ్ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

చాంపియన్లతో మోదీ భేటీ



ప్రధాని సమక్షంలో గేమ్ ఆడిన అర్జున్, ప్రజ్ఞానంద

చెస్ ఒలింపియాడ్ విజేతలకు ప్రశంసలు

న్యూఢిల్లీ: చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలు నెగ్గి చరిత్ర సృష్టించిన భారత పురుషులు, మహిళల జట్ల సభ్యులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. హంగేరీలో జరిగిన ఒలింపియాడ్‌లో విజేతలుగా నిలిచి స్వదేశం చేరుకున్న చెస్ క్రీడాకారులు.. బుధవారం ప్రధాని మోదీని ఆయన నివాసంలో కలుసుకున్నారు. జట్టు సభ్యులందరితో చాలాసేపు ముచ్చటించిన మోదీ.. ఒక్కొక్కరిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిష్ఠాత్మక టోర్నీలో స్వర్ణ పతకాలు సాధించి దేశం గర్వపడేలా చేసినందుకు చాలా సంతోషంగా ఉందని మోదీ అన్నారు. అనంతరం ప్రధాని సమక్షంలో యువ ఆటగాళ్లు అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద కాసేపు చెస్ ఆడారు. ఈ సందర్భంగా గేమ్‌లో ఆటగాళ్లు వేసిన ఎత్తులను చూసి మోదీ అచ్చెరువొందారు. ఆ తర్వాత క్రీడాకారులంతా కలిసి మోదీకి చెస్ బోర్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో పురుషులు, మహిళల జట్ల సభ్యులు అర్జున్, ప్రజ్ఞానంద, గుకేష్, విదిత్ గుజరాతీ, ద్రోణవల్లి హారిక, వైశాలి, దివ్యా దేశ్‌ముఖ్, వంతికా అగర్వాల్, తానియా సచ్‌దేవ్ పాల్గొనగా..విజేత జట్టులోని సభ్యుడైన సీనియర్ ఆటగాడు పెంటేల హరికృష్ణ గైర్హాజరయ్యాడు.



విజేతలకు రూ. 3.2 కోట్ల నజరానా

చెస్ ఒలింపియాడ్‌లో విజేతలుగా నిలిచిన పురుషులు, మహిళల జట్లకు అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) నజరానా ప్రకటించింది. బుధవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులందరినీ ఏఐసీఎఫ్ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా జట్లకు మొత్తం రూ. 3.2 కోట్ల రివార్డును ఏఐసీఎఫ్ అధ్యక్షుడు నితిన్ నారంగ్ ప్రకటించారు. విజేత జట్టులోని ప్రతి ప్లేయర్‌కు రూ. 25 లక్షల చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. పురుషులు, మహిళల జట్ల కెప్టెన్లు అభిజిత్ కుంతే, శ్రీనాథ్ నారాయణన్‌లకు రూ. 15 లక్షల చొప్పున.. చెస్ ఒలింపియాడ్‌లో భారత బృందానికి చీఫ్‌గా వ్యవహరించిన గ్రాండ్‌మాస్టర్ దివ్యేందు బారువాకు రూ. 10 లక్షలు ప్రకటించారు. సహాయక కోచ్‌లు రూ. 7.5 లక్షల చొప్పున అందుకోనున్నారు.

86 ఫోర్లు, 7 సిక్స్‌లు.. 498 పరుగులు

గుజరాత్ కుర్రాడి మారథాన్ ఇన్నింగ్స్



గాంధీనగర్: దివాన్ బల్లూభాయ్ కప్ అండర్-19 మల్టీ డే ఇంటర్ స్కూల్ టోర్నమెంట్‌లో గుజరాత్‌కు చెందిన 18 ఏళ్ల కుర్రాడు సంచలన ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. ఈ టోర్నీలో సెయింట్ జేవియర్స్ స్కూల్ జట్టు తరఫున ఆడిన ద్రోణ దేశాయ్ క్వాడ్రపుల్ సెంచరీ (498)తో విజృంభించడంతో ప్రత్యర్థి జేఎల్ ఇంగ్లీష్ స్కూల్ జట్టుపై జేవియర్స్ ఏకంగా ఇన్నింగ్స్, 712 పరుగుల తేడాతో గెలిచింది. జేవియర్స్ జట్టు 26 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన ద్రోణ.. తొలుత హెట్ దేశాయ్‌తో కలిసి 350, తర్వాత కెప్టెన్ విరాట్ తలపతితో కలిసి 188 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. మ్యాచ్‌లో మొత్తం 320 బంతులు ఎదుర్కొన్న దేశాయ్.. 86 ఫోర్లు, 7 సిక్స్‌లతో కలిసి 498 పరుగులు బాదాడు. దేశాయ్ మారథాన్ ఇన్నింగ్స్‌తో జేవియర్స్ జట్టు 844 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో జేఎల్ టీమ్ 122 పరుగులకే కుప్పకూలింది. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగిన ద్రోణ.. స్కూల్ క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన ఆటగాళ్ల జాబితాలో నిలిచాడు. గతంలో ప్రణవ్ ధనవాడె (1009 నాటౌట్), పృథ్వీ షా (546), హవెవాలా (515), చమన్‌లాల్ (506 నాటౌట్), అర్మాన్ జాఫర్ (498) అత్యధిక స్కోర్లు సాధించారు.

ఆసీస్ జోరుకు ఇంగ్లండ్ బ్రేక్

● మూడో వన్డేలో గెలుపు

చెస్టర్ లీ స్ట్రీట్: ఆస్ట్రేలియా వరుస 14 వన్డేల విజయాలకు ఇంగ్లండ్ బ్రేకులు వేసింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (110 నాటౌట్) శతకంతో చెలరేగడంతో.. ఆసీస్‌తో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 46 (డ/లూ) పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-2తో నిలిచింది. తొలుత ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 304/7 స్కోరు చేసింది. అలెక్స్ క్యారీ (77 నాటౌట్), స్మిత్ (60) హాఫ్ సెంచరీలు చేశారు. ఆర్చర్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో ఇంగ్లండ్ 37.4 ఓవర్లలో 254/4 స్కోరు చేసింది. విల్ జాక్స్ (84) రాణించాడు. అయితే, 38వ ఓవర్‌లో మొదలైన వర్షం కారణంగా విఘలిన మ్యాచ్ సాగలేదు. దీంతో డక్‌వర్త్/లూయిస్ పద్ధతి ప్రకారం మెరుగైన రన్‌రేట్ ఉన్న ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించారు.



ముంబైలో బుధవారం జరిగిన టెన్నిస్ ప్రీమియర్ లీగ్ వేలంలో టెన్నిస్ స్టార్లు లియాండర్ పేస్, మహేశ్ భూపతి, సానియా మీర్జా, నటులు సొనాలీ బింద్రే, రకుల్‌ప్రీత్

నాకు రెండు చేతులే ఉన్నాయ్!



కాన్పూర్ హోటల్‌లో కోహ్లీకి ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. హోటల్ సిబ్బంది ఒకరు కరచాలనం కోసం ప్రయత్నించగా.. విరాట్ సున్నితంగా తిరస్కరించాడు. క్రికెటర్‌ను ఆహ్వానించిన అనంతరం అతడి చేతికి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చిన హోటల్ సిబ్బంది ఒకరు షేక్ హ్యాండ్ కోసం తన చేతిని ముందుకు చాచాడు. అయితే, మరో చేతిలో లగేజ్ ఉండడంతో విరాట్ 'నాకు రెండు చేతులే ఉన్నాయి' అంటూ ముందుకుసాగాడు.



గ్రీన్‌పార్క్ మారలేదు!



స్టేడియంలో అన్నీ సమస్యలే

భారత్-బంగ్లా రెండో టెస్ట్ వేదిక

కాన్పూర్: బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌కు వేదికైన గ్రీన్‌పార్క్ స్టేడియం సమస్యలమయంగా మారింది. మూడేళ్ల తర్వాత ఐదురోజుల మ్యాచ్‌కు ఆతిథ్యం దక్కించుకొన్నా.. సౌకర్యాలు మాత్రం తీసికట్టుగానే ఉన్నాయి. తాజాగా, ఈ మైదానంలోని శిథిలావస్థలో ఉన్న ఓ స్టాండ్ ప్రమాదకరంగా ఉందని స్థానిక ప్రజా పనుల శాఖ (పీడబ్ల్యూడీ) ప్రకటించడం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కువ మంది ఎక్కితే బాల్కనీ 'సి' స్టాండ్ కూలిపోయే అవకాశాలున్నాయని నిపుణులు తేల్చారు. శుక్రవారమే మ్యాచ్ ఆరంభం కానుండడంతో మరమ్మతులు చేసేందుకు ఉత్తరప్రదేశ్ క్రికెట్ సంఘం (యూపీసీఏ) వద్ద తగినంత సమయం కూడా లేదు. 'స్టాండ్ పిల్లర్లు చాలా బలహీనంగా ఉన్నాయి. 50 మంది గట్టిగా ఎగిరితే కూలిపోతుందేమోననిపిస్తోంద'ని స్టాండ్‌ను పరిశీలించిన ఓ ఇంజనీర్ అభిప్రాయపడ్డాడు. దీంతో ఎలాంటి రిస్క్ లేకుండా ఉండేందుకు ఈ స్టాండ్‌ను మూసివేయాలని అధికారులు సలహా ఇచ్చారు. ఇక్కడ ఫ్లడ్ లైట్ల సమస్య కూడా వెలుగు చూసింది. వీఐపీ పెవిలియన్ దగ్గర ఫ్లడ్ లైట్‌లో 8 బల్బులు పని చేయడం లేదని తెలిసింది. కాన్పూర్‌లో కాలుష్యం కారణంగా వెలుతురు సమస్య ఎదురయ్యే చాన్సుంది. మూడేళ్ల క్రితం న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌ని వెలుతురు లేమి కారణంగా డ్రాగా ముగించాల్సిన పరిస్థితి. ఏళ్లు గడిచినా ఈ సమస్యను మాత్రం పరిష్కరించలేదట. పైగా నగరం మధ్యలో స్టేడియం ఉండడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కావచ్చని పోలీసులు చెబుతున్నారు. 1952లో గ్రీన్‌పార్క్ స్టేడియం ఆరంభమైంది. ఎన్నో అంతర్జాతీయ మ్యాచ్‌లకు వేదికగా నిలిచింది. అయితే, కొత్తగా ఏక్‌నా స్టేడియం నిర్మించడంతో మైదానం ప్రాధాన్యత తగ్గింది.

ఇవిగో రికార్డులు

కాన్పూర్‌లోని గ్రీన్‌పార్క్ స్టేడియంలో భారత జట్టు ఇప్పటిదాకా 23 టెస్టులాడింది. 1952 జనవరిలో ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో తలపడిన టీమిండియా, చివరిసారిగా 2021 నవంబరులో న్యూజిలాండ్‌తో ఆడింది. ఇక ఇక్కడ జరిగిన 23 టెస్టుల్లో 7 విజయాలు సాధించిన భారత్..మూడింటిలో ఓటమిపాలైంది. 13 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ప్రస్తుత ప్రత్యర్థి బంగ్లాదేశ్‌తో ఈ వేదికపై భారత్ ఎప్పుడూ ఆడలేదు.

జితేష్‌కే చాన్స్?

అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఇషాన్ కిషన్ రీఎంట్రీ మరింత ఆలస్యం కానుందనే సంకేతాలు అందుతున్నాయి. బంగ్లాతో మూడు టీ20ల సిరీస్‌లో రెండో వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌కు బదులు జితేష్ శర్మకు అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది. వచ్చే నెల 6న గ్వాలియర్‌లో తొలి టీ20 జరగనున్న నేపథ్యంలో ఈ వారాంతంలో జట్టును ఎంపిక చేయవచ్చని భావిస్తున్నారు. టెస్టుల్లో పంత్ అవసరం ఎక్కువగా ఉండడంతో.. ప్రధాన కీపర్‌గా సంజూ శాంసన్‌ను టీ20లకు ఎంపిక చేస్తే.. బ్యాకప్‌గా జితేష్‌కు చోటు లభించవచ్చు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పొట్టి సిరీస్‌లో గిల్, పంత్, బుమ్రాలకు విశ్రాంతి ఇస్తారనే అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో జింబాబ్వే టూర్‌కు వెళ్లిన జట్టులో ఎక్కువ మంది టీ20 జట్టులో చోటు నిలబెట్టుకొనే చాన్సుంది.

నిఫ్టీ 26,000 పైకి..

85,000 ఎగువన ముగిసిన సెన్సెక్స్.. కొనుగోళ్లతో ఆల్‌టైం రికార్డు గరిష్ఠాలకు సూచీలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు బుధవారం సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్, నిఫ్టీ రోజంతా పరిమిత శ్రేణిలో లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి అర గంటలో బ్యాంకింగ్, పవర్ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరగడంతో రివ్వున ఎగిశాయి. సెన్సెక్స్ తొలిసారిగా 85,000 ఎగువ స్థాయిలో ముగియగా.. నిఫ్టీ సైతం 26,000 మార్క్‌ను అధిగమించేసింది. సెన్సెక్స్ ఒక దశలో 333.38 పాయింట్ల వృద్ధితో 85,247.42 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును తాకి చివరికి 255.83 పాయింట్ల లాభంతో 85,169.87 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. నిఫ్టీ సైతం 63.75 పాయింట్ల లాభంతో 26,004.15 వద్ద ముగిసింది. సూచీకిది సరికొత్త గరిష్ఠ ముగింపు. 26,032.80 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును కూడా నమోదు చేసింది. క్రితం సెషన్‌లోనే సూచీలు ఈ చారిత్రక మైలురాళ్లను చేరినప్పటికీ, మదుపరుల లాభాల స్వీకరణ కారణంగా మళ్లీ వెనక్కి వచ్చాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడ్డాయి.

వేదాంత 4వ డివిడెండ్

మైనింగ్ దిగ్గజం వేదాంత లిమిటెడ్ తన వాటాదారులకు మరోసారి డివిడెండ్ అందించనుంది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇప్పటికే మూడుసార్లు మధ్యంతర డివిడెండ్‌ను పంచింది. నాలుగోసారి డివిడెండ్‌పై వచ్చే నెల 8న బోర్డు సమావేశమై, ఆమోదం తెలపనుందని కంపెనీ వెల్లడించింది. వేదాంత గత మూడు విడతల్లో తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.35 డివిడెండ్ చొప్పున మొత్తం రూ.13,474 కోట్లు చెల్లించింది.

ఎన్‌ఎస్ఈ కో-లొకేషన్ సేవల విస్తరణ

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్ఈ) తన ట్రేడింగ్ సభ్యులకు ముంబై ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న కో-లొకేషన్ డేటా సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను వచ్చే మూడేళ్లలో దాదాపు మూడింతల స్థాయికి పెంచాలనుకుంటోంది. ప్రస్తుతం ఈ కేంద్రంలో ట్రేడింగ్ సభ్యుల కోసం 1,400 ర్యాక్‌లను ఏర్పాటు చేసిన ఎక్స్ఛేంజీ.. మూడేళ్లలో ఈ సంఖ్యను 4,000కు పెంచనుందని సమాచారం.

బీఎంసీసీలో మరో 8.82% వాటా కొనుగోలు

కోరమాండల్ ఇంటర్నేషనల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెనెగల్‌కు చెందిన రాక్ ఫాస్ఫేట్ మైనింగ్ సంస్థ బావోబాబ్ మైనింగ్ అండ్ కెమికల్స్ కార్పొరేషన్ (బీఎంసీసీ)లో అదనంగా 8.82 శాతం వాటాను చేజిక్కించుకున్నట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రకటించింది. ఈ కొనుగోలుతో బీఎంసీసీలో కోరమాండల్ వాటా 53.8 శాతానికి చేరుకుంటుందని పేర్కొంది. కాగా బీఎంసీసీ విస్తరణ ప్రాజెక్టులతో పాటు మూలధన అవసరాల నిమిత్తం రూ.54 కోట్ల (65 లక్షల డాలర్లు) రుణాన్ని అందించటంతో పాటు సంస్థలో రూ.32 కోట్ల (38.4 లక్షల డాలర్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు కోరమాండల్ వెల్లడించింది. ఫాస్ఫాటిక్ ఎరువుల ఉత్పత్తిలో ఉపయోగించే ఫాస్ఫరిక్ యాసిడ్ తయారీకి కీలకమైన ముడి పదార్థం రాక్ ఫాస్ఫేట్ అని పేర్కొంది. కోరమాండల్‌కు చెందిన విశాఖపట్నం యూనిట్‌లో ప్రస్తుతం సెనెగల్ నుంచి తీసుకువచ్చిన రాక్ ఫాస్ఫేట్‌ను బ్లెండింగ్ చేస్తున్నట్లు తెలిపింది. అలాగే కాకినాడలో ఏర్పాటు చేస్తున్న ఫాస్ఫరిక్ యాసిడ్ ప్లాంట్‌కు అవసరమైన రాక్ ఫాస్ఫేట్‌ను బీఎంసీసీ నుంచి తీసుకోనున్నట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. 2011లో ఏర్పాటైన బీఎంసీసీలో కోరమాండల్ 45 శాతం వాటాను 2022 సెప్టెంబరులో చేజిక్కించుకుంది.

Coromandel FUTURE POSITIVE

హ్యుండయ్, స్విగ్గీ ఐపీఓలకు సెబీ ఆమోదం

HYUNDAI SWIGGY

» రూ.25,000 కోట్లు సమీకరించనున్న హ్యుండయ్

» స్విగ్గీ టార్గెట్ రూ.10,000 కోట్ల పైనే..

క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ.. రెండు మెగా ఐపీఓ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అందులో ఒకటి రూ.25,000 కోట్ల హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ కాగా.. మరొకటి రూ.10,000 కోట్ల స్విగ్గీ పబ్లిక్ ఆఫరింగ్. దేశీయ చరిత్రలో హ్యుండయ్‌దే అతి పెద్ద ఐపీఓ కానుంది. ఇప్పటివరకైతే ఎల్ఐసీదే (రూ.21,000 కోట్లు) అతి పెద్ద ఇష్యూ. ప్రస్తుతం ప్రైమరీ మార్కెట్లో ఐపీఓల సందడి నెలకొంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 60 కంపెనీలు పబ్లిక్ ఆఫరింగ్‌ల ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలోని ప్రధాన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో తమ షేర్లను నమోదు చేశాయి. సెబీకి సమర్పించిన ప్రాథమిక ముసాయిదా పత్రాల (డీఆర్‌హెచ్‌పీ) ప్రకారం.. ఐపీఓలో భాగంగా హ్యుండయ్ మోటార్ ఇండియా తన మాతృ సంస్థ వాటాకు చెందిన 14,21,94,700 ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. తాజా ఈక్విటీని మాత్రం జారీ చేయడం లేదు. రెండు దశాబ్దాలకు పైగా కాలంలో తొలి కార్ల తయారీ కంపెనీ ఇష్యూ ఇదే కానుంది. చివరగా, 2003లో మారుతి సుజుకీ ఐపీఓకు వచ్చింది. కాగా, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ ఈ ఏప్రిల్ 30న సెబీకి ఐపీఓ దరఖాస్తు సమర్పించింది. అయితే, కంపెనీ కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ సదుపాయాన్ని ఉపయోగించుకుంది. దాంతో ఐపీఓ అధికారిక వివరాలు అందుబాటులో లేవు. కానీ, ఐపీఓ ద్వారా కంపెనీ రూ.5,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ఇన్వెస్టర్లకు చెందిన రూ.5,000 కోట్లకు పైగా షేర్లను ఓఎఫ్ఎస్ పద్ధతిన విక్రయించనున్నట్లు తెలిసింది. ఈ లెక్కన కంపెనీ మొత్తం రూ.10,000 కోట్లకు పైగా సమీకరించే అవకాశం ఉంది.

పసిడి రికార్డు పరుగు



రూ.77,850కి 10 గ్రాముల ధర.. ఒక్కరోజే రూ.900 అప్

» వెండి రూ.3,000 జంప్..

» రూ.93,000కు చేరిన కేజీ

న్యూఢిల్లీ: పసిడి ధర సరికొత్త జీవిత కాల రికార్డు స్థాయికి పెరిగింది. 10 గ్రాముల ధర రూ.78,000కు చేరువైంది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర బుధవారం మరో రూ.900 పెరిగి రూ.77,850కి చేరుకుంది. బంగారానికి ఇప్పటి వరకిదే గరిష్ఠ స్థాయి. వెండి సైతం భారీగా ఎగబాకింది. కిలో రూ.3,000 పెరుగుదలతో రూ.93,000 ధర పలికింది. అంతర్జాతీయంగానూ వీటి ధరలు ఆల్‌టైం రికార్డు స్థాయికి పుంజుకోవడమే ఇందుకు ప్రధాన కారణం. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు ఒక దశలో 2,694.89 డాలర్లకు ఎగబాకింది. సిల్వర్ 32.15 డాలర్లకు పుంజుకుంది.

అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ గత వారం ప్రామాణిక వడ్డీ రేట్లను 0.50 శాతం తగ్గించిన ప్పటి నుంచి బంగారం ధరలు వేగంగా పెరుగుతున్నాయి. వచ్చే సమీక్షలో ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చని మార్కెట్లో ఊహాగానాలు ఇప్పటికే ఊపందుకున్నాయి. ఇందుకు తోడు పశ్చిమాసియాలో యుద్ధవాతావరణం నెలకొనడం, తాజాగా చైనా సైతం వడ్డీ రేట్లను తగ్గించడం, ఆర్థిక వ్యవస్థకు దన్నుగా మరిన్ని ఉద్దీపనలు ప్రకటించడం పసిడి గిరాకీని మరింత పెంచవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఇదే ట్రెండ్ కొనసాగితే, సమీప భవిష్యత్‌లో ఔన్స్ గోల్డ్ 3,200 డాలర్ల స్థాయికి ఎగబాకినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా అభిప్రాయపడ్డారు.

త్వరలో 3,200 డాలర్లకు ఔన్స్ బంగారం?

ఎలక్ట్రిక్ ఎల్‌సీవీ విభాగంలోకి యూలర్

రెండు మోడల్స్ విడుదల



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహన తయారీదారు యూలర్ మోటార్స్.. తేలికపాటి వాణిజ్య వాహన (ఎల్‌సీవీ) విభాగంలోకి ప్రవేశించింది. వివిధ వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా నాలుగు టైర్లతో కూడిన రెండు ఎలక్ట్రిక్ ఎల్‌సీవీలను మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రస్తుతం కంపెనీ ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలను విక్రయిస్తోందని, తాజాగా ఇంటర్, ఇంట్రా సిటీ అవసరాల కోసం స్టార్మ్ పేరుతో ఈ వాహనాలను తీసుకువచ్చినట్లు యూలర్ మోటార్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ సౌరవ్ కుమార్ తెలిపారు. ఇంట్రా సిటీ కోసం స్టార్మ్ ఈవీ టీ1250 పేరుతో తీసుకువచ్చిన ఎల్‌సీవీ ధర రూ.8.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్). 1,250 కేజీల పేలోడ్ సామర్థ్యంతో కూడిన ఈ వాహనం ఒకసారి చార్జింగ్‌తో 140 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు. అలాగే ఇంటర్ సిటీ కోసం తీసుకువచ్చిన స్టార్మ్ ఈవీ లాంగ్ రేంజ్ 200 ధర రూ.12.99 (ఎక్స్‌షోరూమ్) అని ఆయన పేర్కొన్నారు. ఈ వాహనం 1,250 కేజీల పేలోడ్ సామర్థ్యంతో పాటు సింగిల్ చార్జింగ్‌తో 200 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని తెలిపారు. ఈ వాహనాలను తొలుత హైదరాబాద్, ఢిల్లీ, చెన్నై, ముంబై నగరాల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

1ఫ్లెక్సిబల్ వర్క్‌స్పేస్ సంస్థ వియ్ వర్క్ ఇండియా.. హైదరాబాద్‌లో రెండో ఎడిషన్ సస్టెయినబిలిటీ సమ్మిట్‌ను నిర్వహించింది. ఇంధన సామర్థ్యం, నిర్వహణకు సంబంధించి ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఆర్యన్ గ్రూప్, పేస్ సీటింగ్ ఈ సమ్మిట్‌కు తోడ్పాటునందించాయి.

1ఫ్రెంచ్ గృహోపకరణాల తయారీ సంస్థ థామ్సన్.. స్మార్ట్ టీవీలు, వాషింగ్ మెషిన్స్, స్పీకర్లు తదితర ఉత్పత్తులపై భారీ డీల్స్‌ను ప్రకటించింది. ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డే సేల్‌లో ఈ డీల్స్ అందుబాటులో ఉండనున్నాయి. ఉత్పత్తుల ధరలు రూ.5,999 నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించింది.

1స్పామ్ కాల్స్, మెసేజ్‌లను గుర్తించి, వాటిపై తగు చర్య తీసుకునేందుకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత టెక్నాలజీని ఉపయోగించనున్నట్టు భారతి ఎయిర్‌టెల్ తెలిపింది. గురువారం అర్ధరాత్రి నుంచి తమ ప్లాట్‌ఫామ్‌పై ఈ టెక్నాలజీని ప్రవేశపెడుతున్నట్టు వెల్లడించింది. కేవలం 2 మిల్లీ సెకండ్లలోనే కాల్‌ను అనలైజ్ చేసి యూజర్లను తక్షణం హెచ్చరించే ఏఐ ఆధారిత సొల్యూషన్‌ను తాము ప్రవేశపెట్టినట్లు తెలిపింది.


బిజినెస్

ఐఎస్‌బీ ఎంబీఏ కోర్సుకు అంతర్జాతీయ ర్యాంక్

న్యూఢిల్లీ: ప్రపంచంలోని టాప్ 100 ఎంబీఏ కోర్సుల్లో మూడు ఐఐఎంల నిర్వహణలోని కోర్సులు, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) నిర్వహణలోని ఎంబీఏ కోర్సు ఉన్నాయి. లండన్‌కు చెందిన ఉన్నత విద్య విశ్లేషణ సంస్థ క్వాక్‌క్వారెల్లి సైమండ్స్ (క్యూఎస్) ఈ ర్యాంకింగ్‌లు ప్రకటించింది. ఇక ఆ జాబితాలోని మూడు ఐఐఎంలలో బెంగళూరు, అహ్మదాబాద్, కలకత్తా ఐఐఎం ఉన్నాయి. ఉపాధికి అర్హమైన టాప్ 50 సంస్థల్లో మూడు బిజినెస్ స్కూళ్లున్నాయి. అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూల్ వరుసగా ఐదో ఏడాదిలోనూ ప్రపంచ టాప్ 1 ర్యాంకింగ్‌లో నిలిచింది. 58 దేశాలకు చెందిన 340 ఉత్తమ ఎంబీఏ కోర్సులు ఈ ఏడాది ర్యాంకింగ్స్‌లో పరిశీలనకు వచ్చాయి. ఆయా విభాగాల్లో ఉత్తమ కోర్సులను విద్యార్థులు ఎంపిక చేసుకోవడానికి ఈ ర్యాంకింగ్స్ సహాయపడతాయి.

లింక్డ్ఇన్ టాప్ స్టార్టప్‌గా జెప్టో

న్యూఢిల్లీ: వృత్తి నిపుణులు పని చేయడానికి ఇష్టపడే లింక్డ్ఇన్ టాప్ స్టార్టప్‌ల జాబితాలో క్విక్ కామర్స్ కంపెనీ జెప్టో అగ్రస్థానంలో నిలిచింది. ఈ జాబితాలో జెప్టో ప్రథమ స్థానంలో నిలవడం వరుసగా ఇది రెండో ఏడాది. ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మంది లింక్డ్ఇన్ సభ్యుల అభిప్రాయాలు సేకరించి ఈ జాబితాను రూపొందించారు. ఉద్యోగంలో వృద్ధి, పనిలో లీనం కావడం, ఉద్యోగంపై ఆసక్తి, అత్యున్నత ప్రతిభావంతుల ఆకర్షణ అనే నాలుగు కొలమానాల్లో స్టార్టప్‌ల తీరును మదింపు చేస్తారు. స్ప్రింటో, లుసిడిటీ ఈ జాబితాలో జెప్టో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ ఏడాది జాబితాలోని 20 స్టార్టప్‌లలో 14 కొత్తగా ప్రవేశించినవే కావడం విశేషం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,020 ▲	70,060 ▲	1,01,000 ▲
ముంబై	75,248 ▲	68,927 ▲	90,730 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	555
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	543	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	121
వరంగల్	125	గుంటూరు	126
కరీంనగర్	125	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	124
కర్నూలు	125	నెల్లూరు	124
విశాఖపట్నం	107	అనంతపురం	124
గోదావరి	121		

బీసీ ఉద్యమ బలోపేతానికే రాజీనామా

- ఏ పార్టీలో చేరేది ఇంకా నిర్ణయించుకోలేదు: ఆర్.కృష్ణయ్య
- కృష్ణయ్యతో కాంగ్రెస్ నేతల భేటీ.. పార్టీలోకి రావాలని ఆహ్వానం



రాంనగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా బలోపేతం చేయడానికే తాను రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశానని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో కృష్ణయ్య మాట్లాడారు. బీసీ ఉద్యమ నాయకుడిగా జగన్ తనను రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేశారని, ఆ పదవికి న్యాయం చేశానని చెప్పారు. అయితే రాజ్యసభలో బీసీల డిమాండ్లపై తాను పోరాటం చేసినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని అన్నారు. పోరాటం ద్వారానే బీసీలకు అధికారం వస్తుందని, డిమాండ్ల పరిష్కారం అవుతాయని భావించి రాజ్యసభకు మరో నాలుగు సంవత్సరాల కాలం ఉన్నప్పటికీ తాను రాజీనామా చేశానని తెలిపారు. ఏ పార్టీలో చేరేది ఇంకా నిర్ణయించుకోలేదని కృష్ణయ్య పేర్కొన్నారు. మరోవైపు ఆర్. కృష్ణయ్యతో కాంగ్రెస్ నేత వీహెచ్, ఎమ్మెల్యే మల్లు రవి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న భేటీ అయ్యారు. విద్యానగర్‌లో కృష్ణయ్యను కలిసి వీహెచ్ ఏకాంతంగా భేటీ అయ్యారు. అనంతరం మాట్లాడుతూ, బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి ఆర్.కృష్ణయ్య రాజ్యసభ్య సభ్యత్వానికి రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. అందుకే కృష్ణయ్యను కాంగ్రెస్ పార్టీలోకి రావాలని కోరారని వీహెచ్ తెలిపారు. అలాగే బీసీ భవన్‌లో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వేర్వేరుగా కృష్ణయ్యతో భేటీ అయి ఏకాంతంగా చర్చలు జరిపారు. కాంగ్రెస్ పార్టీలోకి రావాలని కృష్ణయ్యను వారు ఆహ్వానించారు. అయితే కృష్ణయ్య వారికి ఎలాంటి హామీ ఇవ్వలేదు, భవిష్యత్ నిర్ణయాన్ని త్వరలో చెప్తానని పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సీఏవో పదోన్నతి

- ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శికి ట్రెజరీస్ సంఘం ఫిర్యాదు

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలోని ఆర్థిక శాఖ విభాగ అధికారి ఎస్.మంగమ్మకు నిబంధనలకు విరుద్ధంగా చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (సీఏవో)గా పదోన్నతి కల్పించారని తెలంగాణ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీస్ అసోసియేషన్ ఆరోపించింది. ఆమెకు పదోన్నతి కల్పించి నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో నియమించడంపై ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పురుషోత్తమ్‌రెడ్డి, వై.పరశురామ్ తదితరులు ఫిర్యాదు చేశారు. బుధవారం సుల్తానియాను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. సెక్షన్ ఆఫీసర్లకు పదోన్నతులు కల్పించాలంటే అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ పోస్టులకే అర్హులవుతారని, కానీ సీఏఓ, డిప్యూటీ డైరెక్టర్ (ట్రెజరీస్) పోస్టులకు అర్హులు కారని తెలిపారు. పలు కారణాల వల్ల నాలుగేళ్ల నుంచి సీఏఓ, డీడీ పోస్టులకు పదోన్నతులు కల్పించకుండా నిలిపివేశారని, కాని మంగమ్మకు మాత్రం సీఏఓగా పదోన్నతి కల్పించారని వివరించారు. ఈ పదోన్నతిని రద్దు చేయాలని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శిని వారు కోరారు.

మోసం చేయడమే కాంగ్రెస్ గ్యారెంటీ: లక్ష్మణ్

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నికలు ఎక్కడ జరిగినా గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. మోసం చేయడం, దోచుకోవడమే కాంగ్రెస్ గ్యారంటీ అని, అధికారంలోకి వచ్చి అవినీతితో సొమ్ము చేసుకోవడమే ఆ పార్టీ లక్ష్యం అని విమర్శించారు. తెలంగాణ మంత్రులూ తక్కువేం కాదని, కొందరు మంత్రులు పెద్దమొత్తంలో అవినీతికి పాల్పడుతున్నారని అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు మోసపూరితమేనని తెలంగాణాలో కూడా ఇప్పటికే తేలిపోయిందని స్పష్టం చేశారు. తొమ్మిది నెలల్లోనే ఆ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని లక్ష్మణ్ పేర్కొన్నారు. దేశ సంపదను మొదట మైనారిటీలకే కట్టబెట్టాలని కాంగ్రెస్ పార్టీ ఎజెండాగా పెట్టుకుందని ఆరోపించారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు అవినీతి, కుంభకోణాలే జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా అక్కడ అవినీతి నిత్యకృత్యమైందని విమర్శించారు.

పంచాయతీలకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి: ఈటల

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న పంచాయతీల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దసరాలోగా ఈ బిల్లులు విడుదల చేయాలని, లేకపోతే మాజీ సర్పంచులంతా మంత్రులను నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పెండింగ్ బిల్లుల కోసం పోరాటం చేస్తున్న మాజీ సర్పంచులకు తాము మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. పంచాయతీలకు రావాల్సిన రిజిస్ట్రేషన్, మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్ వాటా కూడా ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తనవంతు వాటా ఇవ్వకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులూ రావడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 60 మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాజీ సర్పంచుల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లు తయారయిందని అన్నారు. ప్రస్తుతం ఒక మాజీ సర్పంచి ఆస్పత్రిలో చికిత్సకు డబ్బుల్లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఈటల ఆవేదన వ్యక్తం చేశారు.

పారదర్శకంగానే నియామకాలు: టీజీఈఆర్సీ

హైదరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి చేపట్టిన నియామకాల్లో అవకతవకలు జరగలేదని, నియామకాలు పారదర్శకంగానే జరిగినట్లు టీజీఈఆర్సీ ప్రకటించింది. ఈ మేరకు టీజీఈఆర్సీ కార్యదర్శి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియామకాల్లో వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్నారు. 'విద్యుత్తు నియంత్రణ మండలి నియామకాల్లో పారదర్శకత ఏదీ?' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన ఈమేరకు వివరణ ఇచ్చారు.

ఏపీలో జగన్ పోటీ పూజలు!

- ఎల్లుండి ఆలయాలన్నిటిలో పూజలకు జగన్ పిలుపు

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతను, వేంకటేశ్వరస్వామి వారి ప్రసాదం విశిష్టతను దెబ్బతీసేలా ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించి చేసిన పాపాన్ని ప్రక్షాళన చేద్దామని వైసీపీ శ్రేణులకు మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపిచ్చారు. 28వ తేదీ శనివారం రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో పూజలు చేసి పాప ప్రక్షాళన చేద్దామని బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆయన కూడా ఆ రోజు ఉదయం తిరుమలేశుడిని దర్శించుకోనున్నారు. ఇందుకోసం 27వ తేదీ రాత్రే తిరుమల చేరుకోనున్నారు. చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితో కావాలని అబద్ధాలాడి.. ప్రసాదానికి వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కల్తీ జరగకున్నా జరిగినట్లుగా, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్లుగా అసత్య ప్రచారం చేశారని జగన్ ఆరోపించారు.

53 ఔషధాల్లో నాణ్యతా లోపాలు

- జాబితాలో పారాసిటమాల్, విటమిన్, మధుమేహ ఔషధాలు
- సీడీఎస్‌సీవో వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: పారాసిటమాల్, కాల్షియం, విటమిన్ సీ, డీ3, యాంటీ బయాటిక్, మధుమేహం, రక్తపోటు (బీపీ) టాబ్లెట్లు సహా 53 రకాల ఔషధాలు నాణ్యతా పరీక్షల్లో విఫలమయ్యాయి. భారత ఔషధ రంగ నియంత్రణ మండలి (సీడీఎస్‌సీవో) ఈ ఔషధాలను నాణ్యతా ప్రమాణాలు లోపించిన ఔషధాల జాబితాలో చేర్చింది. హైదరాబాద్‌కు చెందిన హెటిరో డ్రగ్స్, ఆల్కెమ్ ల్యాబొరేటరీస్, హిందుస్థాన్ యాంటీబయాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), కర్ణాటక యాంటీబయాటిక్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్, మెగ్ లైఫ్ సైన్సెస్, ప్యూర్ అండ్ క్యూర్ హెల్త్‌కేర్ తదితర కంపెనీలు ఈ నాసిరకం ఔషధాలను తయారు చేశాయని నియంత్రణ మండలి తన నివేదికలో తెలిపింది. సీడీఎస్‌సీవో మార్కెట్లో విక్రయిస్తున్న ఔషధాల శాంపిళ్లను సేకరించి పరీక్షలను నిర్వహిస్తుంటుంది. ఈ 53 ఔషధాల్లో విటమిన్ సీ, డీ 3 టాబ్లెట్ షెల్‌కాల్, విటమిన్ బీ కాంప్లెక్స్, విటమిన్ సీ సాఫ్ట్‌జెల్స్, యాంటాసిడ్ పాన్-డీ, పారాసిటమాల్ ఐపీ 500 టాబ్లెట్లు, డయాబెటిక్ ఔషధం గ్లిమిపిరైడ్, బీపీ ఔషధం టెల్మిసార్టాన్ ఉన్నాయి. అలాగే హెటిరో తయారు చేసిన సిపోడెమ్ ఎక్స్‌పీ 50 డ్రై సస్పెన్షన్ ఔషధంలో కూడా నాణ్యతా ప్రమాణాలు లోపించినట్లు సీడీఎస్‌సీఓ గుర్తించింది.

కులగణనకు 4 రోజుల్లో విధివిధానాలు

- గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామనీ, కుల గణన కోసం అవసరమైన విధివిధానాలను నాలుగు రోజుల్లో విడుదల చేస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. సీఎం రేవంత్ ఇందుకు సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని అన్నారు. బుధవారం బేగంపేటలోని ఓ హోటల్‌లో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధివిధానాలు విడుదలైన వారం, పది రోజుల్లో కుల గణన ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని చెప్పామని, దీన్ని ఖచ్చితంగా అమలు చేస్తామనీ, బీసీల్లో ఎలాంటి అనుమానం అక్కర్లేదన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లు బీసీలకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ ఇపుడు కుల గణన గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారు అధికారంలో ఉన్న సమయంలో ఈ పని ఎందుకు చేయలేదని మహేశ్ గౌడ్ నిలదీశారు. దేశవ్యాప్తంగా కుల గణన చేసే అవకాశం ఉన్న బీజేపీ ఆ మాట మాట్లాడకుండా, రాష్ట్రంలో మాత్రం కుల గణన చేయాలని అడగడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ ప్రధానిగా మోదీ బీసీలకు ఒరగబెట్టిందేమీ లేదని, బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే సామాజిక రిజర్వేషన్లపై ఉన్న యాభై శాతం పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లలో మార్పులు చేసుకునే అధికారం రాష్ట్రాలకు కల్పించాలన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కుల గణనను తక్షణం నిర్వహించి కాంగ్రెస్ బీసీల ఆదరణ పొందాలని, లేకుంటే అభాసుపాలయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన చేపట్టాలని తాము ఆరు నెలలుగా ఉద్యమం చేపట్టామని, హైకోర్టులో కేసు కూడా వేశామని తెలిపారు. చివరకు కులగణన మార్చ్‌కు పూనుకొని హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించాలని అనుకున్నామనీ, కాంగ్రెస్‌తో జరిగిన చర్చల మేరకు దాన్ని వాయిదా వేయాలని నిర్ణయించామన్నారు. మాట ప్రకారం ప్రక్రియ ప్రారంభించపోతే ఆందోళన కొనసాగిస్తామని అన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కుందారం గణేష్ చారి, బాలగాని బాలరాజు గౌడ్, బైరి రవి కృష్ణ, ప్రొఫెసర్ బాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం
రైతుల ఎదురుచూపులు

(మొదటిపేజీ తరువాయి)



ఏడాదిలోపు ఆ రుణాన్ని కట్టేయాల్సి ఉంటుంది. లేదా రైతులు తమ వాటా కట్టేస్తే రూ.2 లక్షల వరకు ఉన్న రుణం, ఆలస్యంగా చెల్లించినందుకు అయ్యే అదనపు వడ్డీని తామే భరిస్తామంటూ ఒక నిర్దిష్ట తేదీ అయినా ఉండాలని వారు కోరుకుంటున్నారు. 2 లక్షల కేటగిరీలో ఉన్న రైతులకు రుణమాఫీ చేయటానికి సుమారు రూ.9 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనాలున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిధుల సమీకరణపై దృష్టి పెట్టింది. మరోవైపు వచ్చే నెల నుంచి రబీ సీజన్ రుణాల పంపిణీ ప్రారంభం కానుంది. అప్పటికైనా ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తుందేమోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

రైతులకు రెన్యువల్ సమస్యలు

మరోవైపు రైతులను రెన్యువల్ సమస్యలు వెంటాడుతున్నాయి. రుణమాఫీ ప్రక్రియలో జరుగుతున్న జాప్యం కారణంగా రైతులు సకాలంలో అప్పులు చెల్లించటంలేదు. రెన్యువల్ చేసుకోలేకపోతున్నారు. డబ్బులున్న రైతులు, లేదంటే బయట ప్రైవేటు అప్పులు తెచ్చుకునే పరపతి ఉన్నవాళ్లు రుణాన్ని రెన్యువల్ చేసుకుంటున్నారు. కానీ కొందరు రైతులు ఈ రెండూ అవకాశాలు లేకపోవటంతో రెన్యువల్ చేసుకోలేకపోతున్నారు. ఇప్పుడు రెన్యువల్ చేసుకోకుంటే... ప్రభుత్వమూ రుణమాఫీ డబ్బులు రెండు లక్షలు విడుదల చేయకుంటే... తమ మొత్తం రుణానికి అయ్యే అధిక వడ్డీని తామే చెల్లించాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇదిలాఉండగా బ్యాంకు నిబంధనల ప్రకారం ఏరోజుకారోజు వడ్డీ లెక్కిస్తారు. ఉదాహరణకు మల్లయ్య అనే రైతుకు కటాఫ్ తేదీ నాటికి రూ.2.30 లక్షల బకాయి ఉండి.. ఇప్పుడు అప్పు కట్టినా, రెన్యువల్ చేసుకున్నా 9 నెలల 15 రోజులకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ అక్టోబరు తొమ్మిదో నాటికి రెన్యువల్ చేసుకుంటే... 10 నెలల వడ్డీ, డిసెంబరు 9 లోపు చేసుకుంటే 12 నెలల వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. ఈ వడ్డీ భారమంతా రైతులపైనే పడుతుంది.

రెన్యువల్ చేసుకున్నా... రుణమాఫీ

రుణమాఫీ 2024 పథకంలో రాష్ట్ర ప్రభుత్వం 2023 డిసెంబరు తొమ్మిదో తేదీని కటాఫ్ తేదీగా తీసుకుంది. అప్పటివరకు రైతులు తీసుకున్న పంట రుణం, వడ్డీ కలిపి ఒక కుటుంబానికి రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామనేది ప్రభుత్వ హామీ! అయితే రూ.2 లక్షల్లోపు బకాయిలున్న రైతులకు విడతల వారీగా రుణమాఫీ ప్రక్రియ నడుస్తోంది. రూ.2 లక్షలకు మించి అప్పులున్నవారికి పెండింగ్ పెట్టింది. కటాఫ్ తేదీ ముగిసి 9 నెలలు దాటిపోయింది. అక్టోబరు తొమ్మిదో తేదీ వస్తే 10 నెలలు అవుతుంది. ఈ కాలానికి రోజురోజుకు బ్యాంకులో వడ్డీ పెరుగుతోంది. రైతులేమో ప్రభుత్వం మాఫీ చేసేది చేస్తే... మిగిలిన అప్పును రెన్యువల్ చేసుకుందామనే ఆలోచనలో ఉన్నారు. అయితే ప్రభుత్వం రూ.2 లక్షలు ఇప్పటికిప్పుడు మాఫీ చేయకపోయినా... రెన్యువల్ చేసుకుంటే.. రుణమాఫీ వర్తిస్తుందా? రెన్యువల్ చేసుకుంటే నష్టపోతామా? అనే ఆందోళన రైతుల నుంచి వ్యక్తమవుతోంది. కానీ ప్రభుత్వం నుంచి ఈ విషయంలో స్పష్టత ఉంది. 2023 డిసెంబరు తొమ్మిదో తేదీ నాటికి బాకీ ఉన్న అప్పు (ఔట్‌స్టాండింగ్) లెక్కలను ప్రభుత్వం తీసుకుంది. 2018 డిసెంబరు తొమ్మిదో తేదీ నుంచి 2023 డిసెంబరు తొమ్మిదో తేదీ మధ్యకాలంలో తీసుకున్న అప్పు, వడ్డీ.. మొత్తం రుణమాఫీ లెక్కలోకి వస్తుంది. 2023 డిసెంబరు 9 నాటికి బకాయిలు ఉండి... అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తిస్తుంది. ఇప్పుడు అప్పు రెన్యువల్ చేసుకున్నప్పటికీ కటాఫ్ తేదీ నాటికి ఉన్న ఔట్‌స్టాండింగ్ లోన్ మాఫీ అవుతుంది. కాకపోతే ఆ తేదీ తర్వాత చెల్లించాల్సిన వడ్డీ భారం అంతా రైతు మీదే పడుతుంది.

రూ.9 వేల కోట్లు కావాలి

రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 2023 డిసెంబరు తొమ్మిదో తేదీ నాటికి స్వల్పకాలిక పంట రుణాలు తీసుకున్న రైతులు సుమారు 42 లక్షల మంది ఉన్నారు. వీరిలో 22 లక్షల మందికి రూ.17,934 కోట్ల రుణమాఫీ చేశారు. మిగిలిన 20 లక్షల మందిలో కుటుంబ నిర్ధారణచేసి, అనర్హులను ఏరివేస్తే లబ్ధిదారుల సంఖ్య తేలుతుంది. అయితే రూ.2 లక్షలకు మించి పంట రుణాలున్న రైతులకు మాఫీ చేయటానికి సుమారు రూ.9 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది.

ఏఆర్ ఫుడ్స్‌పై క్రిమినల్ కేసు

- టీటీడీ ఫిర్యాదుతో తిరుపతిలో నమోదు
- నేరపూరిత కుట్ర, మోసం, కల్తీ సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు..

తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎద్దు, పంది తదితర జంతువుల కొవ్వు కలిపిన నెయ్యిని లడ్డూ ప్రసాదం తయారీకోసం తిరుమలకు సరఫరా చేసిన వ్యవహారంలో తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై క్రిమినల్ కేసు నమోదైంది. టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్ పి.మురళీకృష్ణ బుధవారం ఈ సంస్థపై తిరుపతి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ఏఆర్ డెయిరీ సంస్థపై నేరపూరిత కుట్ర, మోసం, కల్తీ సహా పలు ఇతర సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సరఫరా చేసిన నెయ్యి నాసిరకంగా ఉందని, అందులో జంతువుల కొవ్వు ఆనవాళ్లు కూడా ఉన్నట్లు గుజరాత్‌కు చెందిన ఎన్‌డీడీబీ అనుబంధ లేబొరేటరీ పరీక్షల్లో వెల్లడైన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది శ్రీవారి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిన ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఈ మేరకు ఈ సంస్థపై టీటీడీ చర్యలకు ఉపక్రమించింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యతపై భక్తుల నుంచి అనేక ఫిర్యాదులు రావడంతో ఆవు నెయ్యి సేకరణ విధానం, నాణ్యత అంశాలను లోతుగా సమీక్షించామని తన ఫిర్యాదులో టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం జీఎం పి.మురళీకృష్ణ తెలిపారు. అనేక అంశాలు లడ్డూ ప్రసాదం నాణ్యత తగ్గడానికి కారణాలుగా గుర్తించినట్లు చెప్పారు. ముఖ్యంగా నెయ్యి సరఫరాదారులు నాసిరకం నెయ్యి సరఫరా చేస్తున్నారని టీటీడీ భావించిందని తెలిపారు. ఈ క్రమంలో నెయ్యి నాణ్యత పెంచాలని సరఫరాదారులకు నోటీసులిచ్చామన్నారు. టీటీడీ హెచ్చరికలతో మిగిలిన అన్ని సంస్థలూ నెయ్యి నాణ్యతను మెరుగుపరుచుకోగా, ఏఆర్ డెయిరీ మాత్రం తన పద్ధతిని మార్చుకోలేదని తన ఫిర్యాదులో ఆయన వివరించారు.

తిరుమల లడ్డూ వివాదం వెనుక బీజేపీ కుట్ర

ఆ పార్టీ డైరెక్షన్‌లోనే చంద్రబాబు మాట్లాడుతున్నారు

- టీడీపీ, వైసీపీకి కొట్లాట పెట్టి.. సీట్లు పెంచుకునే వ్యూహం
- ప్రత్యేక హోదా సాధించడంలో జగన్, చంద్రబాబు విఫలం
- ఏపీకి హోదా ఇచ్చేది, పోలవరం పూర్తయ్యేదీ రాహుల్‌తోనే
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఏపీ ప్రజలు బ్రహ్మరథం పడతారు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి



హైదరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వివాదం వెనుక బీజేపీ కుట్ర ఉందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి.. అనుమానం వ్యక్తం చేశారు. లడ్డూ కల్తీ అయిందన్న వివాదంలో వాస్తవాలు మరుగున పడి, రాజకీయ లబ్ధి, మత పరమైన అంశాలపైనే ఎక్కువగా చర్చ జరుగుతోందని అభిప్రాయపడ్డారు. వాస్తవాలను బయటపెట్టి, అలాంటి దోషాలు మళ్లీ జగరకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన ఏపీ సీఎం చంద్రబాబు.. దీన్ని జగన్‌కు ఆపాదిస్తూ రాజకీయం చేయడం, మతం ప్రస్తావన తీసుకురావడంతో తనకు వ్యక్తిగతంగా కొన్ని అనుమానాలు కలుగుతున్నాయన్నారు. చంద్రబాబును అడ్డుపెట్టుకొని బీజేపీ కొత్త ఆట మొదలుపెట్టినట్టుగా ఉందని బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఏపీ సీఎంగా జగన్ ఉన్నప్పుడు.. చంద్రబాబును అరెస్టు చేయించడాన్ని పార్టీలకు అతీతంగా తనలాంటి వాళ్లందరం తప్పుపట్టామని గుర్తు చేశారు. ఒక విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబును తాను గౌరవిస్తానని, హైదరాబాద్ అభివృద్ధిలో ఆయన భాగస్వామ్యం చాలా గొప్పదని కొనియాడారు. కానీ, సీఎంల నిర్ణయాల్లో తప్పులు వెతకడం మొదలుపెడితే ఏ సీఎం కూడా పని చేయలేడని అభిప్రాయపడ్డారు. "చంద్రబాబు రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనిది క్రిస్టియన్ అనే ప్రస్తావనను ఎందుకు పదే పదే తెస్తున్నారు? జగన్ క్రిస్టియన్ అన్నది జగమెరిగిన సత్యం. చంద్రబాబు మాట్లాడుతున్న మాటలు బీజేపీ డైరెక్షన్లో మాట్లాడుతున్నవేనని నా అనుమానం" అని తెలిపారు. సీఎంగా చంద్రబాబు ఉన్నా.. జగన్ ఉన్నా.. కల్తీ నెయ్యిని లడ్డూల్లో కలపాలని చెప్పబోరని పేర్కొన్నారు. తప్పు చేసిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడం చంద్రబాబుకు చాలా చిన్న పని అని, అలా చేస్తే ఈ వివాదం ముగిసిపోతుందని అభిప్రాయపడ్డారు. లడ్డూ వివాదం ద్వారా టీడీపీ, వైసీపీ మధ్య కొట్లాట పెట్టి.. మత విద్వేషాలను రెచ్చగొట్టాలని, తద్వారా వచ్చే ఎన్నికల్లో ఏపీ నుంచి ఎక్కువ ఎంపీ సీట్లు గెలవాలనేది బీజేపీ ప్లాన్‌గా కనబడుతోందని పేర్కొన్నారు. బీజేవైఎం కార్యకర్తలు జగన్ ఇంటిపై దాడి చేయడాన్ని బట్టి.. లడ్డూ వివాదాన్ని రాజకీయంగా వాడుకోవాలన్న ఆ పార్టీ కుట్ర స్పష్టమవుతోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించిందన్న కోపంతో అక్కడి ప్రజలు గత మూడు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేయలేదని తెలిపారు. కానీ.. భవిష్యత్తులో తమ పార్టీకి ఏపీ ప్రజలు బ్రహ్మరథం పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధనలో చంద్రబాబు, జగన్ విఫలమయ్యారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీ ప్రధాని అయి ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తారని, పోలవరం ప్రాజెక్టునూ పూర్తి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

హై'డ్రామా'లొద్దు..
హైదరాబాద్‌ను బాగుచేయండి

- బాధితులకు బీఆర్ఎస్ న్యాయ సహాయం
- మానవత్వం లేకుండా కూల్చేస్తున్నారు: కేటీఆర్



హైదరాబాద్ సిటీ/హైదర్‌నగర్/హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హై'డ్రామా'లు పక్కన పెట్టి హైదరాబాద్ బాగుచేసేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రభుత్వానికి సూచించారు. హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, పార్టీ లీగల్ సెల్ ద్వారా న్యాయపరమైన సహకారం అందిస్తామన్నారు. బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో బాధితులు సంప్రదించాలని పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్, ఖాజాకుంట వద్ద నిర్మించిన ఎస్‌టీపీలను మాజీ మంత్రులు సబిత, తలసాని, బీఆర్ఎస్ నగర ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించారు. అనంతరం కూకట్‌పల్లిలోని ఎమ్మెల్యే కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో విలేకరులతో, తెలంగాణభవన్‌లో హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన సందర్భంగానూ కేటీఆర్ మాట్లాడారు. హైడ్రా కూల్చివేతలు అన్యాయమంటూ మండిపడ్డారు. పేదల ఇళ్లను కూలుస్తూ నోటీసులిచ్చి పెద్దల నిర్మాణాలను ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు. దిక్కులేక, తెలిసీతెలియక నాలాలు, ఇతర ప్రాంతాల్లో గూడు నిర్మించుకున్న వారికి ఒక న్యాయం.. సీఎం అన్న, బడా బాబులకో న్యాయమా..? అని ప్రశ్నించారు. కనీసం సామాగ్రి తీసుకునే అవకాశం ఇవ్వకుండా అమానవీయంగా సర్కారు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హైడ్రా బాధిత పేదలు కస్తూరిబాయి, వేదశ్రీ కుటుంబాలను పరామర్శిస్తామని చెప్పారు. మంచి ఉద్దేశంతో పనిచేస్తే ప్రభుత్వానికి సహకరిస్తామని చెప్పారు, శని, ఆదివారాల్లో జరుగుతున్న కూల్చివేతలను హైకోర్టు సూమోటోగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకునే వాళ్లను వెండింగ్ జోన్లు ఏర్పాటు చేసి తరలించాలని, ఉన్నపళంగా ఉపాధి కోల్పోతే ఆ కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ అన్ని రంగాల్లో విఫలమైందని, జూనియర్ ఎన్టీఆర్ సినిమా ఫంక్షన్‌ను సజావుగా నిర్వహించలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కూకట్‌పల్లిలో ఉన్న హెచ్ఎండీఏ భూముల్లో 1000 ఎకరాలు అమ్మకానికి పెట్టారని తెలిసిందని, వచ్చిన డబ్బులు నగరంలో ఖర్చు చేయాలన్నారు. మూసీ పేరుతో జరుగుతున్న భాగోతాన్ని త్వరలో బయటపెడతామని ఆయన హెచ్చరించారు.

ఐటీ హబ్ కాదు.. వరంగల్‌ను గబ్బు చేయకుంటే చాలు

వరంగల్‌ను ఐటీ హబ్‌ను చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదమని.. వరంగల్‌ను గబ్బు చేయకుంటే చాలని కేటీఆర్ అన్నారు. తమ ప్రభుత్వంలో రూ.వేలకోట్లు కేటాయిస్తే.. వరంగల్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన అన్నదమ్ములు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని, మంత్రులు కూడా అదే దారిలో ఎక్కడికక్కడ దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హన్మకొండసహా.. పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఎందుకు ఓటమి చెందారో అర్థంకావడంలేదని, ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా.. ప్రజల్లో చెప్పుకోవడంలో విఫలమయ్యామని పేర్కొన్నారు. ఈ ఓటమికూడా తమకు మంచిదేనని, గాడిద ఉంటేనే గుర్రం విలువ తెలుస్తుందని వ్యాఖ్యానించారు. అవినీతికి పాల్పడుతున్న రేవంత్‌రెడ్డికి బీజేపీ రక్షణ కవచంలా ఉంటోందని ఆరోపించారు. కాగా, వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తలు నవీన్, ప్రవీణ్‌లపై స్థానిక ఎస్సై, పోలీసులు దాడి చేయడం తగదని, కాంగ్రెస్ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బాధితులు, పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. దాడికి కారణమైన ఎస్సై, పోలీసులను ప్రభుత్వం తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

నల్లగొండ జిల్లా మంత్రుల అరాచకాలు ఎండగడదాం

ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రులు అధికార అహంకారంతో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని, వారి అరాచకాలను ఎండగడదామని కేటీఆర్ పేర్కొన్నారు. బుధవారం మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నివాసంలో ఉమ్మడి నల్గొండ జిల్లా బీఆర్ఎస్ నేతలతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో పార్టీ బలోపేతం ప్రజలకు చేరువయ్యేందుకు పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఇతర అంశాలపై చర్చించారు. కాగా, ఎత్తు కుర్చీల్లో కూర్చోవడం కాదు.. కన్నెత్తి రైతులగోస చూడు అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ఎక్స్ వేదికగా సూచించారు.

వారొద్దంటే సర్కారు నడపడం మానేస్తారా?

- రాష్ట్ర ప్రభుత్వంతో పాటు హెచ్ఎండీఏ అధికారులపై హైకోర్టు ఆగ్రహం
- రామంతపూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్‌పై స్థానికులు సహకరించట్లేదనడంపై అసహనం



హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఉప్పల్ మండల పరిధిలోని రామంతపూర్ పెద్దచెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులు గుర్తిస్తూ తుది నోటిఫికేషన్ ఇవ్వడంలో అధికారులు విఫలమవడంపై హైకోర్టు డివిజన్ బెంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్వే చేయడానికి, హద్దులు గుర్తించడానికి ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టిన వారు సహకరించట్లేదని.. లాబీయింగ్ చేస్తున్నారంటూ ప్రభుత్వం, హెచ్ఎండీఏ వివరణ ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేసింది. వారు వద్దంటే ప్రభుత్వాన్ని నడపడం మానేస్తారా? అని ప్రశ్నించింది. పెద్దచెరువు ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై వచ్చిన అభ్యంతరాలన్నీ 3 వారాల్లో పరిష్కరించి ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాలని.. 6 నెలల్లో ఫెన్సింగ్, బండ్ నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాటు సహా అన్ని పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీలకు ఆదేశాలు జారీ చేసింది. రామంతపూర్ పెద్దచెరువు ఆక్రమణలకు గురికావడంపై 2005లో ఉస్మానియా యూనివర్సిటీ హిందీ డిపార్ట్‌మెంట్ అప్పటి హెడ్ డాక్టర్ కేఎల్ వ్యాస్ హైకోర్టుకు లేఖ రాశారు. దీన్ని సుమోటోగా స్వీకరించిన కోర్టు.. అప్పట్నుంచి విచారణ కొనసాగిస్తోంది. గత ఏడాది ఈ చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్ 30 ఎకరాలని పేర్కొంటూ అధికారులు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీచేశారు. ఈ నోటిఫికేషన్ తప్పని.. అధికారులు అక్రమంగా చుట్టుపక్కల కాలనీలను ఎఫ్‌టీఎల్‌లో చూపించి వేధిస్తున్నారంటూ ఆయా కాలనీల్లో నిర్మాణాలు చేపట్టిన యజమానులు దాదాపు 280 మంది ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యారు. ఈ పిటిషన్‌పై తాజాగా చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇంప్లీడ్ అయిన ప్రతివాదుల తరఫున న్యాయవాదులు వాదిస్తూ.. వరంగల్ హైవే పక్కన చెరువు ఉందని.. హైవే విస్తరణ, పూడిక కారణంగా చెరువు విస్తీర్ణం తగ్గిందని తెలిపారు. గతంలో 17ఎకరాలున్న ఎఫ్‌టీఎల్‌ను ఏ ఆధారం లేకుండా 30 ఎకరాలని ఓ ప్రైవేటు సంస్థ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధికారులు పేర్కొనడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్ ఖాన్, హెచ్ఎండీఏ న్యాయవాది కృష్ణారెడ్డి వాదిస్తూ.. ఎఫ్‌టీఎల్‌పై ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వలేదని.. గతంలో ఇచ్చింది కేవలం రిపోర్ట్ మాత్రమేనని చెప్పారు. ప్రతివాదులు సహకరించట్లేదని, హద్దులు గుర్తించకుండా అడ్డుకుంటున్నారన్నారు.

'హైడ్రా'కు 169 పోస్టుల మంజూరు

- ఇందులో 113.. పోలీసు విభాగం పోస్టులే
- డిప్యుటేషన్‌పై పోస్టుల భర్తీకి సర్కారు కసరత్తు

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ సంచలనంగా మారిన 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)'కు మొత్తం 169 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. పోలీస్, ఇరిగేషన్, ఫైర్, ప్లానింగ్, రెవెన్యూ, ఆర్థిక, పీసీబీ, అటవీ శాఖల అధికారులను డిప్యుటేషన్‌పై హైడ్రాకు పంపనుంది. ఈమేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు విభాగం నుంచి ఒక కమిషనర్ పోస్టు, రెండు అడిషనల్ కమిషనర్ పోస్టులతోపాటు డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ, ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ వంటి 113 పోస్టులు కేటాయించా. వీటితో పాటు ఎనలిటికల్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్, ప్లానర్లు, ఇంజనీర్లు, డిప్యూటీ కలెక్టర్, సర్వేయర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, శాస్త్రవేత్త(పీసీబీ), పీఆర్‌వో వంటి పోస్టులు మంజూరు చేశారు.

ఆయిల్‌పామ్ మిల్లుల స్థాపనలో వేగం పెంచండి

- గోద్రెజ్ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మిల్లుల స్థాపన పనులను వేగవంతం చేయాలని గోద్రెజ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ సంవత్సరంలో కనీసం 15,000 ఎకరాలపైన ఆయిల్‌పామ్ సాగు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని లక్ష్యాన్ని సాధించాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ప్రభుత్వం తరపున అవసరమైన మేర సహకారాన్ని అందిస్తామని వారికి హామీనిచ్చారు. బుధవారం సచివాలయంలో గోద్రెజ్ గ్రూప్ అధ్యక్షుడు రాకేశ్ స్వామి, గోద్రెజ్ ఆగ్రో వెట్ లిమిటెడ్ ఎండీ బలరాం సింగ్ యాదవ్, ఆయిల్‌పామ్ సీఈవో శ్రీ సౌగత నియోగీ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ మిల్లు నిర్మాణ పనులను వచ్చే నెల నుంచే ప్రారంభిస్తామని మంత్రికి కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం తమ కంపెనీ సాధించిన లక్ష్యాలు, ప్రగతిని వివరించారు.

తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కండి

- 'మైనెక్స్-24'లో అమెరికన్ కంపెనీలకు భట్టి పిలుపు



హైదరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిలో, ఫోర్త్ సిటీ నిర్మాణంలో భాగస్వాములు కావాలంటూ అమెరికాలోని పారిశ్రామిక, వ్యాపార సంస్థలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. అమెరికాలోని లాస్‌వేగాస్‌లో మంగళవారం ప్రారంభమైన అంతర్జాతీయ 'మైనెక్స్-2024'(మైన్ ఎక్స్‌పో)లో పలు అమెరికన్ కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిశ్రమల స్థాపన, పెట్టుబడులు, వ్యాపారాలకు హైదరాబాద్ అత్యంత అనువైన ప్రాంతమని, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తోందని వారికి వివరించారు. అమెరికా ప్రభుత్వ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న గ్లోబల్ మార్కెట్స్ సంస్థ సహాయ కార్యదర్శి అరుణ్ వెంకటరామన్ మాట్లాడుతూ ఇప్పటికే అమెరికాకు చెందిన పలు సంస్థలు హైదరాబాద్‌లో విజయవంతంగా వ్యాపారాలు నిర్వహించుకుంటున్నాయని, ఈ ఒరవడిని కొనసాగిస్తూ మరిన్ని సంస్థలు ముందుకు రావచ్చని పేర్కొన్నారు. నాలుగేళ్లకు ఒకసారి జరిగే ఈ అంతర్జాతీయ 'మైనెక్స్- 2024'లో ప్రపంచంలోని సుమారు 1,900 యంత్రఉత్పత్తి సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. 121 దేశాల నుంచి 44వేల మంది ప్రతినిధులు అందులో పాల్గొంటున్నారు.

16న సీఎం రేవంత్ కోర్టుకు రావాల్సిందే

- వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలి
- పరువు నష్టం కేసులో నాంపల్లి ప్రత్యేక కోర్టు ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ నాయకులు వేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో రేవంత్ ఐపీసీ 499, 153, 171సీ, 171జీ, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125 ప్రకారం అభియోగాలు ఎదుర్కొంటున్నారు. బుధవారం ఈ కేసు విచారణకు రాగా ముందుగా నిర్ణయించిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున కోర్టుకు రాలేకపోతున్నట్టు సీఎం రేవంత్ తరపున న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. గత నెల 21న ఆయన కోర్టుకు రాకపోవడంతో బుధవారం జరిగే విచారణకు తప్పకుండా రావాలని ఆదేశించినా హాజరు కాకపోవడంపై రేవంత్ తరఫు న్యాయవాదులను మేజిస్ట్రేట్ ప్రశ్నించారు. వచ్చే నెల 16వ తేదీన జరిగే తదుపరి విచారణకు కచ్చితంగా రావాల్సిందేనని, అలానే రూ.15వేల విలువైన రెండు వ్యక్తిగత పూచీకత్తు బాండ్లను కోర్టుకు సమర్పించాలని మేజిస్ట్రేట్ ఆదేశించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే 4వ తేదీన కొత్తగూడెం బహిరంగ సభలో రేవంత్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు ముగిశాక ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తుందని అసత్య వ్యాఖ్యలు చేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తెలిసిందే. అయితే ట్రయల్ కోర్టులో నాలుగుసార్లు కేసు వాయిదా పడడంతో వెంకటేశ్వర్లు హైకోర్టు మెట్లు ఎక్కగా జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి పిటిషన్‌ను కొట్టేసి నాంపల్లిలోని ప్రత్యేక కోర్టు ఫిర్యాదును పరిశీలించి, న్యాయం చేయాలని ఆదేశించారు.

అందోల్‌లో 48 చెరువుల పునరుద్ధరణ

హైదరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలో 48 చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతినిచ్చింది. చౌటకూర్ మండలంలో 2,069 ఎకరాలకు సాగు నీరు అందించే 25 చెరువుల పునరుద్ధరణకు రూ. 5.21కోట్లు, పుల్కల్ మండలంలో 1,672 ఎకరాలకు సాగునీరు అందించే 23 చెరువుల పునరుద్ధరణకు రూ.4.96 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం జీవో జారీ చేశారు.



సీఎంకు చెక్కును అందజేస్తున్న 'కిమ్స్' ఎండీ భాస్కర్ రావు

సీఎంఆర్‌ఎఫ్‌కు 'కిమ్స్' రూ.కోటి విరాళం

- రేవంత్‌కు చెక్కు అందించిన ఎండీ భాస్కర్

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధికి కిమ్స్ హాస్పిటల్ రూ.కోటి విరాళం ప్రకటించింది. సంబంధిత చెక్కును ఆస్పత్రి ఎండీ భాస్కర్‌రావు.. బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అందజేశారు. ఈయన వెంట సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఉన్నారు.

కృష్ణా బోర్డుకు రూ.7.4కోట్ల విడుదల

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది యాజమాన్య బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు విడుదల చేసింది. తన వాటాగా రూ.7.4 కోట్ల నిధులను బోర్డులో జమచేసింది. ఈ నిధులను విడుదల చేయాలని కోరుతూ ఇటీవలే నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కృష్ణాబోర్డు చైర్మన్ ప్రత్యేకంగా కలిసి, విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. ఈ మేరకు మంత్రి ప్రత్యేకంగా చొరవ తీసుకొని నిధులను విడుదల చేయించారు.

2 నెలల్లో మరో 35 వేల ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నారని, రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది నిరుద్యోగులు వీధిన పడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్య తీవ్రతను తమ ప్రభుత్వం గుర్తించి.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని గుర్తుచేశారు. డీఎస్సీ, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, తదితర ఉద్యోగాలన్నీ కలిపి మరో 35 వేల ఖాళీల భర్తీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందని.. ఇందుకు సంబంధించిన అన్ని చర్యలనూ ప్రభుత్వం తీసుకుంటోందని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలున్న యువతను తీర్చిదిద్ది, వారి ఉపాధికి భద్రత కల్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే బీఎఫ్‌ఎస్‌ఐ ప్రతినిధులతో చర్చలు జరిపామని, వారు ఇచ్చిన ప్రతిపాదనలతో ఈ వినూత్న కార్యక్రమం చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు డిగ్రీలో చేరినవారిలో పదివేల మంది డిగ్రీ విద్యార్థులు పట్టా పొందే నాటికి.. తగిన నైపుణ్యాలను నేర్చుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని.. 38 కాలేజీల్లో శిక్షణ పొందిన ఈ విద్యార్థులకు బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీస్, ఇన్సూరెన్స్ రంగంలో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. ఇందుకు అవసరమైన నిధులను ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఎక్విప్‌సంస్థ, ఈ కోర్సు సిలబస్‌ను రూపొందించిన బీఆర్‌ఎస్‌ఎఫ్ ప్రతినిధులను సీఎం అభినందించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.



సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొంగులేటి, సీఎస్ శాంతికుమారి

3 లక్షల మంది వస్తున్నా..

తెలంగాణలో ఏటా మూడు లక్షల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పొంది కాలేజీల నుంచి బయటకు వస్తున్నా.. పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో ఉద్యోగాలు పొందలేకపోతున్నారని సీఎం ఆందోళన వెలిబుచ్చారు. అదే సమయంలో అటు పరిశ్రమలు కూడా తగిన సాంకేతిక నైపుణ్యమున్న ఉద్యోగులు దొరక్క ఇబ్బంది పడుతున్నాయని.. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని చెప్పారు. అందులో భాగంగానే.. డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు వచ్చే ఏడాది నుంచి ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని కొన్ని ఇంజనీరింగ్ కళాశాల్లో విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలను నేర్పడం లేదని, వసతులు ఉండటం లేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాలలు ఇలాగే కొనసాగితే వాటి గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు. టాటా టెక్నాలజీస్ సహకారంతో ఐటీఐలను నవీకరించి 'అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు'గా మారుస్తున్నామని చెప్పిన సీఎం.. ఇప్పటికే మల్లేపల్లి ఐటీఐలో దీనికి సంబంధించి పైలెట్ ప్రాజెక్టు అమలు చేసినట్లు వివరించారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని అన్ని ఐటీఐలనూ ఏటీసీలుగా మారుస్తామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసి తెలంగాణను దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివి, ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థల చీఫ్‌లుగా ఎదిగిన సత్య నాదేళ్ల, అజీమ్ ప్రేమ్‌జీ, శంతను నారాయణ, అజయ్ బంగా (ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు) తదితర ప్రముఖులతో డిసెంబర్‌లో ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రానున్న కొద్ది సంవత్సరాల్లో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాల్లో ఐదు లక్షల మంది దాకా.. శిక్షణ పొందిన అభ్యర్థుల అవసరం ఉంటుందని చెప్పారు. ఆయా ఖాళీల భర్తీకి నైపుణ్యం కలిగిన వారిని తయారు చేయగలిగితే రాష్ట్రంలో భారీగా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. కాగా..ఎక్విప్ సంస్థ ప్రతినిధులు రూ.2.5కోట్ల చెక్కును రేవంత్‌రెడ్డికి అందజేశారు. విద్యార్థుల డేటాతో రూపొందించిన ఎక్విప్ స్కిల్ పోర్టల్‌ను సీఎం ఆవిష్కరించారు. కాగా, ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ రేవంత్‌రెడ్డిని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.



గేయ రచయిత చంద్రబోస్‌ను సన్మానిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో పొంగులేటి, పొన్నం, మహేశ్‌గౌడ్

తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలిసారి జలసౌధకు సీఎం

- కొత్త ఏఈఈలకు నేడు నియామక పత్రాలు ఇవ్వనున్న రేవంత్

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి జలసౌధలో ముఖ్యమంత్రి అడుగుపెట్టనున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో నీటిపారుదల రంగంపై రూ.1.80లక్షలకోట్లు వెచ్చించినా.. ఏ రోజూ జలసౌధ వైపు కేసీఆర్ కన్నెత్తిచూడలేదు. ఇందులో ఐదేళ్లపాటు నీటిపారుదలశాఖ ఆయన వద్దే ఉండటం గమనార్హం. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి గురువారం జలసౌధకు రానుండడంతో సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీజీపీఎస్సీ నియామక ప్రక్రియలో ఎంపికైన 677 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఏఈఈ)లకు సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందించనున్నారు. ఈ మేరకు ఎంపికైన అభ్యర్థులందరూ గురువారం సాయంత్రం 4 గంటల కల్లా జలసౌధ కార్యాలయానికి చేరుకోవాలని ఈఎన్‌సీ(అడ్మిన్) జి.అనిల్‌కుమార్ కోరారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 1800 మంది లష్కర్ల నియామకంపై సీఎం రేవంత్, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ప్రకటన చేయనున్నట్లు తెలిసింది. అనంతరం కేఆర్‌ఎంబీ, జీఆర్‌ఎంబీ చైర్మన్లతో సీఎం కాసేపు భేటీ కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రాధాన్యం కలిగిన ప్రాజెక్టులపై సమీక్షించనున్నారు. ఆ తర్వాత పూడికతీతపై జాతీయ పాలసీని అన్వయం చేసుకునే అంశంపై నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

- దసరా నాటికి పథకం అమలుకు కమిటీలు
- విధివిధానాలు రూపొందించండి
- రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయండి
- హౌసింగ్ శాఖపై సమీక్షలో సీఎం

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికే ఇందిరమ్మ ఇల్లు దక్కాలని, పథకం అమలుకు వీలుగా.. దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గ్రామం, వార్డు, మండలం, పట్టణం, నియోజకవర్గం, జిల్లా స్థాయి వరకూ కమిటీలను ఏర్పాటుచేసేందుకు విధివిధానాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ఆవాస యోజన (పీఎంఏవై)పథకం నుంచి ఇతర రాష్ట్రాలు లక్షల సంఖ్యలో గృహాలను మంజూరు చేయించుకుంటుంటే.. తెలంగాణ మాత్రం ఈ విషయంలో వెనుకబడి ఉందన్నారు. ఈ దఫా పీఎంఏవై నుంచి రాష్ట్రానికి గరిష్ఠ సంఖ్యలో ఇళ్లను సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సమాచారాన్ని వెంటనే ఇవ్వడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. పీఎంఏవై నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలను కూడా రాబట్టాలని సూచించారు. అయితే.. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తే ఇంజినీరింగ్ సిబ్బంది సమస్య ఎదురయ్యే అవకాశం ఉంటుందని అధికారులు సీఎంకు తెలిపారు. దీనికి రేవంత్.. అవసరమైతే ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు చేపట్టాలన్నారు. నిర్మాణం పూర్తయి, నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహల్లోని బ్లాక్‌లు, ఇళ్లను కూడా వేలం వేయాలని అధికారులకు సూచించారు. ఏళ్ల తరబడి వాటిని వృథాగా ఉంచడం సరికాదని, వెంటనే వేలానికి రంగం సిద్ధం చేయాలన్నారు. డబుల్ బెడ్రూమ్ పథకంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా, వాటిని లబ్ధిదారులకు ఎందుకు అప్పగించలేదని ప్రశ్నించిన సీఎం.. అర్హులైన వారికి ఆ ఇళ్లను అప్పగించాలన్నారు. నిరుపయోగంగా ఉన్న 'డబుల్' ఇళ్ల బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, వాటిని అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలని ఆదేశించారు.

ఐదేళ్లలో పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి



ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో జూపల్లి, మల్లు రవి తదితరులు

(మొదటిపేజీ తరువాయి)

పెండింగ్‌లో ఉన్న ఎత్తిపోతల పథకాలన్నీ పూర్తి చేస్తాం" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఉదండాపూర్, గట్టు, నార్లాపూర్, శంకరసముద్రం రిజర్వాయర్లను మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం నాగర్‌కర్నూల్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలమూరు- రంగారెడ్డి నిర్మాణం కోసం రూ. 27,500కోట్లు ఖర్చు చేసినా.. ఒక్క ఎకరాకూ నీరు అందించలేకపోయిందని విమర్శించారు. పదేళ్లుగా కృష్ణానదిలో నీటి వాటాను కూడా సాధించలేకపోయారని ఎద్దేవా చేశారు. పాలమూరు- రంగారెడ్డి కింద 12 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రస్తుత టర్మ్‌లోనే స్థిరీకరిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ పనులను దశాబ్దకాలంగా పడావు పెట్టారని, ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరివ్వలేని పరిస్థితి ఉందని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్షలు నిర్వహిస్తున్నామని, అన్ని ప్రాజెక్టులను పూర్తిచేయడానికి కావాల్సిన నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తామని ప్రకటించారు. లక్ష ఎకరాలకు నీరిచ్చే శంకరసముద్రం రిజర్వాయర్‌ను గత ప్రభుత్వం అశ్రద్ధ చేసిందని, ఎన్ని నిధులు ఖర్చు చేస్తే ఎంత అదనపు ఆయకట్టుకు నీరందిచవచ్చో వారంలోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌ఆర్, పునరావాస కాలనీ సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చిరు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీలను అరికట్టి, నిల్వ సామర్థ్యం పెంచుతామని తెలిపారు. కర్ణాటక భాగస్వామ్యంతో గట్టు రిజర్వాయర్ సామర్థ్యం పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్డీఎస్ సమస్యను పరిష్కరించడంతోపాటు మల్లమ్మకుంట రిజర్వాయర్‌ను నిర్మిస్తామని వెల్లడించారు. సీఎం సొంత జిల్లాలోని ప్రాజెక్టులను ఫాస్ట్ ట్రాక్ విధానంలో పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నీటిపారుదల, ఆర్థిక శాఖ సమన్వయంతో ఎక్కడెక్కడ నిధులు వెచ్చించాలో పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తామని, ఆ ప్రకారం పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గద్వాల జిల్లాకు 18 టీఎంసీల కేటాయింపులుంటే 6 టీఎంసీలూ వాడుకోలేని దుస్థితి ఉందని తెలిపారు. గద్వాల నియోజకవర్గంలో 15-20 టీఎంసీల రిజర్వాయర్‌ను నిర్మించాలని ఉత్తమ్‌ను కోరారు. అలాగే, శంకరసముద్రం రిజర్వాయర్ ద్వారా లక్ష ఎకరాలకు నీరందించవచ్చని, కొన్ని సమస్యల వల్ల కుదరడం లేదన్నారు. ఇన్‌టేక్‌వెల్‌లో బండను తొలగించి వెడల్పు చేస్తే ఎక్కువ నీటిని ఎత్తిపోయవచ్చన్నారు. కాగా, ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద మంగళవారం రాత్రి రూ.45కోట్లు విడుదల కాగా, ఒక్కొక్కరి ఖాతాలో రూ.16.30 లక్షల చొప్పున డిపాజిట్ అయ్యాయి. అయితే.. రూ.25లక్షల పరిహారం ఇవ్వాలంటూ బాధితులు మంత్రుల పర్యటనలో నిరసన తెలిపారు.

2400 సర్కారీ డాక్టర్ కొలువులు

- భర్తీకి 45 రోజుల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశం
- 612 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పది రోజుల్లో ప్రకటన
- మెడికల్ బోర్డు కసరత్తు

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను మెరుగుపర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా వైద్యులు, వైద్య సిబ్బంది నియామకంపై ప్రత్యేక దృష్టి సారించింది. కొద్ది నెలల క్రితం 435 మంది వైద్యుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం త్వరలో మరో 2,400 మంది వైద్యులను భర్తీ చేయనుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ 45 రోజుల్లో వెలువడే అవకాశముంది. మరోపక్క, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 612 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు పది రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయనుంది. దసరాలోపే ఈ నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. అలాగే, వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 1600 మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్టు) పోస్టుల భర్తీకీ రంగం సిద్ధమవుతోంది. ఆర్థిక శాఖ ఆమోదం లభించిన తర్వాత ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడనుంది. దీంతో పాటు ఈఎస్‌ఐ డిస్పెన్సరీల్లో ఖాళీగా ఉన్న 200కు పైగా వైద్యుల పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైలు కూడా ప్రస్తుతం ఆర్థిక శాఖ వద్ద ఉంది. కాగా, ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో 435 వైద్యుల పోస్టుల భర్తీకి జూన్ 28న మొదలైన ప్రక్రియ తుది దశకు చేరింది. సంబంధిత మెరిట్ జాబితా, సెలక్షన్ లిస్ట్ దసరా లోపే విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే ఈఎస్‌ఐ డిస్పెన్సరీల్లో ఖాళీగా ఉన్న 200 డాక్టర్ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపితే ఆ పోస్టులను ఇప్పటికే ఇచ్చిన 435 వైద్య పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో కలిపివేయనున్నారు. మొత్తం 635 పోస్టులను చూపించి మెరిట్ ఆధారంగా జాబితాను విడుదల చేయనున్నారు.

15 రోజుల్లో 3967 పోస్టులకు నోటిఫికేషన్

మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు గత 15 రోజుల్లో 3,967 వేర్వేరు పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చింది. ఇందులో 1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు, 2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు, 633 ఫార్మసిస్టు కొలువులు ఉన్నాయి. ఇవికాక, 1,666 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫీమేల్), 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్, 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్, 24 ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోంది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఇప్పటికే 643 మంది టీచింగ్ ఫ్యాకల్టీని కాంట్రాక్టు పద్ధతిలో ఇటీవలే తీసుకున్నారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలకు సంబంధించిన 7,308 వేర్వేరు పోస్టులు భర్తీ అయ్యాయి.


మాపై కేసులను ఎత్తేయండి

- గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడినందుకు కేసులు
- ఇంకా కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం
- మంత్రి దామోదరకు కార్యకర్తల వినతి
- గాంధీభవన్‌లో 'మంత్రితో ముఖాముఖి'
- 285 దరఖాస్తులు తీసుకున్న మంత్రి
- 30విజ్ఞప్తులకు అప్పటికప్పుడే పరిష్కారం
- నిరంతరం కొనసాగిస్తాం: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): "పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశాం. ప్రతిగా ఆ ప్రభుత్వం మాపై కేసులు పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి పది నెలలు గడిచినా.. ఇంకా పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం. బీఆర్‌ఎస్ హయాంలో మాపై పెట్టిన కేసులను ఎత్తివేయండి" అంటూ పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, వివిధ ప్రజాసంఘాల నేతలు మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించుకున్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితుల కోసం ధర్నాలు, పోరాటాలు చేసిన తాము ఇప్పటికీ ఆ కేసులను ఎదుర్కొంటున్నామని గజ్వేల్‌కు చెందినవారు మంత్రి దృష్టికి తెచ్చారు. గాంధీభవన్‌లో బుధవారం ప్రారంభమైన 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి ఈ మేరకు మొర పెట్టుకున్నారు. కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం వారానికి రెండు రోజుల చొప్పున మంత్రులతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తొలిరోజు పెద్దసంఖ్యలో నేతలు, కార్యకర్తలు వచ్చారు. వారి నుంచి ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు మంత్రి విజ్ఞాపనలు స్వీకరించారు. ప్రజలు మంత్రిని కలిసేందుకు ఇందిరాభవన్‌లో తగిన ఏర్పాట్లు చేశారు. మహిళలు, దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసి విజ్ఞాపనలు స్వీకరించారు. తొలి రోజున 285కు పైగా విజ్ఞాపనలు వచ్చాయి. వీటిలో 30 మంది సమస్యలపై మంత్రి దామోదర అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించారు. ఇక దరఖాస్తులన్నింటినీ గాంధీభవన్ సిబ్బంది శాఖలవారీగా నమోదు చేశారు. వాటికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ లేఖలనూ జత చేసి సదరు శాఖల మంత్రులకు పంపించనున్నారు. దరఖాస్తుల్లో ఆరోగ్య సమస్యలు, భూ వివాదాలు, బీఆర్‌ఎస్ హయాంలో పెట్టిన కేసులు, ఉద్యోగాలు, వైద్య సేవలు వంటివి ఉన్నాయి. జీవో 317 బాధితులు కూడా వచ్చి మంత్రి వద్ద తమ గోడు వినిపించారు.

ప్రక్రియ కొనసాగుతుంది..

కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తనూ గౌరవిస్తుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇందులో భాగంగానే గాంధీభవన్‌లో వారానికి రెండు రోజులు మంత్రితో ముఖాముఖి కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ప్రశాంతంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ప్రజల సమస్యలు విన్నవారే లేరని, ఇప్పుడు తాము ప్రజలకు సమయం ఇచ్చి వారి సమస్యలను తెలుసుకుంటున్నామని అన్నారు. గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అద్భుతమైన ఆలోచన అని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు అనే తేడా లేకుండా అందరి అర్జీలు తీసుకొని పరిష్కరిస్తామన్నారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, ఈ కార్యక్రమం ద్వారా పార్టీకి, ప్రభుత్వానికి మంచి జరుగుతుందన్నారు. ఓవర్ నైట్ లో సమస్యలు పరిష్కారం అవుతాయని తాము అనుకోవట్లేదని, ఒక్కొకటిగా చేస్తూ అన్నీ పరిష్కరిస్తామన్నారు. ఇదిలా ఉండగా.. గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి పేరుతో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు కానుంది. శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిని ప్రారంభిస్తారని టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ వినోద్‌కుమార్ తెలిపారు.



గాంధీభవన్‌లో కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి దామోదర, మహేశ్‌గౌడ్

ఉత్తరాదిపై తెలుగు వారి ప్రభావమే ఎక్కువ

సాహిత్య అకాడమీ సదస్సులో ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి కృష్ణారావు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది ప్రభావం తెలుగువారిపై పడకముందే తెలుగువారు ఉత్తరాదిపై ప్రభావం చూపారని ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి ఎ. కృష్ణారావు అన్నారు. ఉత్తరాదిపై తెలుగు వారి ప్రభావమే ఎక్కువని ఆయన చెప్పారు. బుధవారం ఢిల్లీలో హిందీ- ఇతర భారతీయ భాషలు అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. గాథా సప్తశతిని రచించించిన హాలుడు, బృహత్కథా మంజరిని రచించిన గుణాఢ్యుడు తెలుగు వారేనని చెప్పారు. భక్తి యుగం తెలుగు నాట నుంచే ఉత్తరాదికి వ్యాప్తి చెందిందని, వల్లభాచార్యులు శ్రీకృష్ణ లీలలపై సూరదాసును ప్రభావితం చేశారని తెలిపారు. తులసీదాస్ రామచరిత మానస్ రచించకముందే భాస్కర, రంగనాథ రామాయణాలు తెలుగులో వచ్చాయని అన్నారు. తెలుగువాడైన రామానుజుడి విశిష్టాద్వైత ప్రభావం ఉత్తరాదిన ఎంతో ఉందని, హిందీలో వర్ధిల్లిన అన్ని భాషా సాహిత్య ఉద్యమాలు తెలుగునాట ముందే జరిగాయని తెలిపారు. మోటూరి సత్యనారాయణ, ఆలూరి బైరాగి, ఆదేశ్వరరావు, ఇలపావులూరి పాండురంగారావు, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, అరికపూడి రమేశ్ చౌదరి వంటి అనేక మంది తెలుగు వారు హిందీ భాషకు చేసిన సేవను కృష్ణారావు ఈ సందర్భంగా వివరించారు.

జీఎస్టీ కుంభకోణం కేసులో రంగంలోకి ఈడీ..!

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో వెలుగుచూసిన వస్తు సేవల పన్ను(జీఎస్టీ) కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వందల కోట్ల రూపాయలు దారి మళ్లడంతో మనీలాండరింగ్ కోణంలో విచారణ జరిపేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు అందజేయాలని ఇప్పటికే వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు హైదరాబాద్ ఈడీ అధికారులు ఈ-మెయిల్ పంపారు. ఒకటి, రెండు రోజుల్లో ఈడీ కోరిన సమాచారాన్నంతా వాణిజ్య పన్నుల శాఖ అధికారులు అందజేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు వందల కోట్ల కుంభకోణం, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ నిందితుడిగా ఉన్న కేసును సీఐడీ విచారణ జరుపుతోంది. దీంతో సీఐడీ వద్ద ఉన్న సమాచారం పొందేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈమేరకు సీఐడీకి ఈ-మెయిల్ పంపి వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలిసింది. వాణిజ్య పన్నుల శాఖ ఇచ్చే సమాచారం, సీఐడీ అందించే కేసు వివరాలు, దర్యాప్తు అంశాల ఆధారంగా అవసరమైతే ఈడీ ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి నోటీసులు జారీ చేసి విచారించే అవకాశం ఉంది.

కవిత కేసు విచారణ అక్టోబరు 4కు వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సీబీఐ దాఖలు చేసిన సప్లమెంటరీ చార్జిషీట్‌పై విచారణను రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి వాయిదా వేసింది. కవితతోపాటు మరో నలుగురిపై అభియోగాలు మోపుతూ సీబీఐ జూన్ 7న సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసింది. జూలై 22న ఆ చార్జిషీట్‌ను కోర్టు పరిగణలోకి తీసుకుంది. దీనిపై ఇరుపక్షాల వాదనలు జరుగుతుండగా బుధవారం ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా చార్జిషీట్ పై విచారణ నిర్వహించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోర్టు విచారణకు వర్చువల్‌గా హాజరయ్యారు. అయితే.. చార్జిషీట్‌లో పేజీలు సరిగా లేవని, కొన్ని పేజీల్లో అక్షరాలు స్పష్టంగా లేవని కవిత తరపు న్యాయవాది మోహిత్ రావు న్యాయమూర్తికి తెలిపారు. మోహిత్ రావుతో ఏకీభవించిన న్యాయమూర్తి.. చార్జిషీట్ ను సరైన పద్ధతిలో ఫైల్ చేసి కాపీని అందజేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను అక్టోబరు 4కు వాయిదా వేస్తున్నట్టు న్యాయమూర్తి వెల్లడించారు.

వరంగల్ బల్దియాకు మరో గుర్తింపు

» నైబర్ హుడ్ చాలెంజ్‌లో టాప్-5లో స్థానం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు మరో గుర్తింపు దక్కింది.. గతంలో స్మార్ట్ సిటీ అవార్డును సొంతం చేసుకున్న వరంగల్ బల్దియాకు ఇప్పుడు నైబర్ హుడ్ చాలెంజ్‌లో ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్ లభించింది. కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ) ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో స్మార్ట్‌సిటీ నగరాలకు సంబంధించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. మూడేళ్లుగా నిర్వహిస్తున్న నైబర్ హుడ్ చాలెంజ్(ఎన్ఎన్‌సీ)కు సంబంధించి దేశంలోని పది నగరాలకు గుర్తింపు ఇచ్చారు. అందులో వరంగల్ టాప్-5లో నిలిచింది. దాంతో కేంద్రం వరంగల్ బల్దియాకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందించింది. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా ఆ సర్టిఫికెట్‌ను స్వీకరించినట్టు ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర తెలిపారు.

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ గండి పూడ్చివేత

హుజూర్‌నగర్, సెప్టెంబరు 25: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలోని సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం సమీపంలో 132వ కిలోమీటరు వద్ద గండిని అధికారులు పూడ్చివేశారు. ఈ నెల 1వ తేదీన భారీ వర్షాలకు ఎడమ కాల్వకు గండి పడగా 25 రోజుల పాటు శ్రమించిన అధికారులు ఎట్టకేలకు గండి పూడ్చివేత పనులు పూర్తి చేశారు. ప్రొటెక్షన్ కోసం 70శాతం ఇసుక బస్తాలను పేర్చారు. సాయంత్రం 6 గంటలకు మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. ఎన్ఎస్‌పీ చీఫ్ ఇంజనీర్ రమేష్ బాబు, ఇతర ఉన్నతాధికారులు రెగ్యులేటర్ నుంచి సుమారు 600 క్యూసెక్కుల నీటిని ఎడమ కాలువకు విడుదల చేశారు. క్రమంగా నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచుతామని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని నాయకన్‌గూడెం వద్ద నీటి సరఫరా చేసేందుకు పనులు పూర్తికాకపోవడంతో 134వ కిలోమీటరు వద్ద 10 అడుగుల కాంక్రీట్ గోడను నిర్మించారు. దీంతో పాలేరు రిజర్వాయర్‌కు నీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా ఏర్పాటు చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొన్నారు.

అధికారులు వేధిస్తున్నారంటూ.. గ్రామ సంఘం సహాయకురాలు ఆత్మహత్యాయత్నం

చౌదరిగూడ, సెప్టెంబరు 25: సహాయ ప్రాజెక్టు అధికారి (ఏపీఎం), కమ్యూనిటీ కో ఆర్డినేటర్ (సీసీ) తనను వేధిస్తున్నారని పేర్కొంటూ ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) కేంద్రంలో ఓగ్రామ సంఘం సహాయకురాలు ఆత్మహత్యకు యత్నించింది. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం జాకారం గ్రామంలో మూడేళ్లుగా గ్రామ సంఘం సహాయకురాలిగా పనిచేస్తున్న స్వప్న పలుమార్లు ఆన్‌లైన్‌లో తన పేరు నమోదు చేయాలని ఏపీయం నరసింహ, సీసీ స్వర్ణలతకు విజ్ఞప్తి చేసింది. వారు స్పందించకపోవడంతో ఈ నెల 24న అదనపు ప్రాజెక్టు అధికారి సూర్యారావుకు ఫిర్యాదు చేసింది. ఆయన ఆ ఫిర్యాదు పత్రాన్ని ఏపీయం, సీసీలకు ఇవ్వడంతో వారు స్వప్నపై ఆగ్రహాన్ని వ్యక్తం చూస్తూ అవమానించేలా మాట్లాడారు. దాంతో స్వప్న బుధవారం పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలోకి చేరుకున్న ఆమెను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

వరల్డ్ టాప్-100 బిజినెస్ స్కూల్స్‌లో ఐఎస్‌బీకి చోటు

» జాబితాలో భారత్ నుంచి మూడు ఐఐఎంలు

» 58.3 స్కోర్‌తో హైదరాబాద్‌లోని ఐఎస్‌బీకి 86వ స్థానం

హైదరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అత్యుత్తమ బిజినెస్ స్కూల్స్ జాబితాలో హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)కి చోటు లభించింది. కోర్సులు, బోధన, ఉపాధి అవకాశాలు వంటి పలు అంశాల ఆధారంగా వరల్డ్ యూనివర్సిటీ గ్లోబల్ ర్యాంకింగ్స్‌ను క్యూఎస్ సంస్థ విడుదల చేసింది. భారత్ నుంచి టాప్-100లో నాలుగు బిజినెస్ స్కూల్స్ చోటు సాధించాయి. అందులో 67.4 స్కోర్‌తో 53వ స్థానంలో ఐఐఎం బెంగళూరు, 63.3 స్కోర్‌తో 60వ స్థానంలో ఐఐఎం అహ్మదాబాద్, 62.6 స్కోర్‌తో 65వ స్థానంలో ఐఐఎం కోల్‌కతా, 58.3 స్కోర్‌తో హైదరాబాద్‌లోని ఐఎస్‌బీ 86వ స్థానంలో నిలిచింది. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ స్కూల్ ఆఫ్ బిజినెస్ 100శాతం స్కోర్‌తో వరుసగా ఐదోసారి అగ్రస్థానంలో నిలిచింది. అమెరికాకే చెందిన ఫిలడెల్ఫియాలోని పెన్ వార్టన్ బిజినెస్ స్కూల్ 99.8 స్కోర్‌తో రెండోస్థానం, కేంబ్రిడ్జిలోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్ 99.4తో మూడోస్థానం, కేంబ్రిడ్జిలోని ఎంఐటి స్లోన్ స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ 99.2 స్కోర్‌తో నాలుగోస్థానం, లండన్ బిజినెస్ స్కూల్ 98.8తో ఐదోస్థానంలో నిలిచాయి.

బ్యాంకర్లూ బాధ్యులే?

» కూల్చివేతల నేపథ్యంలో హైడ్రా యోచన

» సాంకేతిక, న్యాయపరమైన అంశాలు పట్టించుకోకుండా రుణాలు

» త్వరలో బ్యాంకర్లతో రంగనాథ్ భేటీ

» బాధితులకు న్యాయం చేసేలా చర్యలు?

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలు, చెరువుల పరిరక్షణకు హైడ్రా బహుముఖ వ్యూహం అమలు చేస్తోంది. స్థలాల యాజమాన్యపు హక్కులు, అనుమతులు, ఇతరత్రా విషయాలకు సంబంధించి సాంకేతిక, న్యాయపరమైన అంశాలను పట్టించుకోకుండా రుణాలు ఇచ్చినందుకు బ్యాంకర్లనూ బాధ్యులను చేయాలని హైడ్రా భావిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేసిన, అందుకు సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అంశాన్నీ పరిశీలిస్తున్నారు. అదే సమయంలో రుణాల చెల్లింపులో బాధితులకు ఉపశమనం కలిగించే విషయంపైనా దృష్టి సారించనున్నారు. ఇందులో భాగంగా త్వరలో రుణాలు మంజూరు చేసిన సంస్థల ప్రతినిధులతో కమిషనర్ రంగాథ్ సమావేశం కానున్నారు. ఆయా అంశాలపై ప్రభుత్వంలోని ఉన్నతాధికారులతో చర్చించడంతోపాటు.. న్యాయపరమైన సలహాలు తీసుకున్న తర్వాత ముందుకు సాగాలని భావిస్తున్నట్లు తెలిసింది.

అనుమతులు రద్దు చేశాక లోన్లు

ఇళ్లు, ఫ్లాట్ల నిర్మాణాలకు సంబంధించి రుణాలు ఇచ్చే సమయంలో బ్యాంకర్లు అన్ని అంశాలను పరిశీలించాలి. స్థలం యాజమాన్యపు హక్కులు, సంబంధిత సంస్థల నుంచి అనుమతులున్నాయా? అవి అన్నీ సక్రమంగా ఉన్నాయా? లేవా? అన్నది చూడాలి. ఇందుకోసం క్షేత్రస్థాయి బృందాలు.. న్యాయపరమైన అభిప్రాయం తీసుకునేందుకు బ్యాంకులకు లీగల్ టీమ్‌లు ఉంటాయి. అమీన్‌పూర్‌లో ఇటీవల జరిగిన కూల్చివేతలకు సంబంధించి గత జూలైలోనే అనుమతులను మునిసిపాలిటీ రద్దు చేసింది. అయినా.. రియల్ వ్యాపారులతో కుమ్మక్కైన పలు రుణ సంస్థల ప్రతినిధులు అన్నీ సక్రమంగా ఉన్నట్లు నివేదిక పంపి లోన్ మంజూరుకు సిఫారసు చేసినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. లోన్ వస్తుందన్న ఉద్దేశంతో పౌరులు విల్లాలు కొనుగోలు చేశారు. పార్కు స్థలంలో అనుమతులిచ్చి రద్దు చేసిన మునిసిపల్ అధికారులు మొదట తప్పు చేస్తే.. రియల్ వ్యాపారులతో కుమ్మక్కై రుణ సంస్థల ప్రతినిధులూ అంతే పొరపాటు చేశారని హైడ్రా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ క్రమంలోనే బ్యాంకర్లనూ బాధ్యులను చేసే విషయాన్ని పరిశీలిస్తున్నారు. రుణం మంజూరు చేసిన సంస్థలు మార్ట్‌గేజ్ చేసుకున్న నిర్మాణాలు నేలమట్టమయ్యాయి. స్థలాలు సర్కారువని తేలిన నేపథ్యంలో ఏ ఆధారంతో బ్యాంకర్లు రుణం వసూలు చేస్తారనే విషయంపైనా నిపుణులతో హైడ్రా అధికారులు చర్చిస్తున్నారు. బాధితులు రుణం చెల్లించకుండా ఉండే అవకాశముందా? అన్న దానిపై న్యాయ సలహాలు తీసుకోనున్నట్లు తెలిసింది.

రైస్ మిల్లర్ భూమి వేలం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారికి చెందిన భవనాన్ని రూ.2.2 కోట్లకు, స్థలాన్ని రూ.40 లక్షలకు పలువురు వేలంలో విక్రయించారు. అదే వ్యాపారికి మాదాపూర్, లింగాపూర్ పరిధిలో ఉన్న ఎకరా 31 గుంటల భూమికి బుధవారం వేలం జరిగింది. కాగా, ఆస్తుల వేలం ద్వారా వచ్చిన సొమ్మును సదరు రైస్‌మిల్లర్ చెల్లించాల్సిన బకాయిలో జమ చేస్తామని అధికారులు తెలిపారు.



ఖమ్మం జిల్లా లాలాపురంలోని రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

లాలాపురం, మానుకోటలోని మిల్లుల్లో దాడులు

సీఎంఆర్ బకాయిల అంశంలో సివిల్ సప్లయ్స్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని రైస్ మిల్లుల్లో అధికారులు బుధవారం దాడులు చేశారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలోని ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లులో రెండ్రోజులు పాటు చేపట్టిన తనిఖీల్లో సీఎంఆర్‌లో 25వేల టన్నుల ధాన్యం వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించి మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. 2022-23 రబీ సీజన్, 2023-24 ఖరీఫ్ సీజన్లకు గాను ఎస్ఏఆర్ మిల్లుకు 3,50,622.65 క్వింటాళ్ల ధాన్యాన్ని అప్పగించగా 99,122.68 క్వింటాళ్లను మాత్రమే మర ఆడించారని, మిగిలిన 2,51,499.97 క్వింటాళ్లు తేడా ఉందని అధికారులు పేర్కొన్నారు. ఆ ధాన్యాన్ని బయటకు తరలించడంతో మిల్లర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు. అయితే, అధికారులు తేల్చిన వ్యత్యాసాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తామని మిల్లు యజమాని చెప్పారు. మరోపక్క, మహబూబాబాద్ శివారులోని సాయి శ్రీనివాస్, శ్రీనివాస ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులపై అధికారులు బుధవారం దాడులు జరిపారు. ఈ రైస్ మిల్లులకు 88,096 క్వింటాళ్ల ధాన్యాన్ని ఇవ్వగా 59వేల క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 3,770 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చారని అధికారులు తెలిపారు. దీంతో కొద్ది రోజుల క్రితం ధాన్యం టెండర్లు పిలవగా ఈ మిల్లుల్లో ఉన్న రూ.2.52 కోట్ల విలువైన ధాన్యాన్ని ఓ కాంట్రాక్టర్ వేలంలో దక్కించుకున్నారని చెప్పారు. కానీ, రెండు మిల్లులతో పాటు కాంట్రాక్టర్‌కు చెందిన గోదాముల్లో ఉండాల్సిన 82వేల ధాన్యం బస్తాలుకు గాను 54 వేల బస్తాలే ఉన్నట్టు తనిఖీల్లో గుర్తించామని వివరించారు. తక్కువగా ఉన్న ధాన్యం బస్తాలకు కాంట్రాక్టర్‌దే బాధ్యతని పేర్కొన్నారు.

బిడ్డర్లకు మరో 3 నెలల గడువు!

ఇంకా రైస్ మిల్లుల్లోనే 25 లక్షల టన్నుల 'టెండర్' ధాన్యం..

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేలంలో బిడ్డర్లు దక్కించుకున్న 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన సొమ్ము రికవరీ నత్త నడకన సాగుతోంది. ఇప్పటికే 9 నెలల గడువు ఇచ్చినా కాంట్రాక్టు ఏజెన్సీలు ధాన్యం లిఫ్టింగ్ పూర్తి చేసి పౌరసరఫరాల సంస్థకు డబ్బులు చెల్లించకపోవటంతో.. తాజాగా మరో 3 నెలల గడువు ఇచ్చారు. ఇలా గడువు పొడిగించడం ఇది మూడోసారి. టెండర్ల అగ్రిమెంట్ పూర్తిచేసినప్పటి నుంచి ఇప్పటివరకు కేవలం 10 లక్షల మెట్రిక్ టన్నులే తీసుకెళ్లారు. ఇంకా 25 లక్షల టన్నుల ధాన్యం రైస్‌మిల్లుల్లోనే మూలుగుతోంది. దీంతో చాలా సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రూ.50 వేల కోట్ల పైచిలుకు అప్పుల్లో ఉంది. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం విక్రయిస్తే.. రూ.7 వేల కోట్ల తక్షణ ఆదాయం వస్తుందనే ఆలోచనతో ప్రభుత్వం టెండర్లు పిలిచింది. కానీ ఇప్పటివరకు రూ.2 వేల కోట్లు మాత్రమే రికవరీ అయ్యాయి. ఇంకా రూ.5 వేల కోట్లు రావాల్సి ఉంది. కాగా, టెండరు ధాన్యం తీసుకెళ్లేందుకు బిడ్డర్లకు ఇప్పటివరకు ఇచ్చిన గడువు చాలా ఎక్కువని, మరోసారి గడువు పొడిగించవద్దంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు బీజేపీ శాసనసభాపక్ష ఉపనేత, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇటీవలే లేఖ రాశారు. టెండర్ల పద్ధతిలో జరిగిన లోపభూయిష్ట విధానాల ద్వారా ఇప్పటికే కార్పొరేషన్‌కు రూ.850 కోట్ల నష్టం వాటిల్లిందని లేఖలో పేర్కొన్నారు.

15 వేల ఇళ్లు!

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేసింది. హౌజింగ్ కార్పొరేషన్, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జీహెచ్ఎంసీ కమిషనర్, ఆయా జిల్లాల కలెక్టర్లు గృహాల కేటాయింపు ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించింది. మూసీనదిలో ఉన్న నిర్మాణాలకు సంబంధించి నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించిన తర్వాతే నిర్మాణాల తొలగింపు ప్రారంభమవుతుందని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ దాన కిశోర్ స్పష్టం చేశారు. మూసీ సర్వేలో భాగంగా మూసీనది గర్భంలో ప్రైవేటు వ్యక్తులకు సంబంధించి 2,166 నిర్మాణాలను గుర్తించారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలో 1595, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 239, రంగారెడ్డి జిల్లాలో 332 ఉన్నట్లుగా తేల్చారు. మరోవైపు మూసీ పరివాహక ప్రాంతంలో సర్వే చేసేందుకు బుధవారం ఎల్బీనగర్ అసెంబ్లీ పరిధిలోని కొత్తపేట, మారుతినగర్, సత్యానగర్ ప్రాంతాలకు ఉప్పల్ మండలం రెవెన్యూ సిబ్బంది వెళ్లగా మూసీ నిర్వాసితులు అడ్డుకున్నారు. తాము మూసీని నమ్ముకుని ఏళ్ల నుంచి నివాసముంటున్నామని, తమకు కనీస సౌకర్యాలు కల్పించకపోగా ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరుతో నిర్మించుకున్న గుడిసెలు, చిన్నచిన్న ఇళ్లను కూల్చేందుకు వస్తారా? అంటూ పలువురు నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము మూసీ పరీవాహక ప్రాంతంలోనే ఉన్నామని, తమ ఇళ్లు మూసీ సుందరీకరణకు ఏమాత్రం అడ్డంకి కాదంటూ రెవెన్యూ సిబ్బంది కారుకు అడ్డుగా నిల్చున్నారు. తాను ఇక్కడి ఇళ్లను ఖాళీ చేసి మరో ప్రాంతానికి తరలివెళ్లే పరిస్థితి లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా రెవెన్యూ సిబ్బంది కారు దిగేందుకు వీలులేకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత కొత్తపేట సత్యానగర్‌లోని మరో చోటకు వెళ్లి డిజిటల్ సర్వే చేశారు. కాగా కొత్తపేట, మారుతినగర్, సత్యానగర్‌లోని మూసీ పరీవాహక ప్రాంతంలో సర్వే చేసి ఎన్ని ఇళ్లు ఉన్నాయో గుర్తించేందుకు వచ్చిన ఉప్పల్ మండల రెవెన్యూ సిబ్బందిని అడ్డుకోవడంతో పరివాహక ప్రాంతంలోని ఇళ్ల మార్కింగ్ పనులు కూడా నిలిపోయాయి. . కాగా మూసీ పరీవాహక ప్రాంతంలో 302 అక్రమ నిర్మాణాలున్నట్లు అధికారులు గుర్తించారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పేర్కొన్నారు.

అమీన్‌పూర్‌లో అపార్ట్‌మెంట్లను పరిశీలించిన హైడ్రా

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని సర్వే నంబరు 151, 152లోని వివాదాస్పద భూముల్లో నిర్మాణంలో ఉన్న 'గోల్డెన్ కీ లాకీ' అపార్ట్‌మెంట్లను హైడ్రా బృందం పరిశీలించింది. సుమారు మూడెకరాల్లో హెచ్ఎండీఏ అనుమతితో కొనసాగుతున్న నిర్మాణాల్లో ఏ మేరకు అక్రమాలు ఉన్నాయన్న దానిపై నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. గతంలోనే సదరు నిర్మాణాలపై వెంకటరమణ కాలనీవాసులు హైడ్రాకు, సంగారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. కాగా వివాదాస్పదమైన సర్వేనెంబర్లలో సర్వేలు నిర్వహించి ముందు హద్దులు తేల్చాలని రంగనాథ్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు సర్వే కొనసాగించి హద్దులను నిర్ణయించి నివేదికను హైడ్రా కమిషనర్‌కు అందజేశారు.

సచివాలయ నిర్మాణ వ్యయంపై విజిలెన్స్ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

వ్యయం రూ.1,140 కోట్లకు చేరింది. ఇదే విషయాన్ని ఈ ఏడాది జూన్‌లో రోడ్లు, భవనాల శాఖ మంత్రికి సమర్పించిన నివేదికలో అధికారులు పొందుపర్చారు. ఇక సచివాలయంలోని విభాగాధిపతుల కార్యాలయాల్లో ఐటీ పరికరాల కోసం వెచ్చించిన నిధులు, వాటి కొనుగోళ్లలోనూ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఐటీ పరికరాల కొనుగోలుకు మొదట రూ.181 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా.. ఏకంగా ఇది రూ.361 కోట్లకు చేరింది. ఇటు సచివాలయం నిర్మాణం నుంచి ఇప్పటివరకు నాణ్యత పరీక్షలు జరగలేదన్న అంశం తాజాగా తెరమీదకు వచ్చింది. ఈ నేపథ్యంలోనే అసలు సచివాలయం నిర్మాణం, నాణ్యత నుంచి మొదలుకుని వెచ్చించిన నిధులపై నిగ్గు తేల్చాలని సర్కారు నిర్ణయించింది. కాగా, సచివాలయ నిర్మాణ వ్యయం పెంపుపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించినుందన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. 'ఔను.. ఖర్చు రెట్టింపైంది' శీర్షికన ఈ ఏడాది జూన్ 24న కథనాన్ని ప్రచురించింది.


ఆనాడే కాంగ్రెస్ అనుమానం..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కొంతకాలానికి రాష్ట్రానికి కొత్త సచివాలయం ఉండాలన్న నేపథ్యంలో గత ప్రభుత్వం పాత సచివాలయ భ వనాల సముదాయాన్ని కూల్చేసి, వాటి స్థానంలో నూతన సచివాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం 2019 జూన్ 27న అప్పటి సీఎం కేసీఆర్ పాత సచివాలయంలోని డీ-బ్లాక్ వెనుక భాగంలో శంకుస్థాపన చేయగా.. 2023 ఏప్రిల్ 30న ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. సచివాలయ నిర్మాణ వ్యయంపై ఆర్ అండ్ బీ అధికారులు అత్యంత గోప్యత పాటించారు. నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందనే వివరాలను తెలపాలంటూ ఎవరైనా సమాచార హక్కు చట్టం ద్వారా కోరినా.. నిర్మాణానికి ముందు ప్రభుత్వం విడుదల చేసిన రూ.617 కోట్లతో కూడిన జీవో గురించి మాత్రమే చెబుతూ వచ్చారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ కూడా సచివాలయం నిర్మాణం, ఖర్చుకు సంబంధించి పలు అనుమానాలను వ్యక్తం చేసింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సర్కారుకు అధికారులు సమర్పించిన నివేదికలో.. సచివాలయ నిర్మాణం, ఐటీ పరికరాలకు కలిపి మొత్తం వ్యయం రూ.1,501 కోట్లకు చేరిందన్న విషయం స్పష్టమైంది. కాగా, సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, అమరుల స్మారక స్తూపం నిర్మాణాలన్నింటినీ పర్యవేక్షించిన అధికారి ఇటీవలే రాజీనామా చేయగా, ప్రభుత్వం కూడా ఆమోదించింది. సదరు అధికారి రాజీనామా తర్వాత సచివాలయ నిర్మాణంపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం శాఖలో చర్చనీయాంశంగా మారింది.

జిల్లాల వారీగా డీఎస్సీ- 2008 అభ్యర్థుల జాబితా!

హైదరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాల వారీగా డీఎస్సీ- 2008 అభ్యర్థుల జాబితాను అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఈ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచారు. 2008 డీఎస్సీ అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిలో ఎస్జీటీ పోస్టులను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ జాబితాలోని చాలా మంది ఇప్పటికే ఆయా రంగాల్లో స్థిరపడినట్లు తెలుస్తోంది. కాబట్టి అతి కొద్దిమంది మాత్రమే ఈ కాంట్రాక్టు టీచర్ ఉద్యోగాలకు ముందుకు రావొచ్చని అధికారులు భావిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director: Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.



ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్- షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.
● వెబ్‌సైట్: ftii.ac.in

బేసిక్ కోర్స్ ఇన్ డిజిటల్ ఫిల్మ్ మేకింగ్

కోర్సు వ్యవధి అయిదు రోజులు. మొత్తం 45 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. నవంబరు 4 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు. కనీసం ఆరోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 11 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ కోర్సులో ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ లాంగ్వేజ్ అండ్ స్టోరీ టెల్లింగ్ టెక్నిక్స్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ఆర్కైవల్ టెక్నిక్స్ తదితర అంశాలు బోధిస్తారు.
● కోర్సు ఫీజు: రూ.7000
● ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 14

ఫౌండేషన్ కోర్స్ ఇన్ స్క్రీన్‌ప్లే రైటింగ్

కోర్సు వ్యవధి పదకొండు రోజులు. మొత్తం 24 సీట్లు ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో షార్ట్ ఫిల్మ్ స్ట్రక్చర్, రైటింగ్ ఫర్ స్క్రీన్‌ప్లే, టైమింగ్ ఇన్ సినిమా, అరిస్టాటిల్ పొయిటిక్స్ ఫర్ స్క్రీన్ రైటర్స్, సీన్ కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్స్, మిస్టరీ/సస్పెన్స్/సర్‌ప్రైజ్/ఐరనీ టూల్స్, డెవలపింగ్ షార్ట్ ఫిల్మ్ స్టోరీ అండ్ స్క్రీన్‌ప్లే తదితర అంశాలు బోధిస్తారు. నవంబరు 11 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు. ● కోర్సు ఫీజు: రూ.17,500
● ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 21

బేసిక్ కోర్స్ ఆన్ స్మార్ట్‌ఫోన్ డాక్యుమెంటరీ

కోర్సు వ్యవధి ఎనిమిది రోజులు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో స్మార్ట్‌ఫోన్‌తో ఫిల్మ్ మేకింగ్, ఎడిటింగ్ విధానాలు; క్వాలిటీ వీడియోలు తీయడం; ఫోన్‌ను వీడియో కెమెరాగా వినియోగించడం; సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవిధంగా డాక్యుమెంటరీలు, షార్ట్ వీడియోలు తీయడం; డాక్యుమెంట్ మెమొరీస్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 20 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి. ● కోర్సు ఫీజు: రూ.9,800
● ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30

బేసిక్ యాక్టింగ్ వర్క్‌షాప్

ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. దీని వ్యవధి పదకొండు రోజులు. రోజుకు రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు మరో బ్యాచ్ నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి. కనీసం మూడో తరగతి ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎనిమిది నుంచి పన్నెండేళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉదయం బ్యాచ్‌కు, పదమూడు నుంచి పదిహేడేళ్ల మధ్య వయసున్నవారు సాయంత్రం బ్యాచ్‌కు హాజరు కావాలి. ఈ కోర్సులో థియేటర్ గేమ్స్, ఇంప్రూవైజేషన్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైటింగ్, ఇమాజినేషన్, నవరసాలు, సీన్‌వర్క్, వాయిస్ అండ్ బ్రీతింగ్, అవేర్‌నెస్, మెమొరీ, కెమెరా వర్క్, ఆడిషన్ టెక్నిక్స్, ఆడిషన్ ప్రాక్టీస్, మ్యూజిక్ బేస్డ్ ఇమాజినేషన్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 29 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి. ● కోర్సు ఫీజు: రూ.10,000
● ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 7

ఆంధ్ర వర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి సెల్ఫ్ సపోర్టెడ్ కోర్సులు. ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ సహకారంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 40 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.55,000.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో క్రిటికల్ కేర్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 15 చొప్పున మొత్తం 45 సీట్లు ఉన్నాయి. గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్ ఎంచుకున్నవారికి ప్రోగ్రామ్ ఫీజు రూ.40,000. మిగిలిన స్పెషలైజేషన్‌లకు ప్రోగ్రామ్ ఫీజు రూ.60,000.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీఫార్మసీ/ బీఎస్సీ/ బీఎస్సీ నర్సింగ్/ బీఏఎంఎస్/ బీహెచ్ఎంఎస్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వయసు:** దరఖాస్తు నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 16
- **క్యాంపస్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, కిమ్స్-ఐకాన్ హాస్పిటల్ క్యాంపస్, షీలానగర్, విశాఖపట్నం-532003
- **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెద వాల్తేర్, విశాఖపట్నం-530003
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in



సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ)- 'రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్(పీహెచ్‌డీ)-1-2025'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్, మోడర్న్ బయాలజీ సంబంధిత అంశాలపై రీసెర్చ్ వర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అభ్యర్థులు కోర్సు పూర్తయ్యే వరకు క్యాంపస్‌లోనే ఉండాలి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు రౌండ్లు ఉంటాయి. నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వీడియో కాన్ఫరెన్స్ ఇంటర్వ్యూ, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. కోర్సులో చేరినవారికి రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తారు.

రీసెర్చ్ విభాగాలు
- సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ
- కంప్యూటేషనల్ బయాలజీ
- డిసీజ్ బయాలజీ
- జెనెటిక్స్
- మాలిక్యులర్ మైక్రో బయాలజీ
- ఇమ్యూనాలజీ


అర్హతలు: సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ ఐసీఎంఆర్/ఇన్‌స్పైర్/జెస్ట్/యూజీసీ-ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత పొంది ఉండాలి. జేఆర్ఎఫ్ అర్హత లేని అభ్యర్థులను ఇంటర్వ్యూకి అనుమతించరు. ఐసీఎంఆర్ నుంచి రెండేళ్ల ఫండెడ్ ప్రాజెక్ట్ స్కీమ్ కింద జేఆర్ఎఫ్ పొందినవారు, బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసి డీబీటీ జేఆర్ఎఫ్ నెట్ అర్హత ఉన్నవారు, డీబీటీ-బీ కేటగిరీ కింద జేఆర్ఎఫ్ నెట్ రాసినవారు, సీఎస్ఐఆర్-యూజీసీ(నెట్) ద్వారా ఎల్ఎస్ అర్హత పొందినవారు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 11
- **వెబ్‌సైట్:** www.cdfd.org.in

లెటర్ రిపీటెడ్ సిరీస్

టీజీపీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్



పార్ట్-2

13. c - ab - d - bcd - bc - ab
ఎ) aacdd బి) dcaad సి) cadad డి) acadd
సమాధానం: (బి)
వివరణ: cdab/ cdab/cdab/cdab
ఒకే విధమైన నాలుగేసి అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడ్డాయి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు dcaad.

14. a - abb - c - caa - b - b
ఎ) abacb బి) acaba సి) abcab డి) aabbc
సమాధానం: (సి)
వివరణ: aaa/bbb/ccc/aaa/bbb
ప్రతి సమూహంలో ఒక అక్షరమే మూడుసార్లు ఉంది
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు abcab.

15. d - ab - dca - d - cab - d - abd
ఎ) cdbddc బి) cbdcdc సి) bcdded డి) abccdd
సమాధానం: (ఎ)
వివరణ: dcabd/dcabd/dcabd/dcabd
ఒకే విధమైన ఐదేసి అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడ్డాయి
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు cdbddc.

16. L - N - NL - LM - M -
ఎ) MMNLN బి) LMNMN సి) LMMNN డి) MNMNL
సమాధానం: (ఎ)
వివరణ: LMN/MNL/NLM/LMN
మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉంది. రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉంది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు MMNLN.

17. l - mm - n - l - l - m.
ఎ) mnmnl బి) mnnlm
సి) lmmnn డి) mnnnl
సమాధానం: (బి)
వివరణ: lmm /mnn / nll / lmm
ప్రతి సమూహంలో చివరి రెండు అక్షరాలు ఒకటే.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు mnnlm.

18. k - ln - ml - k - l n - m - n.
ఎ) kmkmln బి) kmlkmn సి) mknmkl డి) kkmmnl
సమాధానం: (సి)
వివరణ: kmln/kmln/kmln/kmln.
ఒకే విధమైన నాలుగేసి అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడ్డాయి. ∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు mknmkl.

19. a - ca - b - aab - ca - bb - c
ఎ) bacbac బి) aabbcc సి) abcabc డి) ababcc
సమాధానం: (ఎ)
వివరణ: abc/aabc/aabbc/aabbcc
మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో అయిదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. రెండో సమూహాన్ని గమనిస్తే మొదటి సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ a స్థానం వద్ద మరొక a అదనంగా చేరింది. మూడో సమూహంలో రెండో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ b స్థానం వద్ద మరో b అదనంగా చేరింది. నాలుగో సమూహంలో మూడో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ c స్థానం వద్ద మరో c అదనంగా చేరింది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు bacbac.

20. PQ - SQR - P - SP - S - QRP - RS
ఎ) PQRQRS బి) RSRQPQ సి) PQQRRS డి) PQRSRQ
సమాధానం: (బి)
వివరణ: PQRS/QRSP/RSPQ/SPQR/PQRS
మొదటి సమూహంలో చివరి మూడు అక్షరాలు రెండో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, మొదటి సమూహంలో ఒకటో అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉంది. రెండో సమూహంలో చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉంది. ఈవిధంగా ఒక సక్రమమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు RSRQPQ.

21. P - P - QP - P - PP - PQ
ఎ) QPPQP బి) PPPQQ సి) PQPQP డి) QQPPQ
సమాధానం: (ఎ)
వివరణ: PQ/PPQ/PPPQ/PPPPQ
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'P' అదనంగా చేరుతున్నది.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు QPPQP

22. P - QQQ - R - PP - Q
ఎ) RPRP బి) PRRP సి) PRPR డి) RRPP
సమాధానం: (బి)
వివరణ: PPQ/QQR/RRP/PPQ
ప్రతి సమూహంలో మొదటి రెండు ఒకటే.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు PRRP.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

జాబ్ కార్నర్

వెస్ట్రన్ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు: 5,066

ముంబయి ప్రధాన కేంద్రంగా గల రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)- కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

డివిజన్/వర్క్‌షాప్‌లు: బీసీటీ డివిజన్, బీఆర్‌సీ డివిజన్, ఏడీఐ డివిజన్, ఆర్‌టీఎం డివిజన్, ఆర్‌జేటీ డివిజన్, బీవీపీ డివిజన్, పీఎల్ వర్క్‌షాప్, ఎంఎక్స్ వర్క్‌షాప్, బీవీపీ వర్క్‌షాప్, డీహెచ్‌డీ వర్క్‌షాప్, పీఆర్‌టీఎన్ వర్క్‌షాప్, ఎస్‌బీఐ ఇంజనీరింగ్ వర్క్‌షాప్, ఎస్‌బీఐ సిగ్నల్ వర్క్‌షాప్, హెడ్ క్వార్టర్ ఆఫీస్.

ట్రేడ్: ఫిట్టర్, వెల్డర్, టర్నర్, మెషినిస్ట్, కార్పెంటర్, పెయింటర్, మెకానిక్, పీఏఎస్ఏ, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, వైర్‌మన్, మెకానిక్ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, పైప్ ఫిట్టర్, ప్లంబర్, డ్రాఫ్ట్స్‌మన్, స్టెనోగ్రాఫర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్.

అర్హత: పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 అక్టోబరు 22 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

శిక్షణ కాలం: ఒక సంవత్సరం

ఎంపిక ప్రక్రియ: పదో తరగతి, ఐటీఐ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. రాత పరీక్ష/వైవా ఉండదు.

దరఖాస్తు ఫీజు: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 22

వెబ్‌సైట్: https://www.rrc-wr.com/

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్స్

ఖాళీలు: 250

ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీ (ఐఎన్ఏ)లో 2025 జూన్ నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సులో ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

1. జనరల్ సర్వీస్(జీఎస్-ఎక్స్/హైడ్రో క్యాడర్): **56 పోస్టులు**
2. పైలెట్: **24 పోస్టులు**
3. నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్(ఎయిర్ క్రూ): **21 పోస్టులు**
4. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: **20 పోస్టులు**
5. లాజిస్టిక్స్: **20 పోస్టులు**
6. నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: **16 పోస్టులు**
7. ఎడ్యుకేషన్: **15 పోస్టులు**
8. ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): **36 పోస్టులు**
9. ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): **42 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీకాం, బీఈ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు. **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 29

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in/

లిటిల్స్


అపాయంలో ఉపాయం



ఒక అడవిలోని కొలనులో ఒక తాబేలు నివసించేది. అది ఒక సాయంత్రం కొలనులోనుంచి బయటకు వచ్చి అటుఇటు తిరుగుతూ ఉంది, దూరంనుండి ఓ నక్క అటుగా రావడం చూసిన తాబేలు నీళ్లలోకి వెళ్లిపోవాలి అనుకున్నది,కానీ ఈలోగానే దాన్ని ఆ నక్క చూసింది నక్క తాబేలును తినాలి అనుకుని దగ్గరగా వచ్చితాబేలు డిప్ప మీద దాకి ఇదేమిటి ఇంత గట్టిగా ఉంది అన్నది. విషయం అర్థమైన తాబేలు నక్కతో ఇలా అన్నది. 'ఓ నక్కబావా నేను నీళ్లలో ఉన్నంత సేపే మెత్తగా ఉంటాను నీళ్లలో నుండి బయటకు రాగానే ఇలా గట్టిపడిపోతాను కాబట్టి నన్ను మరలా కాసేపు నీళ్లలో నాననివ్వు.అపుడు నన్ను తిందువుగాని' అన్నది. ఆ మాటలు జిత్తులమారి నక్క కొంత వరకే నమ్మింది.తాబేలు తననుండి తప్పించుకోవడానికి ప్రయత్నించకుండా చూడాలి అనుకుంది.

తాబేలును నీళ్లలో మునగనిచ్చి తాబేలు డిప్ప మీద తన కాలును అదిమిపట్టి తాబేలు తప్పించుకుని పోకుండా చూసింది. కాసేపటి తర్వాత తాబేలు 'నక్క బావా నేను మొత్తంనీళ్లలో నాని మెత్తబడ్డాను ఒక్క నువ్వు కాలు అదిమి పెట్టిన ప్రదేశంలో తప్ప. కాబటిట్ట, ఆకాలును కొద్దిగా పక్కకితీస్తే,నేను అక్కడ కూడా మెత్తబడిపోయి వస్తాను అనగానే అది నమ్మిన నక్కతనకాలు పక్కకు జరిపింది. ఇదేఅదనుగా తాబేలు చటుక్కున కొలనులోకి జారి మాయమైపోయింది.

7 తేడాలను కనిపెట్టండి





ఏవి ఎన్ని?



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 419

		7			6			
	3	4	8					5
1	6				4			
	4				8	9	3	
8								1
	1	5	2				4	
			6				9	3
6					3	4	8	
			1			5		

సుడోకు - 418 సమాధానం

5	9	1	2	3	8	4	6	7
4	2	3	6	5	7	1	8	9
6	8	7	1	4	9	5	2	3
2	3	8	7	6	1	9	5	4
9	7	4	5	2	3	8	1	6
1	6	5	9	8	4	7	3	2
7	4	2	8	1	6	3	9	5
3	1	6	4	9	5	2	7	8
8	5	9	3	7	2	6	4	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.